ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002


# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 20.10.2025 | సంపుటి :12 సంచిక : 90 | పేజీలు :12 వెల : రూ. 4/-

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



'జనంసాక్షి' పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
**దీపావళి శుభాకాంక్షలు**

## సెలవు

పండుగ సందర్భంగా పత్రికా కార్యాలయానికి నేడు సెలవు. కావున రేపటి సంచిక వెలువడదు. పునదర్శనం బుధవారం

## జేఈఈ మెయిన్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ(జనంసాక్షి):జేఈఈ మెయిన్ పరీక్షకు సన్నద్ధమవుతోన్న లక్షలాది మంది విద్యార్థులకు ఎన్‌టీఏ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రెండు సెషన్లలో నిర్వహించే

మిగతా 9లో..



# భూభారతితో కర్షకుల కన్నీళ్లు తుడిచాం

## దొరలకు చుట్టంలా 'ధరణి' • బీఆర్ఎస్ ఓటమికి ఆ చట్టమే కారణం

గత ప్రభుత్వంలో ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవి • ఏడాదిలోనే 60వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
త్వరలోనే గ్రూప్-3,4 అభ్యర్థులకు నియామక పత్రాలు • సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేసిన సీఎం రేవంత్




హైదరాబాద్(జనంసాక్షి): భూమి మీద ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగాయని, సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు తిరగబడే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాటాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టం.. కొంతమంది దొరలకు చుట్టంగా మారిందన్నారు. ఆ చట్టాన్ని అడ్డుపెట్టుకొని

మిగతా 2లో..

## ఎమ్మెల్యేల అర్హత వయస్సు 21 ఏళ్లకు కుదించాలి

- ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- గాంధీ కుటుంబం దేశానికి స్ఫూర్తినిచ్చింది
- రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో..

## హైదరాబాద్ అభివృద్ధికి యాదవుల సహకారం కావాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో..

## ప్రజాపాలనలో చీకట్లు తొలగిపోయాయి

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు

# కేసీఆర్ మళ్లీ సీఎం కావాల్సిందే

- అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తాం
- ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను కూలుస్తున్నారు
- మూసీకి అడ్డంగా కడుతున్న బడా నేతలను మాత్రం పట్టించుకోవట్లేదు • కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలింది: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి) కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని.. తెలంగాణ మళ్లీ పట్టాలు ఎక్కాల్సిందేనని కేటీఆర్ అన్నారు. ఇంతకు ముందు లెక్క ఉండదని..

మిగతా 2లో..




## శాంతికి ఓకే

- పాక్-ఆఫ్ఘన్ మధ్య ఫలించిన చర్చలు
- ఖతార్, తుర్కియే మధ్యవర్తిత్వంతో తక్షణ కాల్పుల విరమణకు ఇరు దేశాల అంగీకారం

2లో..

## అతిపెద్ద మ్యూజియంలో భారీ చోరీ..

- ఏడు నిమిషాల వ్యవధిలోనే భారీ దోపిడీ
- పారిస్ నగరంలో సంచలనం సృష్టించిన ఘటన

## సోనూ, సతీష్‌లు విప్లవ ద్రోహులు

3లో..

- పార్టీకి చెందిన 30 తుపాకుల్ని శత్రువుకు అప్పగించారు
- ద్రోహులకు శిక్ష తప్పదు • మావోయిస్టు పార్టీ ప్రకటన





పోలీస్ అమరవీరులకు జోహార్లు



కీ॥శే॥ ఉమేష్ చంద్ర IPS | కీ॥శే॥ కె.ఎస్.వ్యాస్ IPS | కీ॥శే॥ పరదేశి నాయుడు IPS

తమ జీవితాలలోని ప్రతీక్షణాన్ని ప్రజల కోసమే వినియోగించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు ఛాష్పాంజలి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (అక్టోబర్ 21)
విధి నిర్వహణలో అమరవీరులైన పోలీస్ వీరులకు ఇదే మా భాష్పాంజలి

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ & సిబ్బంది

Ad Space Donated by

Customer Care : 90 99 999 916

Lalithaa® లలితా జ్యూవెల్లరి మార్ట్ లిమిటెడ్
www.lalithaajewellery.com

విజయవాడ • వైజాగ్ • గోపాలపట్నం • విజయనగరం • అనకాపల్లి • గాజువాక • శ్రీకాకుళం • కాకినాడ • భీమవరం • అమలాపురం • రాజమహేంద్రవరం గుంటూరు • ఒంగోలు • నరసారావుపేట •అనంతపురం • కర్నూలు • కడప • సూళ్లూరుపేట • గూడూరు • నెల్లూరు • చిత్తూరు • తిరుపతి • తుని

హైదరాబాద్



సుచిత్రా సర్కిల్: ఏ సర్కిల్, గ్రీన్ పార్క్ అవెన్యూ, సుచిత్రా రోడ్. ఫోన్: 040 - 2703 5555
సోమాజిగూడ: SBR టాక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.
కూకట్‌పల్లి: PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం. ఫోన్: 040 - 2384 2277.
దిల్‌సుఖ్‌నగర్: అర్చన కాంప్లెక్స్, కమలా నగర్ రోడ్, మెట్రో పిల్లర్ 1558 కు ఎదురుగా, చైతన్యపురి సర్కిల్. ఫోన్: 040 29334505.
చందానగర్: ఇన్ఫినిటి మాల్ ఫోన్: 040 - 29343501

వరంగల్: రాయపుర, హన్మకొండ మెయిన్‌రోడ్, హన్మకొండ. ఫోన్: 89258 48144 / 45 సికింద్రాబాద్: 3-3-14, కింగ్స్ వే, ఆర్ పి రోడ్. ఫోన్: 8925990417 / 18 ఖమ్మం: వైరా రోడ్ తెలంగాణ. ఫోన్: 89259 90411 / 12. మిర్యాలగూడ: సాగర్ రోడ్, వైష్ణవి హోటల్ ఎదురుగా, నల్గొండ. ఫోన్: 89259 90413 / 14. నిజామాబాద్: ద్వారకా నగర్, గోపాల్‌బాగ్, హైదరాబాద్ రోడ్. ఫోన్: 08462-233555.



స్వచ్ఛమైన బంగారు నగలు 100% HUID

హోల్‌సేల్ ధర కన్నా తక్కువ ధర!
ఎక్కువ డబ్బులు ఆదా చేస్తారు!

దాదాపు 'తరుగు లేదు' అనే విధంగా తక్కువ తరుగుకు విక్రయిస్తున్నాం! అన్నీ HUID ముద్ర కలిగిన నగలు. పెద్ద మొత్తంలో డబ్బులు ఆదా చేస్తారు.

డబ్బులు ఎవరికి ఊరికే రావు!

మా తరుగుతో పోల్చి చూడండి








ప్రజలకు, భక్తులకు, నాయకులకు,
అధికారులకు, బంధు మిత్రులకు,
శ్రేయోభిలాషులకు,

దీపావళి శుభాకాంక్షలు



అక్రమ నిర్మాణాలను నిలిపేద్దాం..
అనుమతులు పొంది భవనాలు నిర్మించి
విశ్వనగర అభివృద్ధికి తోడ్పడుదాం...

హేమంత్ ఐఏఎస్ జోనల్ కమిషనర్ శేరిలింగంపల్లి | శశిరేఖ చందానగర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ | నాగిరెడ్డి ఏసిపి, చందానగర్ | రమేష్, రోహన్ టీపీఎస్‌లు, చందానగర్ | శ్రీనివాస్, కరణ్, లింగం చైన్‌మెన్‌లు, చందానగర్

చందానగర్ టౌన్ ప్లానింగ్ విభాగం



# శాంతికి ఓకే

● పాక్‌-ఆఫ్ఘన్‌ మధ్య ఫలించిన చర్చలు
● ఖతార్‌, తుర్కియే మధ్యవర్తిత్వంతో తక్షణ కాల్పుల విరమణకు ఇరు దేశాల అంగీకారం

**దోహా(జనంసాక్షి):** కొద్ది రోజులుగా పాకిస్తాన్‌-ఆఫ్ఘనిస్థాన్‌ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఖతార్‌, తుర్కియే మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య శాంతి చర్యలు ఫలించాయి.పాక్‌-ఆఫ్ఘన్‌ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ మేరకు ఖతార్‌ విదేశాంగ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో రెండు దేశాల సరిహద్దులో దాడులు నిలిచిపోనున్నాయి.ఖతార్‌ రాజధాని దోహా వేదికగా పాకిస్తాన్‌, ఆఫ్ఘనిస్థాన్‌ మధ్య శాంతి చర్చలు జరిగాయి. ఈ చర్చలకు ఖతార్‌, తుర్కియే మధ్యవర్తిత్వం వహించాయి. చర్చల్లో పాల్గొనేందుకు ఇరుదేశాలకు చెందిన రక్షణ మంత్రులు ఖతార్‌ వచ్చారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణకు సంబంధించి కీలకంగా చర్చించారు. రెండు దఫాలుగా జరిగిన ఈ చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. దీంతో, శాంతి చర్చలు ఫలించాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన స్థిరత్వాన్ని కొనసాగించడంపై రానున్న రోజుల్లో మరిన్ని చర్చలు జరిపేందుకు కూడా వారు అంగీకరించారని ఖతార్‌ వెల్లడించింది. ఈ మేరకు ఖతార్‌ (%ఞ్ఘుతీ%) విదేశాంగ మంత్రిత్వశాఖ స్వయంగా ఓ ప్రకటనలో వివరాలను వెల్లడించింది.ఇక, శుక్రవారం అర్ధరాత్రి ఆఫ్ఘనిస్థాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై పాక్‌ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. పాక్‌ చేసిన దాడుల్లో యువ క్రికెటర్లు, మహిళలు, చిన్నారులతో సహా కనీసం 10 మంది మృతి చెందారు. ఈ క్రమంలో పక్క దేశం నుంచి వస్తున్న దురాక్రమణలకు మాత్రమే ప్రతిస్పందిస్తున్నామన్నట్లుగా ఇరువర్గాలు వాదనలు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఆఫ్ఘన్‌ నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయడంతో పాటు సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ చర్యలపై మాత్రమే దృష్టి పెట్టామని పాక్‌ పేర్కొంది. సరిహద్దుల్లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలను ఆఫ్ఘన్‌ ఖండించింది.

# 25 వేల మరణాలను అడ్డుకున్నా..

● అమెరికా సైనిక దాడిలో భారీ మాదకద్రవ్యాల జలాంతర్గామి ధ్వంసమైంది ● ట్రంప్‌ సంచలన ప్రకటన

**వాషింగ్టన్‌(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ మరోమారు సంచలన ప్రకటన చేశారు. ఇటీవల కరేబియన్‌లో అమెరికా జరిపిన సైనిక దాడిలో ఒక భారీ మాదకద్రవ్యాల జలాంతర్గామి ధ్వంసమైందని, ఈ దాడిలో ఇద్దరు నార్కో ఉగ్రవాదులను హతం చేశామని, మరో ఇద్దరిని సజీవంగా పట్టుకున్నామని తెలిపారు.ఈ దాడికి సంబంధించిన వీడియోను కూడా ఆయన షేర్‌ చేశారు. అధ్యక్షుడు ట్రంప్‌ తన ట్రూత్‌ సోషల్‌లో పోస్ట్‌ చేసిన ఒక ప్రకటనలో.. 'ఆ జలాంతర్గామిలో అధికంగా ఫెంటానిల్‌ తదితర మాదకద్రవ్యాలు ఉన్నాయని, అది నార్కోట్రాఫికింగ్‌ ట్రాన్సిట్‌ రూట్‌ ద్వారా అమెరికా వైపు వస్తున్నదని, దానిని అడ్డగించడం ద్వారా 25 వేల అమెరికన్ల మరణాలను నిరోధించగలిగానని' ట్రంప్‌ పేర్కొన్నారు.తన సోషల్‌ మీడియా పోస్టులో ట్రంప్‌.. 'ఒక భారీ మాదకద్రవ్యాల జలాంతర్గామిని నాశనం చేయడమనేది నాకు లభించిన గొప్ప గౌరవం. ఓడలో అధికంగా ఫెంటానిల్‌ ఉందని యూఎస్‌ ఇంటెలిజెన్స్‌ నిర్ధారించింది. ఆ జలాంతర్గామిలో నలుగురు నార్కోటెర్రరిస్టులు ఉన్నారు. వారిలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. సజీవంగా ఉన్న ఇద్దరు ఉగ్రవాదులను వారి స్వదేశాలైన ఈక్వెడార్‌, కొలంబియాకు విచారణ కోసం తిరిగి పంపుతున్నారు' అని పేర్కొన్నారు.ఈ దాడి తర్వాత అమెరికా నావికాదళం ఇద్దరు ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకుందని, వారిని ఒక అమెరికన్‌ యుద్ధనౌకలో ఉంచిందని ఫాక్స్‌ న్యూస్‌ ధృవీకరించింది. కాగా గత నెలలో కరేబియన్‌లో యుద్ధ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుండి అమెరికా అనుమానిత మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను అడ్డగించడం ఇది ఆరోసారి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు గట్టి దెబ్బ తగిలిందని చెబుతున్న అమెరికా అధికారులు.. ఈ దాడుల్లో హతమైన 27 మంది మాదకద్రవ్యాల స్మగ్లర్లే అని ధృవీకరించే ఎటువంటి ఆధారాలను మీడియాకు అందించలేదు. ఈ రీతిలో అంతమొందించడం చట్టవిరుద్ధమని నిపుణులు వాదిస్తున్నారు.

# భారతీయులను బహిష్కరించాలి

అమెరికా నేత విద్వేషపూరిత వ్యాఖ్యలు

**వాషింగ్టన్‌(జనంసాక్షి):**అమెరికాకు చెందిన రాజకీయ నేత చాండ్లర్‌ లాంగేవిన్‌ భారతీయులకు వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది. యూఎస్‌లో ఉన్న ప్రతి భారతీయుడిని వెంటనే బహిష్కరించాలంటూ ఆయన పెట్టిన పోస్టులపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో పామ్‌ బే నగర కౌన్సిల్‌ ఆయనపై చర్యలు తీసుకుంది.చాండ్లర్‌ లాంగేవిన్‌ ఫ్లోరిడాలోని పామ్‌ బే సిటీ కౌన్సిల్‌కు చెందిన యూఎస్‌ కన్జర్వేటివ్‌ నాయకుడు. ఆయన భారతీయుల ను ఉద్దేశిస్తూ పెట్టిన విద్వేషపూరిత పోస్టులపై అక్కడి భారతీయ అమెరికన్‌ గ్రూపులతో పాటు కాంగ్రెస్‌ సభ్యుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. గత నెల నుంచి లాంగేవిన్‌ భారతీయులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ వచ్చారు. ఓ భారతీయ ట్రక్‌ డ్రైవర్‌ చేసిన ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందనే వార్తను లాంగేవిన్‌ పంచుకున్నారు. దీనికి 'అమెరికాలోని భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలి' అని రాసుకొచ్చారు. ఆ తర్వాత 'అమెరికా గురించి పట్టించుకునేందుకు ఒక్క భారతీయుడు కూడా లేరు. వారు మనల్ని ఆర్థికంగా దోపిడి చేస్తున్నారు. భారత్‌ను, ఆ దేశ ప్రజలను ప్రోత్సహించేందుకే ఇక్కడ ఉన్నారు. అమెరికన్ల కోసం మాత్రమే ఈ దేశం' అని మరో పోస్టులో వ్యాఖ్యానించారు. లాంగేవిన్‌ వ్యాఖ్యలను పామ్‌ బే మేయర్‌ మదీనా తీవ్రంగా తప్పుబట్టారు. ఇతరులను కించపరిచేలా, విలువలు తగ్గించేలా మన మాటలు ఉండకూడదని, అలాంటి వారికి ఇక్కడ చోటులేదని ఘాటుగా బదులిచ్చారు..

# మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోండి

నేతలకు కేంద్రమంత్రి బండి సంజయ్‌ హెచ్చరిక

**హైదరాబాద్‌(జనంసాక్షి):** ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మార్గదర్శకత్వంలో కేంద్ర సంస్థలు మావోయిస్టు నిర్మూలనకే పరిమితం కావడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్‌ అన్నారు. అవినీతి, నేరం, ఉగ్రవాద సంబంధాల నెట్‌వర్క్‌ను సైతం వెలికితీస్తున్నాయని చెప్పారు. మావోయిస్టులకు మద్దతిస్తున్న నేతలు సాయుధ వర్గాలతో సంబంధాలను తెంచుకోవాలని కోరారు. ఈ మేరకు 'ఎక్స్‌'లో బండి సంజయ్‌ సంచలన పోస్ట్‌ పెట్టారు. "రాజకీయ రంగస్థలంలో ప్రజాస్వామ్యం గురించి వల్లెవేస్తూ.. మావోయిస్టులకు మద్దతిస్తున్న నేతలారా.. ఇదే మా హెచ్చరిక. సాయుధ వర్గాలతో సంబంధాలను తెంచుకోండి. లేనిపక్షంలో మీ గుట్టు బయటపడుతుంది. దేశభద్రతకు ముప్పుగా పరిణమించే వాళ్లు ఎవరైనా సరే తప్పించుకోలేరు. కేంద్ర సంస్థలు కఠిన చర్యలు తీసుకోబోతున్నాయి. అంతర్గత భద్రత విషయంలో రాజీలేదు. తప్పువైపు నిలబడే వారెవరైనా సరే.. పడిపోక తప్పదు" అని ఆయన పేర్కొన్నారు.

# 'భూభారతి'తో కర్షకుల కన్నీళ్లు తడిచాం

భూమి మీద అధిపత్యం చెలాయించాలని చూశారన్నా రు. " మా గెలుపునకు అనేక కారణాలు ఉండొచ్చు. కానీ, భారత రాష్ట్ర సమితి ఓటమికి ధరణి చట్టమే కారణం. అధికారంలోకి వస్తే ధరణి నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం మా ప్రభుత్వం రాగానే ఆ చట్టాన్ని తొలగించి భూ భారతి తీసుకొచ్చాం. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఇచ్చినా పరీక్షలు పెట్టలేదు. ఒకవేళ పరీక్షలు పెట్టినా ప్రశ్నాపత్రాలు జిరాక్స్‌ సెంటర్లలో దొరికేవి. గత ప్రభుత్వ హయాంలో టీజీపీఎస్సీ పునరావస కేంద్రంగా ఉండేది. మా ప్రభుత్వం రాగానే ప్రక్షాళన చేశాం. ఏడాదిలోనే 60వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. మేం ఉద్యోగాలు ఇస్తుంటే.. కోర్టులో కేసులు వేసి అపాలని చూస్తున్నారు. కోర్టుల్లో పోరాడి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్నాం. త్వరలోనే గ్రూప్‌-3, గ్రూప్‌-4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తాం. లైసెన్స్‌ పొందిన సర్వేయర్లంతా బాధ్యతా యుతంగా వ్యవహరించి, రైతులకు సాయం చేయాలి" అని రేవంత్‌ అన్నారు.

## ఎమ్మెల్యేల అర్హత వయస్సు 21 ఏళ్లకు కుదించాలి

● ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
● గాంధీ కుటుంబం దేశానికి స్ఫూర్తినిచ్చింది
● రాహుల్‌ గాంధీ స్ఫూర్తితోనే కులగణన చేసి, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం
● రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ సభలో సీఎం రేవంత్‌



**హైదరాబాద్‌(జనంసాక్షి):** మన దేశంలో అన్ని మతాల సహజీవనం స్ఫూర్తినిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం కూడా దేశానికి అదే విధంగా స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. చార్మినార్‌ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ సభ నిర్వహించారు. రాజీవ్‌ చిత్రపటం వద్ద సీఎం, మంత్రులు నివాళులర్పించారు. "గత 35 ఏళ్లుగా రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర జరుగుతోంది. గాంధీ.. దేశానికి పర్యాయపదం. తమపై పోరాడిన మహాత్మాగాంధీని బ్రిటిషర్లు ఏమీ చేయలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది నెలల్లోనే మతతత్వవాదులు ఆయన్ను పొట్టనపెట్టుకున్నారు. గాంధీని హత్య చేసిన వారు బ్రిటీషనర్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తులు. దేశ సమగ్రత, సమైక్యత కాపాడటానికి ఇందిరాగాంధీ ప్రాణాలు కోల్పోయారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్‌ గాంధీ స్ఫూర్తితోనే కులగణన చేసి, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం అన్నారు. ఎమ్మెల్యేల అర్హత వయస్సు 21 ఏళ్లకు కుదించాలని, ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తామన్నారు.

# ప్రజాపాలనలో చీకట్లు తొలగిపోయాయి

● తెలంగాణ ప్రజల జీవితాల్లో ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చింది
● రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు

**హైదరాబాద్‌(జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజల జీవితాల్లో ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వెలుగుల పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డి



# హైదరాబాద్‌ అభివృద్ధికి యాదవుల సహకారం కావాలి

**హైదరాబాద్‌(జనంసాక్షి):**
అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిథ్యంలో యాదవులకు సముచిత స్థానం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ ఎన్టీఆర్‌ స్టేడియంలో సదర్‌ ఉత్సవాన్ని సీఎం ప్రారంభించారు. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం.. సదర్‌ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించలేదన్నారు. కాంగ్రెస్‌ వచ్చాక సదర్‌ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ పార్టీ యాదవులకు రాజకీయ అవకాశాలు కల్పించిందని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వంలో యాదవులది అత్యంత కీలకమైన పాత్ర అన్నారు. వారికి మరిన్ని అవకాశాల కోసం పార్టీ పెద్దల దృష్టికి తెస్తామని వివరించారు. హైదరాబాద్‌ అభివృద్ధికి యాదవుల సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి, పొన్నం,వాకిటి శ్రీహరి, బండారు దత్తాత్రేయ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌.రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# 'దొనెట్స్క్‌'ను అప్పగిస్తేనే యుద్ధం ముగిస్తాం

ట్రంప్‌నకు తేల్చిచెప్పిన పుతిన్‌

**మాస్కో(జనంసాక్షి):**ఉక్రెయిన్‌ లోని అత్యంత కీలకమైన ప్రాంతాన్ని తమకు అప్పగించాల్సిందేనని మాస్కో పట్టుబడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ రష్యా అధినేత పుతిన్‌ మధ్య గత వారం జరిగిన సుదీర్ఘ ఫోన్‌కాల్‌ సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు శ్వేతసౌధం అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్‌ పోస్ట్‌ కథనంలో పేర్కొంది. దొనెట్స్క్‌ ప్రాంతాన్ని మాస్కో సేనలు స్వాధీనం చేసుకోవడానికి దాదాపు 11 ఏళ్ల నుంచి వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తాజాగా దీనిని తమకు అప్పగించి తీరాల్సిందేనని పుతిన్‌ పట్టుపడుతుండటంతో.. యుద్ధం కొనసాగుతోంది .ఇటీవల ఫోన్‌ కాల్‌లో పుతిన్‌ ఓ ప్రతిపాదనను ట్రంప్‌ ఎదుట ఉంచినట్లు తెలుస్తోంది. ఇప్పటి తమ సేనల ఆధీనంలో ఉన్న జపొరిజియా, ఖేర్సాన్‌ ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు సానుకూలతను వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా ఉక్రెయిన్‌ దొనెట్స్క్‌ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు వాషింగ్టన్‌ పోస్టు కథనంలో వెల్లడించింది. వాస్తవానికి అలాస్కాలో జరిగిన ట్రంప్‌-పుతిన్‌ భేటీతో పోలిస్తే తాజా ఫోన్‌కాల్‌లో రష్యా కొంత మెత్తబడినట్లు తెలుస్తోంది.అయితే అదే రోజు ఉక్రెయిన్‌ అధినేత జెలెన్‌స్కీతో కూడా ట్రంప్‌ భేటీ అయ్యారు. నాడు అమెరికా అధినేత విడుదల చేసిన ప్రకటనలో మాత్రం పుతిన్‌ డిమాండ్లను ప్రస్తావించలేదు. పుతిన్‌ డిమాండ్లపై ఉక్రెయిన్‌ లేదా ఐరోపా సానుకూలంగా లేనట్లు తెలు స్తోంది. ఎటువంటి ప్రయోజనం లేకుండానే.. శరీరం లోని ఓ భాగాన్ని ఇచ్చేసినట్లు ఉందని నిపుణులు అభివర్ణించారు. వాషింగ్టన్‌ పోస్టు కథనంపై క్రెమ్లిన్‌ లేదా వైట్‌హౌస్‌ స్పందించలేదు. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని ఐదో వంతు భూభాగాన్ని రష్యా ఆక్రమించిన విషయం తెలిసిందే.

# కేసీఆర్‌ మళ్లీ సీఎం కావాల్సిందే..



అందరి లెక్కలు తేలస్తామన్నారు. రాజేంద్ర నియోజకవర్గానికి చెందిన మాజీ డీసీఎంఎస్‌ చైర్మన్‌, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్‌, ఆయన కుమారుడు పెద్దషాపూర్‌ మాజీ సర్పంచ్‌ చెక్కల చంద్రశేఖర్‌, 2018లో జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా పోటీచేసిన అంజిబాబు దంపతులు తమ అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేటీఆర్‌ మాట్లాడుతూ.. ఆక్రమణల పేరుతో పేదల ఇండ్లను కూలుతున్నారని.. ఇప్పటివరకు ఒక్క బడా వ్యక్తి ఇంటిని కూల్చలేకపోయిందని.. మూసీకి అడ్డంగా కడుతున్నవారిని ఎవరూ పట్టించుకోవట్లేదని విమర్శించారు. బడా నేతల ఇళ్లు కూల్చివేసేందుకు హైడ్రాకు దారి దొరకడం లేదని.. కానీ, పేదల వద్ద నివాస పత్రాలు ఉన్నా రాత్రికి రాత్రే కూల్చివేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌ సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు చెరువులోనే ఉందని.. ఆ ఇంటి జోలికి మాత్రం వెళ్లడం లేదన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌ చెరువులో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్‌ ఇళ్లు చెరువులోనే ఉన్నా వాటిని ముట్టుకోవడం లేదని.. కేవీపీ రామచంద్రరావు ఇంటి జోలికి కూడా వెళ్లడం లేదని.. పెద్ద ఇండ్ల అడ్రస్‌లు కూడా హైడ్రాకు తెలియదంటూ సెటైర్లు వేశారు. పేదల ఇళ్లు కూలిస్తే అడిగేవారే లేరని భావిస్తున్నారన్నారు. పెద్దల వద్ద డబ్బులు గుంజి బెదిరింపులకు దిగుతున్నారని.. రియల్‌ ఎస్టేట్‌ కుప్పకూలడానికి ప్రభుత్వ విధానాలే కారణమని మండిపడ్డారు.ఈ దిక్కుమాలిన ఆలోచనలు, విధానాలతోనే రాష్ట్రంలో రియల్‌ ఎస్టేట్‌ కుప్పకూలిపోయిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే సీఎం మొదట దెబ్బకొట్టింది రాజేంద్రనగర్‌ నియోజకవర్గాన్నేనన్నారు. 2023 కేబినెట్‌ భేటీలో 400 కిలోమీటర్ల మెట్రో మంజూరు చేశామని.. ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్లు పూర్తి చేస్తే రేవంత్‌ వచ్చాక రద్దు చేశారని.. తనకు భూములు ఉన్నాయనే అనుమానంతో ఆ పని చేశారని విమర్శించారు. రాజేంద్రనగర్‌లో భూములున్నాయని సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేశారని.. భూములు చూపితే రాసిస్తానని సబితా ఇంద్రారెడ్డి చెబుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి తాను బంపర్‌ ఆఫర్‌ ఇస్తున్నా.. భూములు ఎక్కడున్నాయో చూపించాలని.. కంపెనీలు, భవనాలు నావేనని చెబుతూ రెండేళ్లుగా జల్లెడ పడుతున్నారన్నారు. గత దీపావళికి మంత్రి బాంబులేటి.. బాంబులు పేలుతాయని చెప్పారని.. మళ్లీ దీపావళి వచ్చిందంటూ చురకలంటించారు. బీఆర్‌ఎస్‌ హయాంలో పారిశ్రామికవేత్తలకు గొడుగులు పట్టి తీసుకువెళ్లామని.. కాంగ్రెస్‌ పాలనలో పారిశ్రామివేత్తలకు తుపాకులు పెడుతున్నారని.. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా దందాలు చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.




# అతిపెద్ద మ్యూజియంలో భారీ చోరీ..

● ఏడు నిమిషాల వ్యవధిలోనే భారీ దోపిడీ
● పారిస్‌ నగరంలో సంచలనం సృష్టించిన ఘటన



పారిస్‌(జనంసాక్షి):ప్రపంచంలో అతిపెద్ద పర్యాటక మ్యూజియంగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌ దేశపు పారిస్‌ నగరంలోని లౌవ్రే మ్యూజియంలో జరిగిన భారీ ఆభరణాల దొంగతనం ఫ్రెంచ్‌ సాంస్కృతిక ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది.నిమిషాల వ్యవధిలోనే దొంగలు అత్యంత చాకచక్యంగా తమ పని కానిచ్చేశారు. కేవలం ఏడు నిమిషాల వ్యవధిలోనే ఈ భారీ దొంగతనం జరగడం, అందులోనూ భారీ భద్రత ఉండే ఈ మ్యూజియం నుంచి విలువైన ఆభరణాలను అపహరించడంతో తాత్కాలికంగా ఆ మ్యూజియాన్ని మూసివేశారు. ఫ్రెంచ్‌ క్రౌన్‌ జువెల్స్‌ (రాజ కుటుంబ ఆభరణాలు) ప్రదర్శించే ప్రఖ్యాత గ్యాలరీ మ్యూజియం తెరిచిన వెంటనే కాచుకుని కూర్చున్న దొంగలు తమ పనిని అతి తక్కువ వ్యవధిలో ముగించేశారు. బాస్కెట్‌ లిఫ్ట్‌ ద్వారా మ్యూజియంలోకి ప్రవేశించి నెపోలియన్‌, ఆయన భార్య జోసెఫిన్‌కు చెందిన తొమ్మిది విలువైన ఆభరణాలను అపహరించారు. దాంతో మ్యూజియంను తాత్కాలికంగా మూసివేశారు.19వ శతాబ్దం ప్రారంభంలో నెపోలియన్‌ పాలన సమయంలో రూపొందించబడిన ఆభరణాలుగా వీటిని చెబుతున్నారు. 1804-1814 మధ్య, నెపోలియన్‌ ఫ్రాన్స్‌ చక్రవర్తిగా ఉన్న కాలంలో ఆయన భార్య జోసెఫిన్‌ వీటిని ధరించేదట.రోమన్‌ శైలిలో క్లాసికల్‌ లుక్‌లో ఉండే ఈ ఆభరణాల్లో బంగారం, ముత్యాలు, రత్నాలు ఎక్కువగా ఉపయోగించేవారని చరిత్ర చెబుతోంది. నెపోలియన్‌ తన భార్య జోసెఫిన్‌ కోసం విలాసవంతమైన ఆభరణాలు తయారు చేయించేవాడని, అందులో భాగంగా ఆయన చేయించిన ఆభరణాలు ఈ మ్యూజియంలో ఇప్పటికీ గుర్తుగా ఉంచారట.అయితే అందులో కొన్ని ఆభరణాలను దొంగలు అపహరించడంతో ఒక్కసారిగా అలజడి రేగింది. ఈ విషయాన్ని ఫ్రెంచ్‌ ప్రముఖ వార్త పత్రికల ప్రముఖంగా ప్రచురించడంతో ఈ విషయం వెలుగు చూసింది. ముందస్తు చోరీ ప్రణాళికలో భాగంగా నలుగుర్ని నంచి ఐదుగురు దొంగలు మ్యూజియంలోకి ప్రవేశించి విలువైన ఆభరణాలను అపహరించినట్లు ఫ్రెంచ్‌ వార్తా సంస్థ వెల్లడించింది.

# విద్యపై రాజీలేదు

- అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైనవిద్యనుఅందించడమే మా లక్ష్యం
- బోనకల్ లో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు పరిశీలన
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**బోనకల్, అక్టోబర్ 19 ( జనం సాక్షి):** మధిర నియోజకవర్గం బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు. నిర్మాణంలో ఎక్కడ రాజీ పడవద్దని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచించారు. యంగ్ ఇండియా స్కూల్‌ను అనుసంధానం చేస్తూ నిర్మించే రహదారులపై అధికారులతో ఉపముఖ్యమంత్రి చర్చించారు. యంగ్ ఇండియా స్కూల్ కోసం సూచించిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరగాలని అన్ని వసతులతో కూడిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణం కోసం ఉపయోగించే మెటీరియల్ విషయంలో కూడా ఎక్కడ రాజీ పడొద్దని చెప్పారు. నిర్మాణ పనుల్లో మరింత వేగాన్ని పెంచాలని అందుకు అవసరమైన కూలీలను వెంటనే ఏర్పాటు చేసుకోవాలని గుత్తేదారులకు సూచించారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ దశలో ఉన్న పునాదులను దగ్గరుండి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కూల్ కన్ స్ట్రక్షన్ ప్లాన్‌ను పరిశీలన చేశారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాల ప్రాంగణాన్ని కలిగి తిరుగుతూ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. విద్య అనేది భవిష్యత్తు తరాలకు మనం అందించే ఒక అతిపెద్ద ఆస్తి అని చెప్పారు. తెలంగాణ బిడ్డలకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శ్రీకారం చుట్టింది. విద్య విషయంలో ప్రజా ప్రభుత్వం ఎక్కడ రాజీ పడబోదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## ఆశపడి మోసపోయాం.. గోసపడుతున్నాం

- అండగా నిలవండి
- 24న నిరుద్యోగ బాకీ కార్డ్ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా రండి
- కేటీఆర్‌కు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేతల ఆహ్వానం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** యూత్ డిక్లరేషన్ల పేరిట అనేక హామీలిచ్చి మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం పై కన్నెర్ర చేస్తున్న నిరుద్యోగ యువత కాంగ్రెస్ పార్టీ హామీలను మరోసారి గుర్తుచేయడానికి, ప్రభుత్వ మెడలు వంచడానికి తలపెట్టిన కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హాజరవ్వాలని హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో కలిసి ఆహ్వానించారు. తాము ఏ రకమైన పోరాటం చేసిన అధికార పార్టీ అది ప్రతిపక్షాల కుట్రగా అభివర్ణిస్తుంది తప్ప తమ గోడు పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రి మంత్రులు వేలం పాట పాడినట్టు, 40 వేలు, 60, లక్ష ఉద్యోగాలు ఇచ్చామని బహిరంగ సభలో పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలిచ్చి వాళ్ళు గెలిచే వరకు వాడుకొని, ఊర్లలో అవ్వా తాతల కాళ్ళు పట్టించి తీర గెలిచాక ఇప్పుడు ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పోరాటానికి అండగా నిలవడానికి తెలంగాణ నిరుద్యోగ జేఏసీ అధ్వర్యంలో ఈ నెల 24 న, ఉదయం 10 గంటలకు జల విహార్, నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్, హైదరాబాద్. తలపెట్టిన కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి తో కలిసి ఆహ్వానించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బాధ్యతతో తెలంగాణ జరిగే ప్రతీ ప్రజా ఉద్యమానికి అండగా ఉంటామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేదాక రాజకీయంగా వెంబడిస్తామని హామీ ఇచ్చారు.

## మద్యం దుకాణాల దరఖాస్తు తేదీ గడువు పెంపు

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్



**నిర్మల్ రూరల్, అక్టోబర్19 (జనంసాక్షి) :** జిల్లాలోని మద్యం దుకాణాల తేదీ గడువును ఈ నెల 23 వరకు పెంచినట్లు జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు.జిల్లాలోని 47 మద్యం దుకాణాలకు 18వ తేదీ వరకు 942 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. 18న రాష్ట్ర బంద్ ఉన్నందున చాలా మందికి రవాణా సౌకర్యం లేక దరఖాస్తులు చేసుకోలేకపోయారని, అందరి విజ్ఞప్తి మేరకు గడువు తేదీనీ పెంచినట్లు తెలిపారు.ఈ పొడిగింపు వలన ఇంకా ఎక్కువగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.మొత్తం 47 మద్యం దుకాణాలకు గెజిట్ సీరియల్ నెంబర్ 1నుండి 47 నెంబర్ వరకు వచ్చిన దరఖాస్తులను నోటీస్ బోర్డులో పెట్టడం జరిగిందని తెలిపారు. దరఖాస్తులను అక్టోబర్ 23 తేదీ సాయంత్రం వరకు స్వీకరించించడం జరుగుతుందని తెలిపారు.అక్టోబర్ 27న మద్యం దుకాణాల దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో డ్రా ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు.ప్రతి దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డ్, 3 కలర్ పాస్పోర్ట్ ఫొటోలు జతచేయాలని, అలాగే ప్రతి దరఖాస్తు దారుడు 3,00,000 రూపాయలు దరఖాస్తు రుసుంగా నాన్ రిఫండబుల్ ఫీ చెల్లించాలని తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు డిడి,చలన్ల రూపంలో ప్రొహిభిషన్,ఎక్సైజ్ నిర్మల్ పేరుమీద తీయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8712658774 నంబరును సంప్రదించాలి తెలిపారు.

## భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఉప్పల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైద్రాబాద్‌లోని చార్మినార్ వద్ద ఉన్న ఒక ప్రసిద్ధ ఆలయం భాగ్య లక్ష్మి అమ్మవారినిటీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తకు శాలువాతో సత్కరించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ చారిత్రిక ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయం కారణంగానే హైదరాబాదు నగరాన్ని పూర్వం 'భాగ్యనగరం' అని పిలిచేవారని చెబుతారని ఆయన అన్నారు. ఆ భాగ్య లక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారై బీఆర్‌యస్ యూకే శాంతియుత నిరసన



**లండన్ (జనంసాక్షి) :** లండన్ లో ఎన్నారై బీఆర్‌యస్ యుకే సెల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 22 నెలల అప్రజాస్వామిక అరాచక పాలనను నిరసిస్తూ సెంట్రల్ లండన్ లోని టావోస్టిక్ స్క్వేర్ దగ్గరున్న గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నారై బీ.ఆర్.యస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమం మన రైతుల్ని కాయపడు కోవాలని, మన కాళేశ్వరం ప్రాజెక్ట్ ని కాపాడుకోవాలని, మన హైదరాబాద్ ని కాపాడుకోవాలని మన తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన నుండి కాపాడుకోవాలనే ఉద్దేశంతో చెప్పటామని తెలిపారు. బీ.ఆర్.యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బాకీ ఉన్న హామీలను గుర్తు చేస్తూ బాకీ కార్డులని సైతం ప్రదర్శించారు. ఎన్నారై బీ.ఆర్.యస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎఫ్డీసి మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, ఎన్నారై బీ.ఆర్.యస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు హరి గౌడ్ నవాపేట్, ఉపాధ్యక్షుడు సత్య మూర్తి చిలుముల, ఉపాధ్యక్షుడు రవి రేతినేని, అడ్వైజరీ బోర్డు వైస్ చైర్మన్ గణేష్ కుప్పాల తదితరులు పాల్గొన్నారు.




# మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కొన్ని రోజులుగా కీలక మావోయిస్టు నేతలు లొంగిపోతున్నారు. ఇటీవల కీలక నేతలైన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను, తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేశ్‌లు పోలీసులు ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లొంగుబాట్లపై మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సంచలన లేఖ విడుదల చేసింది. అందులో మల్లోజుల, ఆశన్నను విప్లవ ద్రోహులుగా అభివర్ణించింది. శత్రవులు ఎదుట లొంగిపోయిన వారిద్దరికి తగిన శిక్ష ప్రజలే విధిస్తారని సంచలన వ్యాఖ్యలు చేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అధికార ప్రతినిధి అభయ్ పేరుతో నాలుగు పేజీల లేఖ విడుదల చేసింది. కేంద్ర కమిటీతో చర్చించకుండానే.. మల్లోజుల, ఆశన్న వారి అనుచరులతో కలిసి లొంగిపోయారని లేఖలో పేర్కొంది. వారిని విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకారులుగా, విప్లవ ప్రతిఘాతకులుగా అభివర్ణించింది. శత్రువులకు లొంగిపోయిన మల్లోజుల, ఆశన్న బృందాలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించింది. కాగా 2 రోజుల్లో 258 మంది లొంగిపోయారని అమిత్ షా ట్వీట్ చేసిన నేపథ్యంలో ఈ లేఖ కలకలం సృష్టిస్తోంది.

### మల్లోజుల మారలేదు..

"2011 చివరి నుంచి విప్లవోద్యంమం గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వస్తోంది. 2018లో మవోయిస్టు పార్టీ ఒకసారి తాత్కాలిక వెనుకంజ వేసింది. అప్పటి నుంచి మల్లోజుల బలహీనతలు బయటపడ్డాయి. 2020 కేంద్ర కమిటీ సమావేశంలో.. మల్లోజుల దండకారణ్య విప్లవాచరణలోని కొన్ని లోపాలపై.. సొంత విశ్లేషణలతో నిర్ధరించి ఒక పత్రాన్ని ప్రవేశపెట్టాడు. దాన్ని కేంద్ర కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఎప్పటికప్పుడూ జరిగిన కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో.. ఆయన తప్పుడు రాజకీయ భావనలను పార్టీ విమర్శించింది. అనంతరం ఆయన్ను పార్టీ సరిదిద్దడానికి కృషి చేసింది. 2011లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ప్లీనం.. మల్లోజుల వ్యక్తివాదాన్ని, అహంభావాన్ని, తీవ్రమైన పెద్దతందారీ తనాన్ని విమర్శించి వాటిని సరిదిద్దుకోవాలని కోరింది. అయితే, 2025 మే నెలలో జరిగిన ఆపరేషన్ కగార్ దాడిలో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు అమరత్వం తర్వాత మల్లోజులలో దీర్ఘకాలంగా ఉన్న సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకుని శత్రువు ముందు మోకరిల్లేలా చేశాయి" అని అభయ్ లేఖలో పేర్కొన్నారు.

### వారిని తన్ని తరిమేయండి..

"విప్లవానికి ద్రోహులుగా మారిన మల్లోజుల, ఆశన్నల ముఠా.. సరైన మార్గంలో విప్లవ ఉద్యమాన్ని పునర్మిస్తామనడం బూటకం. వాళ్లు కేంద్ర, రాష్ట్ర ఇంటజిజెన్స్ ఏజెన్సీల నియంత్రణలో ఉంటూ చేసే ప్రజా పోరాటాలు, నిర్మించే విప్లవ ఉద్యమం.. ప్రభుత్వ ప్రాయోజిత ప్రజా పోరాటాలుగా, విప్లవ ఉద్యమంగానే ఉంటాయి. అందుకే ఈ విప్లవ ద్రోహులు ప్రజాపోరా టాల పేరుతో ప్రజల వద్దకు వస్తే.. వారిని తన్నితర మాల్సిందిగా పిలుపునిస్తున్నాం. కరార్ యుద్ధంతో ప్రాణభీతి ఉన్నవారు ఎవరైనా.. లొంగిపోతే లొంగిపో వచ్చు కానీ.. పార్టీకి, విప్లవ ప్రజలను చెందిన ఆయు ధాలను శత్రువుకు అప్పగించకూడదని కోరుతున్నాం. అది విప్లవ ద్రోహమే కాకుండా విప్లవ ప్రతిఘాతకత అవుతుంది. విప్లవ ప్రతిఘాతకులను.. విప్లవ ప్రజలు శిక్షించక తప్పదు" అని లేఖలో అభయ్ హెచ్చరించారు.









## ఆత్మవిశ్వాస దీపాన్ని వెలిగిద్దాం

దీపావళి.. కేవలం వెలుగుల పండుగ కాదు, అది మనలోని చీకట్లను తొలగించే ఆత్మీయ ఆవిష్కరణ. ప్రతి దీపం ఒక చిహ్నం. జ్ఞానానికి, మానవతకు, ప్రేమకు. ఈ పండుగ మన హృదయాంతరాలలోని అజ్ఞాన చీకట్లను పారద్రోలి, కరుణ, న్యాయం, సేవ వంటి విలువలను వెలిగించే పవిత్ర సమయం. ఇతరుల జీవితాలను వెలిగించగలిగితే, అదే నిజమైన దీపావళి ఆనందం.

మనిషిలోని "నేను" అనే అహంకారం, "నాది" అనే స్వార్థం తొలగిపోవడం ద్వారానే ఆధ్యాత్మిక దీపావళి ప్రారంభమవుతుంది. వెలుతురు కేవలం కొవ్వొత్తుల్లో కాదు.. మన ఆత్మలో ఉండాలి. ఆత్మదీపానికి జ్ఞానం అనే చమురు, మానవతా భావం అనే వత్తి, సహానుభూతి అనే జ్వాల ఉంటే, ఆ కాంతి ఎప్పటికీ ఆరిపోదు.

ఇతరులు అందించే వెలుతురుపై ఆధారపడటం పరాధీనత–మనలోని వెలుతురునే వెలిగించుకోవడం స్వాతంత్ర్యం.ఆత్మవిశ్వాసం, ధైర్యం, సత్ప్రవర్తన అనే మూడు దీపాలు వెలిగిస్తే మన జీవితం వెలుగులతో నిండిపోతుంది. "చీకటి పోదేమో" అనుకోవడం నిరాశ, "వెలుతురే ఉండాలి" అనుకోవడం దురాశ. ఈ రెండింటి మధ్య సమతుల్యత నేర్చుకోవడమే జీవన వైభవం. మనిషి జీవితం చీకటి–వెలుగుల సమాహారం. సుఖ–దుఃఖాలు, ఆశ–నిరాశలు, లాభ–నష్టాలు ౦ ఇవన్నీ జీవన దీపావళిలోని విభిన్న రంగులు. వాటిని సవినయంగా స్వీకరించడం, కష్టకాలంలో ఆత్మవిశ్వాస దీపాన్ని వెలిగించుకోవడం –అదే వివేకవంతుల లక్షణం.ఈ దీపావళి సందర్భంగా మనమంతా మన హృదయాల్లో మానవతా దీపాన్ని వెలిగిద్దాం. ద్వేషం, ఈర్ష్య, అహంకారం అనే చీకట్లు తొలగించి, ప్రేమ, సేవ, సమానత అనే వెలుతురుతో సమాజాన్ని ప్రకాశింపజేద్దాం. ప్రతి మనిషి హృదయంలో వెలిగే మంచితనం అనే జ్యోతి సమాజానికి మార్గదర్శనం అవుతుంది. దీపాలు వెలిగించటం కన్నా హృదయాలను వెలిగించడం గొప్పది.వెలుతురును పంచే మనసు కలవారే నిజమైన దీపావళి దీపాలు.అదే మన జీవితానికి, మన సమాజానికి సార్థకమైన దీపావళి.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు,
జిల్లా: వరంగల్, ఫోన్:9573666650

## అహమే ముప్పు

ఓ.. అహంకారి సిజేఐపై దాడి ఘటన
అఖిల భారతావని మదిని కలచి వేసింది
సర్వోన్నత న్యాయస్థాన న్యాయమూర్తి పై కులద్వేష పైశాచికానందం
సిగ్గు చేటైన తలంపు తలవంపు
దళితుడైనందుకా ? పడగ విప్పడం
సత్యాన్ని అసత్యమనలా?
న్యాయాన్ని వక్రీకరించాలా?
హింసకు వంతపాడాలా?
ప్రతి హింసను ఖైదీ చేయాలా?
ఇదేనా!మత చాందస వాదుల మనో సంకల్పం
సహన శీలిని పరీక్షించి గోతిలో కూరడమే అవుతుంది
ఒక అపరాధి నయం, దుర్బుద్ధి విజ్ఞాని కంటే..
స్థిత ప్రజ్ఞడిని కొవ్వెక్కి కవ్వించే
మూరు?డిని రంజింప చేయడం
చెవిటి ముందు శంఖు ప్రోతే..
తమపై తమకే విశ్వాసం లేని కొందరికి
ప్రత్యక్ష్య మంతా నరక సదృశ్యమే..
అహం పరిధి దాటితే ముప్పు మూడినట్టే!?

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్

# నవ్వుల పాలవుతున్న అగ్రదేశాల నేతలు

ప్రపంచంలో అమెరికా, భారత దేశాలు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా కీర్తి గడించాయి. కానీ ఈ దేశాల నాయకులు డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోడీలు చేస్తున్న పనులు, మాట్లాడే అబద్ధాలను గమనిస్తుంటే వీరు నిజంగా ఆదేశాల గౌరవానికి తగిన నేతలేనా అనే సందేహం, మరోవైపు విచారం కలుగుతుంది. వీళ్ల మాటలు, ఉపన్యాసాలు అబద్ధాలతో, అతిశయోక్తులతో నిండి ఉంటాయి.కీలక నేతలు కనుక సోషల్ మీడియాలో ఇవి తక్షణమే వైరల్ అవుతాయి. ప్రజలు వీరి మాటల్లో ఉన్న నిజం ఏమిటో గ్రహించి నవ్వుకుంటారు. కానీ ఈ నవ్వు వెనుక ఆ దేశాల పరువు, ప్రతిష్ట పోతోంది కదా! అనే బాధ కూడా కలుగుతుంది. ఈ వ్యాసంలో వీళ్ల అబద్ధాలు కొన్ని చూద్దాం. వ్యంగ్యంగా చెప్పాలంటే, ఈ నాయకులు అబద్ధాలలో ఆస్కార్ అవార్డు గెలుచుకుంటారేమో!



**డోనాల్డ్ ట్రంప్ అబద్ధాల రాజు:**

డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు. రాజకీయాలకు ముందు వ్యాపారి, టీవీ స్టార్. కానీ ఇప్పుడు అబద్ధాలు చెప్పడంలో సూపర్ స్టార్. ఫ్యాక్ట్ చెక్ సంస్థలు వీటిని ఎప్పుడూ జల్లెడ పట్టి తప్పును పట్టేస్తాయి. మీడియా లో ఏకి పడేస్తాయి కూడా. అయినా ట్రంప్ వాటిని పెద్దగా పట్టించుకోడు.తిరిగి మళ్లీ మళ్లీ అవే అబద్ధాలు చెప్తాడు.ఈ అబద్ధాలు , అతిశయోక్తులు చూసి ట్రంప్ కు ఎంత ధైర్యం ఇలా మాట్లాడటానికి అని విస్తుపోతూ,జనం నవ్వుకుంటారు.

**మొదటి అబద్ధం :** కోవిడ్–19 గురించి. "ఇది సాధారణ ఫ్లూ లాంటిది, తనంతట తాను పోతుంది" అన్నాడు. వైరస్ వ్యాప్తి చెందుతున్నప్పుడు కూడా తక్కువ చేసి చెప్పాడు. హైడ్రాక్సీక్లోరోక్విన్ మందు ప్రభావం లేదని తెలిసినా ప్రోత్సహించాడు. ఫలితం? అమెరికాలో లక్షలాదిమంది మంది చనిపోయారు. వ్యంగ్యంగా చెప్పాలంటే, ట్రంప్ డాక్టర్ కాదు, కానీ ఉచిత సలహాలు ఇస్తాడు! మరో గాఫ్: "బ్లీచ్ ఇంజెక్ట్ చేసుకోండి" అన్నాడు. డాక్టర్లు షాక్ అయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ), సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్( సీ.డీ.సీ.పీ) ఖండించాయి.అనేక మీములు వైరల్ అయ్యాయి. బ్రిటన్ ప్రధాని కూడా జోక్ చేశాడు. అమెరికా.. సైన్స్‌కు వ్యతిరేక దేశమా అని ప్రపంచం నవ్వింది.

**రెండవది :** 2020 ఎన్నికలు. ఓడిపోయినా "మోసం జరిగింది, నా విజయాన్ని ప్రత్యర్థులు దొంగిలించారు" అన్నాడు. ఆధారాలు ఏమీ లేవు. న్యాయస్థానాలు, అధికారులు తిరస్కరించారు. ఫలితం? కాపిటల్ హిల్ పై ట్రంప్ అనుచరులు ,అభిమానుల దాడి. అమెరికా ప్రజాస్వామ్య ప్రతిష్ట దెబ్బతింది. వ్యంగ్యం: ట్రంప్ ఓడిపోయినా విజేతలా మాట్లాడతాడు!అది అతని నైజం.

మూడవది: ఆర్థిక విజయాలు. "అమెరికా ఆర్థిక వ్యవస్థ అత్యుత్తమం" అన్నాడు. కానీ కోవిడ్ ప్రభావం, ఇన్‌ఫ్లేషన్ ను పూర్తిగా విస్మరించాడు. ఉద్యోగాలు, సరిహద్దులు గురించి అతిశయోక్తులు చెప్పారు. ఫ్యాక్ట్ చెక్‌లు అవి అబద్ధాలు అంటాయి

మరో ఉదాహరణ : 2015లో "మెక్సికో నుంచి డ్రగ్స్, క్రిమినల్స్ వస్తున్నారు" అన్నాడు. యూఎన్ "రేసిస్ట్" అని ఖండించింది. "ట్రంప్ వాల్" నుండి జోకులు వచ్చాయి. అమెరికా విదేశీలకు శత్రువులా కనిపించింది.

నాల్గవది: 2016లో "ముస్లిం బ్యాన్". ఇస్లామోఫోబియా పెంచింది. యూరప్, మధ్యప్రాచ్యం అమెరికాను డివైడెడ్‌గా చూశాయి. మరో ఉదాహరణ: క్లైమేట్ చేంజ్ "హోక్స్" అన్నాడు. యుఎన్ స్పీచ్‌లో అబద్ధాలు. ఇమిగ్రేషన్ గురించి అతిశయోక్తులు. వ్యంగ్యం: ట్రంప్ ప్రపంచాన్ని మోసం చేస్తాడు. కానీ అందరికీ నిజాలు తెలుసు!

ఐదొవది: యుక్రెయిన్ గురించి. "నేను యుద్ధాలు ముగించాను" అన్నాడు. కానీ ఫ్యాక్ట్స్ వేరు. ఇన్‌ఫ్లేషన్, హెల్త్ కేర్ గురించి మళ్లీ మళ్లీ అబద్ధాలు. పొలిటి ఫ్యాక్ట్ లిస్ట్‌లో ఎన్నో. వ్యంగ్యం: ట్రంప్ అబద్ధాలు 30,000ను మించాయి. ట్రంప్ రికార్డు బ్రేకర్!

ఈ అబద్ధాలు ట్రంప్‌ను "ట్విట్టర్ ట్రోల్" చేశాయి. ప్రపంచ మీడియా లిస్ట్ చేస్తోంది. అమెరికా పరువు దిగజారింది. అంతర్జాతీయ సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రజలు నవ్వుకొంటున్నారు. తల బాదుకుంటున్నారు. కానీ, అది దేశానికి అవమానం.అయినా ట్రంప్ పక్కా "నాటు" సరుకు.అతని మాటలు పరమ "మొరటు" .

**నరేంద్ర మోదీ.. అసత్య వ్యాఖ్యల రారాజు:**

నరేంద్ర మోడీ భారత ప్రధాని. మంచి వక్త. కానీ అతని వ్యాఖ్యలు వివాదాలను తెస్తాయి. చరిత్ర, ఆర్థికం, రాజకీయం, సైన్స్, టెక్నాలజీ ఏ విషయాలలో నైనా సరే అబద్ధాలు చెప్పటంలో పోటీ లేదు. సోషల్ మీడియాలో మీములు. భారత్ ను తన హయాంలో సూపర్ పవర్ గా చూపించాలని ఆత్రం. ఆశయం మంచిదే. కానీ,చేతల్లో వైఫల్యం.అయినా పంతం వీడడు.

**మొదటి అబద్ధం :** చారిత్రక వ్యాఖ్యలు. "ప్రాచీన భారత్‌లో ప్లాస్టిక్ సర్జరీ" ఉంది అన్నాడు. గణేశుడి తల ఏనుగు తలతో మార్చారట. ఇంటర్నెట్ మహాభారత కాలంలో కూడా ఉందట. శాస్త్రవేత్తలు మోదీ మాటలను విమర్శించారు. వ్యంగ్యం: మోదీకి టైమ్ మెషిన్ ఉందేమో!

**రెండవది :** ఆర్థిక వ్యవస్థలో అబద్ధాలు: 2016 నోట్ల రద్దుతో దేశంలో "భ్రష్టాచారం, నకిలీ నోట్లు తగ్గాయయి" అన్నారు. కానీ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్.బీ.ఐ.) రిపోర్ట్ వేరుగా ఉంది. ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతింది.

**మరో ఉదాహరణ :** "ప్రతి అకౌంట్‌లో 15 లక్షలు" అన్నారు. 2014లో. "విదేశాల్లో ఎక్కడ దాకున్నా ఆర్థిక నేరస్తులను పట్టి తెస్తాం. వారి ఆస్తులు వేలం వేస్తాం" అన్నారు.

"బ్లాక్ మనీ తిరిగి తెస్తాం" అని అన్నారు. జరిగిందా? లేదు. వ్యంగ్యం: మోడీ ప్రామిస్‌లు బ్యాంక్ డిపాజిట్ కాదు, నీటి మీద రాతలు .

**మూడవది :** రాజకీయ ఆరోపణలు. ప్రత్యర్థులను "విదేశీ కుట్రదారులు" అంటారు. వాటికి ఆధారాలు లేవు. 2024 ఎన్నికల్లో "ఇన్‌ఫిల్ట్రేటర్స్" అని ముస్లింలను పిలిచాడు. హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్.ఆర్.డబ్లూ). మోదీ ఎన్నికల సభల్లో, ఇతర సందర్భాల్లో 110 హేట్ స్పీచ్‌లను లిస్ట్ ఔట్ చేసింది. వ్యంగ్యం: మోడీ హేట్ ఉపన్యాసాలు ఎలక్షన్స్ సమయంలో ఇతర మతాల పట్ల ముఖ్యంగా ముస్లింల పట్ల!మాల్ మసాలతో దట్టించాల్సిందే.

**నాల్గవది :** సామాజిక వ్యాఖ్యలు. 2002 రయట్స్‌లో "బేబీ ఫ్యాక్టరీలు" అని ముస్లిం క్యాంపులను అన్నాడు. మత విద్వేషం. బీబీసీ డాక్యుమెంటరీ వివాదం. మరో ఉదాహరణ: "సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తాం" అన్నారు. కానీ నిరుద్యోగం అనేక రెట్లు పెరిగింది. వ్యంగ్యం: మోడీ ఉద్యోగాలు కాగితాలపై మాత్రమే!

**ఐదవది :** బాలకోట్ స్ట్రైక్. "మేఘాలు రాడార్‌ను అడ్డుకున్నాయి" అన్నాడు. శాస్త్రవేత్తలు నవ్వారు. అవెంజర్స్ మీములు. మరో గాఫ్: 2018లో "సీవర్ గ్యాస్‌తో టీ" అన్నాడు. అసాధ్యం. "చమోడీగ్యాస్" ట్రెండ్. వ్యంగ్యం: మోడీ సైన్స్ ఫిక్షన్ రచయిత.

**ఆరవది:** పుల్వామా తర్వాత బాలకోట్ విజయం. తప్పుడు సమాచారం వ్యాప్తి. దేశంలో ఎక్కడ కమ్యూనల్ ఘర్షణలు జరిగినా ఆపై సైలెంట్. మరో ఉదాహరణ: "కర్నాటక ఎలక్షన్‌లో" అబద్ధాలు. అల్ జజీరా విమర్శించింది. వ్యంగ్యం: మోడీ మాటలు హాలీవుడ్ స్క్రిప్ట్! ఈ వ్యాఖ్యలు మోడీనీ "ఫేక్ న్యూస్ మాస్టర్"ను చేశాయి. ప్రపంచ మీడియా విమర్శిస్తోంది. భారత్ పరువు దెబ్బతింది. మైనారిటీల హక్కులు దెబ్బతిన్నాయి.

**ట్రంప్- మోదీ సాధారణ లక్షణాలు:**

ట్రంప్, మోడీ ఇద్దరూ పాపులిస్ట్ నాయకులు. సోషల్ మీడియాను విరివిగా ఉపయోగిస్తారు. ట్రంప్ ట్విట్టర్, మోడీ మన్ కి బాత్ లు. అబద్ధాలను వేగంగా వ్యాప్తి చేస్తాయి. ప్రత్యర్థులపై వ్యక్తిగత దాడులు మామూలే. మీడియావి "ఫేక్ న్యూస్" అంటారు.తెలిగ్గా భావోద్వేగాలు రెచ్చగొడతారు. వాస్తవాలు పూర్తిగా విస్మరిస్తారు. వ్యంగ్యం: ఇద్దరూ అబద్ధాలలో బెస్ట్ ఫ్రెండ్స్!

**ప్రపంచ ప్రభావం : నవ్వు - బాధ:**

వీరిద్దరూ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాధి నేతలు. వారి మాటలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి. అమెరికా ఐసోలేషనిస్ట్ గా కనిపిస్తుంది. భారత్ హిందుత్వ ఎక్స్‌ట్రీమిస్ట్ గా కనిపిస్తుంది. రెండు దేశాల స్నేహ సంబంధాలు గతంలో కంటే బాగానే దెబ్బతిన్నాయి. 2025లో ట్రంప్ "భారత్ డెడ్ ఎకానమీ" అన్నాడు. అయినా మోడీ సైలెంట్. " "భారత్–పాకిస్తాన్ యుద్ధాన్ని...తాను స్వయంగా వ్యాపారం పేరుతో బెదిరించి ఆపాను" అని ట్రంప్ అనేక సార్లు మీడియా ముందు ప్రకటించారు.అయినా మోదీ ప్రతిసారీ మౌనం.భారత్ లో ఒక విశిష్ట సామెత ఉంది. "మౌనం అర్థం అంగీకారం". మన మోదీ కి మరో లక్షణం ఉంది."అనవసరం సమయంలో గొంతు చించుకుని చెలరేగి మాట్లాడటం...అవసర సమయంలో నోరు మెదపకపోవటం". సోషల్ మీడియాలో మీములు ట్రెండ్ అవుతూనే ఉంటాయి. యువత రాజకీయాలు వద్దనుకుంటుంది. యూఎన్, (ఈయూ) ఆందోళన చెందుతున్నాయి. దేశాల పరువు దెబ్బతింటుంది. ప్రజలు నవ్వుకుంటున్నారు. కానీ అది బాధాకరం.

**ప్రజాస్వామ్యానికి ముప్పు :**

చివరిగా.. ఇలాంటి నాయకులు అబద్ధాలు చెప్తే, ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది. ప్రజలు వాస్తవాలు ఆధారంగా నిర్ణయాలు తీసుకోలేరు. అవిశ్వాసం పెరుగుతుంది. సామాజిక విభజనలు మరింత పెరుగుతాయి. ప్రపంచ గొప్ప ప్రజాస్వామ్యాలు ఇలా ఉండాలా? వారి మాటలు నవ్వు తెప్పిస్తాయి. కానీ ఆ నవ్వు బాధాకరం. సత్యం, జవాబుదారీతనం అవసరం. ప్రజలు, మీడియా...ఈ నాయకులను ప్రశ్నించాలి. లేకపోతే ప్రజాస్వామ్యం నవ్వుల పాలవుతుంది. అది సమాధి మీద నవ్వు అవుతుంది. ఇద్దరు నాయకులు దేశాలను ముందుకు నడిపితే మంచిది. కానీ వారి మాటలు , చేతలు ఆ దేశాలను వెనక్కి తీసుకు వెళ్తున్నాయి. దేశాలు వేరు అయినా... ప్రజాస్వామ్య స్ఫూర్తి ఒక్కటే. మనం ప్రజలుగా పాఠాలు నేర్చుకుందాం. బాధ్యతాయుత నాయకత్వం ఈ దేశాలకు కావాలి.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఆహారపు వృధా అరికట్టకపోతే భవిష్యత్తులో ఆహార కొరత

ఒక వైపు ఆకలి కేకలు, మరో వైపు తినగల ఆహారం చెత్త బుట్టల్లో కలిసిపోతూ ఉండే ఈ విరోధాభాసం మన సమాజ ఆర్థిక నైతిక వ్యవస్థలలో ఉన్న లోతైన లోపాలను బహిర్గతం చేస్తుంది. ప్రపంచ స్థాయిలో 2022లో వినియోగదారుల దశలోనే సుమారు 1.05 బిలియన్ల టన్నుల ఆహారం వృథా అయింది, ప్రతి వ్యక్తికి సగటు 79 కిలోల చొప్పున కిచెన్ డబ్బాల్లో పడిపోయింది, ఈ మొత్తం వ్యర్థంలో ఇళ్లదగ్గరే ఆరు వంతుల భాగం తయారైంది, సేవారంగం రెస్టారెంట్లు క్యాంటీన్లు తదితరాలు దాదాపు మూడొంతులు, రిటైల్ రంగం మిగతా భాగం సృష్టించాయి, ఇదే సమయంలో ఆకలి బాధతో రోజూ కోట్లాది జనాలు తలదాచుకుంటున్నారు, ఈ వ్యర్థం నుంచి గ్రీన్ హౌస్ వాయువులు మరింతగా వెలువడుతున్నాయి అని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం తాజా ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ నివేదిక స్పష్టం చేసింది.

2.మన దేశ దృశ్యం ఇంకా తీవ్రంగా కనిపిస్తుంది. యునెప్ 2024 మూల్యాంకనం ప్రకారం భారతీయ ఇళ్లలోనే సంవత్సరానికి సుమారుగా 78 నుంచి 78.2 మిలియన్ల టన్నుల ఆహారం చెత్తగా మారుతోంది, ప్రతి పౌరుడి ఇంటివద్ద సగటు వృథా 55 కిలోలకు చేరుతోంది, మన భారీ జనాభా కారణంగా మొత్తం పరిమాణం ప్రపంచంలో అగ్రస్థానాలకు దగ్గరగా నిలుస్తోంది అని అనేక మూలాలు ఏకస్వరంగా తెలియజేశాయి. నగర ప్రాంతాలలో వృథా స్థాయి గ్రామాల కంటే ఎక్కువగా ఉండడం, ఉష్ణత ఎక్కువగల దేశాల్లో గది ఉష్ణోగ్రత నిల్వలు అస్తవ్యస్తం కావడం, శీతల సరఫరా సంకెళ్ల కొరత ప్రభావం పడడం వంటి అంశాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయని నివేదిక మరో కోణం నుంచి సూచించింది.

ఈ అర్థం చేసుకోవాలంటే ఒక కీలక తేడా తెలుసుకోవాలి, పంట కోత నుంచి మార్కెట్ దాకా నష్టాలు ఫుడ్ లాస్, వినియోగదారుల దశలో చెత్తకు వెళ్లేది ఫుడ్ వేస్ట్ అనే పరిభాష. మన దేశంలో ఫుడ్ వేస్ట్ పై దేశవ కొలమానం ఇంకా వ్యవస్థీకృతంగా మొదలయ్యే దశలోనే ఉంది, అయితే పంట తరవాత నష్టాలపై పెద్ద చిత్రమే ముందుకు వచ్చింది. నాబ్‌కాన్స్ చేపట్టిన సమీక్షా అధ్యయనంపై ఆధారపడి ఐక్రియర్ పాలసీ బ్రీఫ్ చెప్పినట్టు 2020 నుంచి 2022 మధ్య వ్యవసాయ పంటలు సహచర ఉత్పత్తులపై సంభవించిన నష్టాల ఆర్థిక విలువ ఏటా దాదాపు 1.53 లక్షల కోట్లకు చేరింది, మన దేశంలో ధాన్యాల వద్ద శాతం నష్టం చైనాతో పోల్చితే రెట్టింపు స్థాయిలో నమోదైనట్టు అదే అధ్యయనం వివరిస్తుంది. కోత దున్నే దశల్లోనే నష్టం ఎక్కువగా జారిపోతుంది, నిల్వలో నాణ్యత తగ్గుదల కూడా రైతు ధరను కట్ చేస్తుంది, పోషక విలువలు హీనమవుతాయి, నీటి భూసారం శక్తి పెట్టుబడులు అన్నీ వృథా అవుతాయి అని రచయితలు హెచ్చరిస్తున్నారు.

కేంద్ర సంస్థల గోదాముల్లో నిల్వ రవాణా దశల్లో కూడా కొంత నష్టం తప్పడం లేదు. పంజాబ్‌లో 2019 నుంచి 2024 మధ్య 8 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం పాడైందని ప్రాంతీయ లెక్కలు చెబుతున్నాయి, ఏదో ఒక ఏడాదిలో ఏదో ఒక జిల్లాలో వందల టన్నులు పాడై దత్తడిగా నమోదవ్వడం చూస్తున్నాం. ఈ దృశ్యం దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న నిల్వ సదుపాయాల్లో మైక్రో స్థాయి లోపాలకు అద్దం పడుతుంది. అదే సమయంలో ఎఫ్‌సీఐ దేశవ్యాప్తంగా నష్నా అవసరాలు తీర్చేందుకు లక్షల టన్నుల ధాన్యాన్ని రైల్వే ద్వారా తరలించిన నెంబర్లు కూడా ఉన్నాయి, సరఫరా వ్యవస్థ మహత్తును చూపించే సంకేతాలే అవి, అయితే ప్రతి కిలో వినియోగదారుని ప్లేట్ దాకా బద్రతగా చేరాలంటే పాడుబడే లూప్ హొల్స్ మూసివేయడమే అసలు ప్రశ్నగా మిగులుతోంది.

**ప్రపంచ స్థాయిలో వినియోగదారుల దశలోనే ఐదో వంతు ఆహారం వృథా అయింది, ఇళ్లదగ్గర 631 మిలియన్ల టన్నులు, సేవారంగం 290 మిలియన్ల టన్నులు, రిటైల్ 131 మిలియన్ల టన్నులు, రోజుకి బిలియన్ భోజనాలకు సమాన పరిమాణం చెత్తలో కలిసిపోతోంది, భారత ఇళ్లలో సంవత్సరానికి 78.2 మిలియన్ల టన్నులు, వ్యక్తికి 55 కిలోల చొప్పున వృథా, నగరాల్లో స్థాయి ఎక్కువ, గ్రామాల్లో తక్కువ, పంట కోత తరవాత నష్టాల ఆర్థిక విలువ ఏటా 1.53 లక్షల కోట్లు, ధాన్యాల్లో శాతం నష్టం చైనా కంటే ఎక్కువ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కొన్ని వేల టన్నులు గోదాముల దశలో పాడై అధికార లెక్కల్లో నమోదైపోయాయి.**

పండ్ల కూరగాయల వంటి త్వరగా కుళ్లే ఉత్పత్తులలో కోత తరవాత నష్టాలు సగటు శాతాల్లోనే ఎక్కువగా ఉంటాయి, కొన్ని సందర్భాల్లో అదుపు తప్పిన పరిధులకు చేరతాయి అని పలు సమగ్ర సమీక్షలు చెబుతున్నాయి. శీతల సంకెళ్ల విస్తరణ, ప్రాథమిక గ్రేడింగ్ ప్యాకింగ్ కేంద్రాలు, గ్రామ స్థాయి సోలార్ చిల్లర్లు, తక్కువ వ్యయ ఎథిలీన్ శోషకాలు వంటి పరిష్కారాలు రైతు వద్దే నష్టాన్ని తగ్గిస్తాయి, మధ్యవర్తిత్వానికి బలము పడకుండా రైతు గిడ్డంగి రసీదుల పథకం ద్వారా సరైన సమయంలో విక్రయించే అవకాశం



కల్పిస్తాయి, చిన్నదైన పొలం విస్తీర్ణం ఉన్న కుటుంబాలకి యంత్రాల సమూహ వినియోగ సేవలు అందితే కోత దశలో జారిపోతున్న ధాన్యం తగ్గుతుంది అని ప్రసక్తి ఉన్న ఆధారాలు సూచిస్తున్నాయి.

3.ఇప్పుడు ఆకలి దృశ్యంతో కలిపి చూడాలి. యునెప్ ప్రకటన ప్రకారం ప్రపంచవ్యాప్తంగా రోజుకు బిలియన్ల భోజనాల సమాన ఆహారం చెత్తలో కలసిపోతోంది, ఈ వ్యర్థం 8 నుంచి 10 శాతం గ్రీన్ హౌస్ ఉద్గారాలకు కారణమవుతోంది, ఆకలి బాధితుల సంఖ్య ఏడు కోట్ల డెబ్బై మూడు లక్షల నుంచి ఇంకా పైకి ఎగబాకుతోంది. రోజూ ఇళ్లలో పడే చెత్తలో కనీసం కొంత భాగం తినదగినదే, దానిని నిల్వ పద్ధతులు తెలియక లేదా భోజన పరిమాణాలను అంచనా వేయక, వంటింటిలో మెను ప్లానింగ్ లేక, వాణిజ్య స్థలాల్లో సర్వింగ్ పరిమాణాలు ఆకు మదింపు లేక వదిలేస్తున్నాం అని ఆ నివేదిక వాక్యాల సారాంశం చెబుతోంది.

దేశంలో వృథాను కొలవడం తగ్గించడం కోసం విధాన స్థాయిలో చర్యలు కావాలి, పంచాయతీ నుంచి పురపాలకమట్టం వరకు వంట నివ్వే వేడుకలలో అవశేషాల సేకరణకు నియమాలు, అంచనా మెనూ సాధనాల ప్రోత్సాహం, భోజనశాలలలో అర్ధ సర్వింగ్ ఎంపిక, ప్లేట్ సైజులు శాస్త్రీయంగా నియంత్రణ, ఆహారదాతృత్వ శృంఖలాలకు పన్ను ప్రోత్సాహం వంటి సాధనాలు ఉపయోగపడతాయి. నగరాల్లో సేకరణ రవాణా నెట్వర్క్‌లు ఫుడ్ బ్యాంక్‌లతో డిజిటల్ సంకలనం సాధిస్తే పెళ్లిళ్ల కార్యాలయ క్యాఫెటీరియాలు హోటల్ లోపల మిగిలే పదార్థం గంటల్లోనే అవసర మైనవారికి చేరుతుంది, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలతో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు మున్సిపల్ ట్రాన్స్పోర్ట్ స్లాట్లు ఇవ్వడం ద్వారా సమయ నష్టం తగ్గుతుంది అని అంతర్జాతీయ అనుభవాలు గమనిక పెడుతున్నాయి.

ఇళ్ల స్థాయిలో పరిష్కారం సులభమైన పద్ధతుల నుంచే మొదలవుతుంది. వారాంతపు సరుకుల జాబితాలు వంటకాల ముందస్తు ప్రణాళిక మిగిలిన పదార్థంతో రెండో భోజనం కాంబోలు ఫ్రిజ్‌లో భాగాలుగా నిల్వ పెట్టే పారదర్శక పాత్రలు బైబై బఫే అబద్ధపు ఆకలి ధోరణి ముగింపు అన్నీ మన నుంచి మొదలవుతాయి, కిచెన్ వ్యర్థాన్ని హోమ్ కాంపోస్టింగ్‌లోకి మళ్లిస్తే చెత్త గుట్టల వాసన దూరమవుతుంది, పెచ్చులు ప్లాస్టిక్ సంచులు తగ్గుతాయి, పురపాలక బిన్లపై ఒత్తిడి దిగుతుంది, రైతుకు వెనక్కు వెళ్లే క్రమంలో సేంద్రియ ఎరువుకీ పునర్జన్మ లభిస్తుంది అని నిత్యాయోగ రూపకల్పన పత్రాలు సూచిస్తున్నాయి. విద్యా సంస్థలలో పాఠ్య అంశాలుగా ఆహార వ్యర్థ నిరోధాన్ని ప్రవేశపెడితే తదుపరి తరానికి అలవాటు జీర్ణమవుతుంది, హాస్టల్ మెస్‌లలో ప్లేట్ మానిటరింగ్ సిస్టమ్ పెట్టి డిజిటల్ డిస్ప్లేలో రోజువారీ వృథా కిలోగ్రాములు చూపిస్తే మంచి పోటీ తత్వం ఏర్పడుతుంది, జిల్లాస్థాయిలో ఉత్తమ మెస్ ఉత్తమ హోటల్ పురస్కారాలు ఇచ్చి సామాజిక గుర్తింపులు అందిస్తే మార్పు వేగంగా వస్తుంది, మైనర్ మార్పులే అయినా బడ్జెట్‌కు మేలు, పోషకాహారానికి లాభం, పర్యావరణానికి ఉపశమనం అనే త్రివిధ ఫలితం ముందుకు వస్తుంది. యాప్స్ ద్వారా హోటళ్లు బేకరీలు రోజుకు ముగింపు సమయానికి అమ్మలేని ఆహారాన్ని సమీప సేవా సంస్థలకు డైరెక్ట్ అలర్టు ఇవ్వగలిగే వ్యవస్థలు ఇప్పటికే కొన్ని నగరాల్లో ప్రయోగంగా మొదలయ్యాయి, వీటిని జాతీయ స్థాయికి తీసుకెళ్లే సమయం వచ్చింది అని నిపుణుల ఆలోచనలు చెప్తున్నాయి.

ప్రభుత్వ స్థాయిలో కొలమానానికి ప్రాముఖ్యత అంతకు మించి ఉంది. యునెప్ సూచించిన టార్గెట్ మేజర్ యాక్ట్ పద్ధతితో రిటైల్ సేవారంగం ఇళ్ల స్థాయిలపై సంవత్సరానికి ఒకసారి సమన్వయ కొలమానం చేపట్టాలి, రాష్ట్రాల మధ్య తులనాత్మక సూచికలను ప్రవేశపెట్టాలి, చైన్ రెస్టారెంట్లకు నివేదిక సమర్పణ విధిగా చేయాలి, పెద్ద నగరాల మున్సిపల్ కార్పొరేషన్లకు ఆహార వ్యర్థ శాతం తగ్గింపు లక్ష్యాలు కేటాయించాలి, రాష్ట్ర పోషకాహార మిషన్లతో ఫుడ్ బ్యాంక్‌ల ఒప్పందాలు కట్టాలి అని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. ఇలాచేస్తే 2030 నాటికి వృథాను అర్ధానికి చేర్చాలనే ఎస్‌డిజి లక్ష్యం సాధ్యమవుతుంది, చలికాల వేడి తరంగాల దెబ్బకు నిల్వలలో పాడయ్యే పదార్థం కూడా కొంత మేర రక్షితమవుతుంది, వాతావరణ మార్పు బాధను తగ్గించే సహాయ ప్రయోజనాలు లభిస్తాయి అని నివేదికలు విశదపరుస్తున్నాయి. అంకెలతో మళ్లీ సమీక్ష. ప్రపంచ స్థాయిలో వినియోగదారుల దశలోనే ఐదో వంతు ఆహారం వృథా అయింది, ఇళ్లదగ్గర 631 మిలియన్ల టన్నులు, సేవారంగం 290 మిలియన్ల టన్నులు, రిటైల్ 131 మిలియన్ల టన్నులు, రోజుకి బిలియన్ భోజనాలకు సమాన పరిమాణం చెత్తలో కలిసిపోతోంది, భారత ఇళ్లలో సంవత్సరానికి 78.2 మిలియన్ల టన్నులు, వ్యక్తికి 55 కిలోల చొప్పున వృథా, నగరాల్లో స్థాయి ఎక్కువ, గ్రామాల్లో తక్కువ, పంట కోత తరవాత నష్టాల ఆర్థిక విలువ ఏటా 1.53 లక్షల కోట్లు, ధాన్యాల్లో శాతం నష్టం చైనా కంటే ఎక్కువ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కొన్ని వేల టన్నులు గోదాముల దశలో పాడై అధికార లెక్కల్లో నమోదైపోయాయి, ఇవన్నీ ఒక్క రూపకంలో చూసుకుంటే మన తలంపులు మన పనితీరు మన పాలన కూర్చుని మళ్లీ ఆలోచించాల్సిన అవసరం ఉందని చాటుతున్నాయి. దీన్ని మారుస్తాం అంటే భోజన పరిమాణం అంచనా వేసే చిట్కాలు ఇంటి నుంచి మొదలుపెడదాం, స్కూల్ కాలేజీ ఆఫీసు మెస్ నుంచి రెస్టారెంట్ వేదిక దాకా పరిమాణాలు విజ్ఞానంతో కట్టుదిట్టం చేద్దాం, మిగిలిన పదార్థానికి రెండో జీవితం ఇచ్చే వంటకాలు నేర్చుకుందాం, శీతల సంకెళ్ల విస్తరణకు పెట్టుబడులు డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ చిల్లింగ్‌కు ప్రోత్సాహాలు సేకరణ రవాణా సమయ నియంత్రణలకు స్మార్ట్ లోజిస్టిక్స్ ఏర్పాటు చేద్దాం, దాతృత్వ శృంఖలాలను ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలతో కలపుదాం, కొలమానాన్ని దేశస్థాయిలో బలం చేకూరుద్దాం. ఆకలి కేకలు మూగబోయే రోజు దూరంలో ఉండదు.

డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రజల గళం

*నాడు స్వాతంత్ర్య సమరంలో యావత్ భారతం "సైమన్ గో బ్యాక్" అంటూ ప్రతిధ్వనించింది. ఆ నినాదం దళిత వర్గాలపై అగ్రవర్ణాల కుట్ర అని డాక్టర్ అంబేడ్కర్ విమర్శించినా, ఆ సమర జ్వాల ఒక చారిత్రక ప్రతిఘటనగా నిలిచింది. అదే స్ఫూర్తి ఈ రోజుల్లో కొత్త రూపంలో కనిపిస్తోంది. నేటి భారత్‌లో "అదానీ గో బ్యాక్" అనే నినాదం వినిపించే సమయం దగ్గరపడింది. దానికి నాంది పలికింది విశాఖ జిల్లా పెదగంట్యాడ ప్రజల పోరాటం.*

సెప్టెంబర్ 8న పెదగంట్యాడలో అదానీ గ్రూప్‌కు చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏర్పాటు చేసిన వేదిక ప్రజా ఆగ్రహానికి కేంద్రబిందువైంది. వందలాది గ్రామస్థులు "అదానీ గో బ్యాక్" అంటూ గర్జించారు. ఆ గర్జనలో దాగి ఉన్నది కేవలం వ్యతిరేకత కాదు ౦ అది జీవన హక్కు కోసం జ్వలించిన అగ్ని. మహిళలు కూడా ముందుకు వచ్చి ఆగ్రహావేశంతో వేదికను ధ్వంసం చేశారు. జూలు విసిరిన సింహాల వలె ప్రజలు ఎదిరించి, తమ భూముల్లో కాలుష్యాన్ని తెచ్చే కర్మాగారాన్ని తిరస్కరించారు.పోలీసుల బలగాలు వచ్చినా ప్రజలు వెనుకడుగు వేయలేదు. "చావో బతుకో తేల్చుకుందాం" అన్న నిశ్చయంతో నిలిచారు. పెదగంట్యాడ ప్రజల ఈ పోరాటం భారత భవిష్యత్తుకు దిక్సూచి లాంటిది. ఆ రోజు వారు కేవలం ఒక ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కాదు, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తారు.

2.ఫ్రెడ్రిక్ ఏంగెల్స్ మాటల్లో, "ప్రజల అవసరాల కోసం కట్టిన కర్మాగారం ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది, కానీ లాభాల కోసం కట్టిన కర్మాగారం ప్రజల జీవనాన్ని దోచుకుంటుంది." చేగువేరా అన్నట్లు, "ప్రజల మనసుల్లో నిరసనాగ్ని రాజుకున్నప్పుడు ఏ గోడలు ఆ అగ్నిని ఆపలేవు." ఈరోజు ప్రపంచవ్యాప్తంగా అదే అగ్ని వ్యాపిస్తోంది. కులం, మతం, వర్గం, పార్టీ భేదాలు మరచి ప్రజలు ఒకటై తమ భూమి, గాలి, నీటి కోసం పోరాడుతున్నారు. అదానీ కంపెనీ గంగవరం పోర్టు పరిసర ప్రాంతాల్లో సిమెంట్ యూనిట్ స్థాపించాలనే ప్రణాళికతో వచ్చింది. జనావాసాల మధ్యే కర్మాగారం నిర్మించాలని యోచించింది. ఫ్లై యాష్ తో సిమెంట్ తయారీ చేయాలనే ఈ ప్రాజెక్ట్ స్థానిక ప్రజలకు ముప్పుగా మారింది. ఇప్పటికే ఎన్‌టీపీసీ, హిందూజా థర్మల్ ప్లాంట్ల కాలుష్యం వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్న గ్రామాలపై మరో భారం పడబోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ వందల లారీలతో రవాణా జరిగితే గాలి, ధూళి కాలుష్యం ప్రాణాంతకమవుతుందని హెచ్చరించారు.ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణకు పిలుపునిచ్చిన రోజు ప్రజలు ఆ వేదికను నిరసన వేదికగా మార్చేశారు. పోలీసులతో తోపులాట జరిగింది, కుర్చీలు విసిరారు, ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. "ప్రజల అనుమతి లేకుండా కర్మాగారం వద్దు" అని బలంగా నినదించారు. ఈ నిరసనతో సమావేశం నిలిచిపోయింది. ఇది పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ప్రజల గళం అని చెప్పాలి.

ఈ గళం కేవలం పెదగంట్యాడ వరకే కాదు ౦ దేశమంతా వ్యాపిస్తోంది. తెలంగాణలో కూడా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అదానీ కంపెనీ స్థాపనకు ప్రజలు అదే విధంగా వ్యతిరేకత తెలిపారు. ప్రజల ఆగ్రహాన్ని అడ్డుకోవడానికి పోలీసులను ఉపయోగిస్తున్న ప్రభుత్వాలు కూడా ఈ అలను ఆపలేకపోతున్నాయి. ఎందుకంటే ప్రజలు తెలుసుకున్నారు ౦ తమ భూమి, గాలి, నీరు, జీవితం అమ్మకానికి కాదని, ఈరోజు పెదగంట్యాడ ప్రజల పోరాటం ఒక ప్రాంతపు నిరసన కాదుబీ అది దేశవ్యాప్తంగా పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్భవిస్తున్న ప్రజా చైతన్యానికి ప్రతీక. చరిత్ర చెబుతుంది ౦ ప్రజలు లేస్తే సామ్రాజ్యాలు కూలుతాయి, నినాదాలు గర్జిస్తే దోపిడీ గోడలు కూలిపోతాయి.



డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలి

**కొడంగల్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలు తరలించి కొడంగల్ కు అన్యాయం చేయవద్దని కెడిపి జేఏసీ కన్వీనర్ కోట్రికే లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ సురేష్ కుమార్,యు. రమేష్ బాబు లు అన్నారు, ఆదివారం కోడంగల్ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున కేడిపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలి కొనసాగించారు, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మెమోరండం అందించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడంగల్ లోని ఏర్పాటు చేస్తామన్న మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు, మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల ఏర్పాటుతో కొడంగల్ అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశతో ఉంటే తరలింపుతో నిరాశకు గురయ్యారు, మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని సంవత్సరం దాటిన ఒక్క ఇటుక కూడా పెట్టకుండా సమయాన్ని వృధా చేయడం చూస్తుంటే ఈ ప్రాంతం పట్ల చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు, ఈ



ప్రాంతంలో మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను తరలిస్తుంటే కోడంగల్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు బయటకు వచ్చి మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను తరలించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే విధంగా ఒప్పించాలన్నారు, కోడంగల్ ప్రజల మనోభావాలను దెబ్బ తీసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం ఉందన్నారు, కోడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ గా ఏర్పాటు చేయాలన్నారు, కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో అభివృద్ధి చేయకుండా ఒకే ప్రాంతానికి తరలించడం చూస్తుంటే ఈ కొడంగల్ పై సవతితల్లి ప్రేమ చూపుతున్నట్లు ఉందన్నారు, అభివృద్ధి వికేంద్రీకరణ జరగడంతో వివిధ ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు, మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపు ఆపకపోతే కెడిపి ఆధ్వర్యంలో ఎద్దే ఎత్తును ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు, ఇప్పటికైనా ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కెడిపి సభ్యులు ఎస్ ఎం. గౌసన్. ఆనంద్ లాహోటి. నందారం రాజేందర్. పవన్ లాహోటి. సూర్య నాయక్. షాకీర్. రవి నాయక్. భీమ్ రాజ్. ఎరన్ పల్లి వెంకటయ్య. ప్రవీణ్. శివకుమార్. కిషన్ సింగ్. చిన్నయ్య. పకీరప్ప. శ్రీనివాస్. దేవరాజ్. అరవింద్. పాండ్యా నాయక్. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం కమ్యూనిటీహాల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని బీరప్ప నగర్ లో కామరాతి బీరప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో నిర్మిస్తున్న కురుమ సంఘం భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల సంఘాలు ఆరోగ్యకరమైన పోటీ తత్వంతో పోటీపడి అభివృద్ధి చెందాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు ఎందరో పేద ప్రజలకు ఉపయోగపడతాయని తెలిపారు. హాలు నిర్మాణం అయ్యేవరకు పూర్తి బాధ్యత తీసుకుంటారని హామీ ఇచ్చారు. నిధులకు వెనకాడకుండా కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టాలని సంఘం నాయకులకు తెలిపారు. అనంతరం బీరప్ప ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం చైర్మన్ నగేష్, అధ్యక్షులు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి చెవ్వ మహేందర్, కోశాధికారి నార్ల కంటి విష్ణు, పెద్ద కురుమ గొరిగే యాదయ్య, గొరిగే సత్తయ్య, నార్ల కంటి పెంటయ్య, మల్లేష్, దుర్గయ్య, సత్తయ్య, నరసింహ, బాలయ్య, నల్ల ప్రసాద్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్



**వెల్దండ, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన బిక్షపతి మాతృమూర్తి శంకరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు అదే గ్రామానికి చెందిన గాజుల విరభద్రయ్య కొడుకు మహేష్ బిల్డింగ్ పై నుంచి జారి కిందపడి మృతి చెందారు విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి వాళ్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు వాళ్ల కుటుంబాలను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్ చెర్కూర్ మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్ వెల్దండ మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ ఉప సర్పంచ్ నర్సింహా, బచ్చులకూర శ్రీను, మైసయ్య, సత్యం, గొడుగు యాదయ్య,కొండల్ యాదవ్, వెంకటయ్య, ఆలీ జంగిలి ఆనంద్ గాండ్ల జంగయ్య, చర్కా కొండల్, రామచంద్రయ్య బర్కం గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు, పట్టణాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

**కల్వకుర్తి, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** కల్వకుర్తి మండల పరిధిలోని నీ మార్చాల కుర్మిద్ద జీడిపల్లి గ్రామాల రహదారుల పరిస్థితి గత కొన్ని నెలలుగా దయనీయంగా మారాయి. ఈ మధ్య కురిసిన భారీ వర్షాల వల్ల రోడ్ల పై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరి దైనందిన జీవితాన్ని ఇది ప్రభావితం చేస్తోంది. ఈ తరుణంలో గ్రామస్తుల నిత్యజీవితాన్ని సులభతరం చేయాలన్న సంకల్పంతో బీజేపీ నాయకులు పూలగుర్ల కృష్ణారెడ్డి మరియు బండెల రామచంద్రారెడ్డి ముందుకు వచ్చి తమ స్వంత నిధులతో పాటు స్థానిక దాతల సహకారాన్ని సమకూర్చి దెబ్బతిన్న రహదారులపై మట్టిని కొట్టించి తాత్కాలికంగా రాకపోకలకు వీలుగా మార్గాన్ని సరిచేశారు. సామాజిక బాధ్యతను నిర్వర్తించడమే కాకుండా ప్రజాసేవకు తమ కట్టుబాటును చాటిచెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రాంతాల పరిస్థితులు మారడం లేదని ముఖ్యంగా రోడ్ల స్థితిగతులు చాలాచోట్ల దెబ్బతిని శిథిలావస్థలోకి చేరుతున్నాయన్నారు. మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి తాత్కాలిక మరమ్మతులతో సమస్యలు పూర్తిగా పరిష్కారం కావు అని ప్రభుత్వమే ముందడుగు వేసి పక్కా రహదారులు వేయాలి అని కోరారు.



### సంతోషం వ్యక్తం చేసిన వాహనదారులు, గ్రామస్తులు

సంతోషం వ్యక్తం చేసిన గ్రామస్తులు, వాహనదారులు ఈ చర్యను హర్షిస్తూ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. నిత్యం ఇబ్బందులతో ప్రయాణిస్తున్న మాకు ఎంతో ఊరట కలిగించింది అని పలువురు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రజాసేవా చర్యలు మరింత నాయకత్వానికి మార్గం చూపుతాయని ప్రభుత్వాన్ని స్పందింపజేసేలా పౌరుల సంఘటిత కృషి అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని కోరారు.

## లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థుల స్వర్ణోత్సవ పునఃకలయిక



**హైదరాబాద్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** 1975లో పట్టభద్రులైన హైదరాబాద్‌లోని అబిడ్స్‌లోని చిరాగ్ అలీ లేన్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు 2025 ఆదివారం తమ స్వర్ణోత్సవ పునఃకలయికను జరుపుకున్నారు. భారతదేశం, యూకే, యూఎస్‌ఏ, కెనడా, యూరప్‌లోని వివిధ ప్రాంతాల నుండి నలభై మంది విద్యార్థులు తమపాత పాఠశాలలో 50 సంవత్సరాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. వారి పాత పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి పాఠశాల యూనిఫాంలో ధరించి, వారు తమ పాత తరగతి గదిలో వారి మునుపటి ప్రదేశాలలో కూర్చుని, పాఠశాల క్యాంటీన్ నుండి వారికి ఇష్టమైన స్నాక్స్ తింటూ తమ తరగతి గది వాతావరణాన్ని తిరిగి సృష్టించారు. యాభై సంవత్సరాల క్రితం వారికి బోధించిన వారి ఇద్దరు ఉపాధ్యాయులు, మేరీ జోసెఫిన్, ఎస్.నర్సిమ్లులను భావోద్వేగ సంభాషణల మధ్య సత్కరించారు. పాఠశాల ఆవరణలో ఒక చెట్టును నాటారు. ఐదు దశాబ్దాల క్రితం వారు ఎలా ఆడారో అదే విధంగా విద్యార్థులు కబడ్డీ మ్యాచ్ ఆడారు. 1975 తరగతి లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ అబిడ్స్ వారి పాత ఉపాధ్యాయులతో ఒకే తరగతిలో కూర్చున్నారు.

## వైద్య దేవుడు ధనవంతరి



**తాండూరు, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** ఆయుర్వేద విజ్ఞానానికి మూల పురుషుడిగా పరిగణించబడే వైద్య దేవుడు ధనవంతరిఅని బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత, కాంగ్రెస్సీ నియర్ నాయకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ధన త్రయోదశి జయంతి సందర్భంగా తాండూర్ పట్టణంలోని శ్రీబాలాజీ నర్సింగ్ హోమ్ లో దన్వంతరి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ కు చెందిన వైద్యులు సదాశివరావు, భాస్కర్,అజయ్, రాకేష్, మల్లికార్జున్, హరీష్, అక్షయ్, దినకర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ స్టార్మ్ వాటర్ డ్రైన్ పరిశీలన



**హయత్‌నగర్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్‌లోని బెతస్థ కాలనీ, మన్సూరాబాద్ చిన్న చెరువు పరిసర ప్రాంతాల్లో 53.00 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ పనులను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, పరిసర కాలనీల స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో మన్సూరాబాద్ చిన్న చెరువు లోకి వర్షపు నీరు వచ్చే దారులన్నీ మూసుకుపోవడం వలన వర్షపు నీరు నిల్వ కాక భూగర్భ జలాలు తగ్గిపోయాని వారు అన్నారు. ఫలితంగా ప్రశాంత్ నగర్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, చంద్రపురి కాలనీ, ఆదిత్య నగర్, భవాని నగర్, మధురా నగర్, వినాయక్ నగర్, మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్, కాస్మోపాలిటన్ కాలనీ, సాయిసప్తగిరి, లక్ష్మీ నగర్, రాక్ టౌన్, సూర్యోదయ కాలనీ మొదలైన అనేక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు అని వారు తెలిపారు. మన్సూరాబాద్ చిన్న చెరువులో వర్షపు నీటిని స్టోరేజ్ చేయాలనే కాన్సెప్ట్ తో స్టార్మ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్టు కోసం ప్రత్యేక చొరవ తీసుకొని జోనల్ కమిషనర్ హేమంత కేశవ పాటిల్ ఐఏఎస్, ఇరిగేషన్ శాఖ అధికారుల సహకారంతో ఈ పనులు చేపట్టడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ సమస్య మళ్లీ రానీయకుండా శాస్త్రీయ, సుదీర్ఘ ప్రణాళికతో వర్షపు నీరు చిన్న చెరువులోకి చేరేలా శాశ్వత స్టార్మ్ వాటర్ డ్రైన్ రూపొందించినట్లు వారు వివరించారు. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపుకై తీసుకున్న ఈ చర్య ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకున్న అభివృద్ధి కార్యక్రమం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్ట్ నీటి సంక్షోభం లేకుండా ప్రాంతీయ అభివృద్ధికి ఇది కీలక మలుపు అవుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో పరిసర కాలనీల స్థానిక వాసులు నాంపల్లి కృష్ణ, పృధ్వీరాజ్, ప్రవీణ్ రెడ్డి, సుధాకర్, సతీష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి



**ఉప్పల్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** ఉప్పల్ డివిజన్ భరత్ నగర్ బురుజు గల్లి లో రూ. 92 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు మరియు డ్రైనేజీలను నిర్మాణాలను పనులను ఆదివారం కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. డివిజన్ లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలను చేస్తున్నట్టుగా ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఉప్పల్ డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా, ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్, సల్లా ప్రభాకర్ రెడ్డి,పాలడుగు లక్ష్మణ్ ,యేరా శ్రీనివాస్ ,,సోమ బాలమణి,మోత్కూరి శ్రీహిత్ బాబీ ,జిత్తు రెడ్డి , కొత్త వంశీ , మేకల రామ్ రెడ్డి ,మేకల మధుసూదన్ రెడ్డి ,పిన్నిటి భూపాల్ రెడ్డి , కొత్త మలేష్ గౌడ్ , ధర్మ రెడ్డి ,దశరత్ కురుమ ,తమ్మాలి రాజు ,తమ్మాలి కిషోర్ ,పుల్ల ప్రభాకర్ , గొండి ప్రశాంత్ రెడ్డి , సుడుగు నవీన్ రెడ్డి ,ముత్తంగరి రామ్, హరి యాదవ్ ,సోమ మలేష్ ,అడపా గౌతమ్ ,బజార్ నవీన్ గౌడ్ , టైసిన్ ,బురుజు రవి , కేమిడి ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

**వీపనగండ్ల, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో వీపనగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్ 5 క్రికెట్ క్రీడలు ను వివిధ పార్టీల నాయకులు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా జరిగే పాముకాటు గంగమ్మ జాతర విపిఎల్ సీజన్ 5 గ్రామ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ క్రీడలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ గోదల బీరయ్య, కాంగ్రెస్ నాయకులు ఎస్ రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ముంత మల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విపిఎల్ సీజన్ 5 క్రికెట్ లీగ్ నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువతకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచి చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు ప్రతి దీపావళి గంగమ్మ జాతర సందర్భంగా ఈ క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. క్రీడాకారులు స్నేహపూర్వకంగా మానసిక ఉల్లాసంతో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదయ్య, పాము నాగులు, నిర్వాహక సభ్యులు మునిగొండ గోపి, మధుగని అంజి, రాఘవేందర్ రెడ్డి, భత్తుల కిట్టు, దాసు, చాపల సాయిబాబు, దామోదర్, బాలకృష్ణ, మండ్ల బాబు, క్రీడాకారులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చివరి శ్వాస వరకు ప్రజా జీవితంలోనే..

- తోటకూర వజ్రేష్ యాదవ్ ...
- అభిమానులు, కార్యకర్తల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు



**బోడుప్పల్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** తన చివరి శ్వాస ఉన్నంత వరకు ప్రజా సేవలోనే ఉంటానని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం తన పుట్టిన రోజు వేడుకలను బోడుప్పల్‌లోని దేవి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ ను ఆయన కటింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ గ్రామంలో సామాన్య కుటుంబంలో పుట్టిన తనను రాష్ట్ర స్థాయి నాయకుడిగా గుర్తింపు రావడంలో మేడ్చల్ ప్రజలు ఇచ్చిన మద్దతు మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్,డిప్యూటి మేయర్ కుర్రి శివకుమార్ గౌడ్,బోడుప్పల్, పీర్జాదిగూడ అధ్యక్షులు పోగుల నరసింహ రెడ్డి,తుంగతుర్తి రవి,మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు రాములు, మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్,రాసాల వెంకటేశ్ యాదవ్,కొత్త చందర్ గౌడ్,సింగిరెడ్డి పద్మారెడ్డి,సుమన్ నాయక్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,సుబాష్ నాయక్, గుర్రాల వెంకటేష్ యాదవ్,పప్పుల అంజిరెడ్డి ఐల్లేష్ యాదవ్,ముదిగొండ రమేష్, యూత్ నాయకులు జెన్న రాజు తదితరులు పాల్గొన్నారు. జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మార్యద పూర్వకంగా కలిశారు.

# గురుకుల్ విద్యాసంస్థ పరిరక్షణ సమితి ఏర్పాటు

**ఘట్కేసర్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ టౌన్ లోని గురుకుల్ విద్య సంస్థను కాపాడాలన్న ఉద్దేశంతో ఆదివారం ఘట్కేసర్ టౌన్ లోని గురుకుల్ పూర్వ విద్యార్థులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు గురుకుల్ శ్రేయోభిలాషులు. బన్సీలాల్ వ్యాస్ కుటుంబ సభ్యులు అభిమానులు, పూర్వ విద్యార్థులైన అంకం సురేష్ యాదవ్, కొమ్మిడి మహిపాల్ రెడ్డి, అధ్యక్షతన సమావేశమై గురుకుల్ విద్యాసంస్థ పరిరక్షణ సమితి(జి.పి.ఎస్.)గా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. గురుకుల్ని ఎట్టి పరిస్థితుల్లో అన్యాక్రాంతం కాకుండా పాఠశాల, కళాశాల ను నడిపించే విధంగా గురుకుల్ విద్యాసంస్థలు ఎండోమెంట్ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి కనీసం గురుకుల్ అంటే అవగాహన లేక గురుకుల్ చరిత్ర తెలియక ఏదో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. వారి మాటలు



ఇకపై సహించేది లేదని, వారి మాటలు ఎవరు నమ్మొద్దని సమావేశం అభిప్రాయపడింది. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల అభిప్రాయాలు, వారి ఆవేదనను తెలియజేస్తుంటే ప్రతి ఒక్కరి గుండెలను కదిలించాయి. ఈ గురుకుల్ విద్యసంస్థలో విద్య అభ్యసించడం వల్ల మేము ఈ స్థితికి వచ్చామని ఇటువంటి చరిత్ర గల విద్యాసంస్థను కొంతమంది రాజకీయ మనుగడ కోసం, కొంతమంది భూమి కబ్జాకు కబ్జా కావడానికి ప్రోత్సహించారని, మరల వాళ్ళు, మళ్ళీ గురుకుల్ కి ఏదో చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారని, తస్మాత్ అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని, అటువంటివారు తమ స్వార్థ రాజకీయాలను వీడి మాతో కలిసి పని చేయడానికి రావాలని త్వరలో ఒక పుస్తక రూపంలో గురుకుల్ చరిత్ర ను ప్రజల ముందు ఆవిష్కరించబోతున్నామని సమావేశంలో తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో గురుకుల్ పరిరక్షణ సమితి గా ఒక అడక్ కమిటీని ఏర్పాటు చేశారు. త్వరలో ఈ కమిటీ కార్యాచరణను ప్రకటిస్తుందని సమావేశం అభిప్రాయపడింది. ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద మొత్తంలో సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేసిన ప్రతి ఒక్కరికి అంకం సురేష్ యాదవ్, కొమ్మిడి మహిపాల్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
20 అక్టోబర్ 2025

# అంగన్‌వాడీలకు నిరాశే మిగిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నేత శారద



**మక్తల్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీలకు నిరాశ మిగిల్చిందని అంగన్వాడి యూనియన్ రాష్ట్ర నేత శారద అన్నారు. మక్తల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా రెండవ మహాసభలు ఘనంగా నిర్వహించారు. మక్తల్ పట్టణ కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఎస్ఆర్ఎం ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య వత్తగా హాజరైన రాష్ట్ర నాయకురాలు శారద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన జాతీయ విద్యా విధానం వలన అంగన్వాడి కేంద్రాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను అంగన్వాడీలకే అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. పెరుగుతున్న ధరలు కనుగుణంగా మెస్స్ చార్జీలను పెంచాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోషణ అభియాన్, పోషన్ ట్రాక్, ఫేస్ క్యాప్చర్, బయోమెట్రిక్ విధానం వలన అంగన్వాడీలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్ రామ్, జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ జిల్లా అధ్యక్షులు శశికళ, యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, నాయకులు నాగజ్యోతి, కవిత, భారతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అంబేద్కర్ ప్రీమియం లీగ్ క్రికెట్ క్రీడలు



**వీపనగండ్ల, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో దీపావళి గంగమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా గత రెండు సంవత్సరాల నుండి వీపనగండ్ల ప్రీమియర్ క్రికెట్ లీగ్ క్రీడలు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రారంభమైన లీగ్ క్రికెట్ క్రీడలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, సీనియర్ నాయకులు ఎస్ రవీందర్ రెడ్డి, భిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదయ్య, సమీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువకులకు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు చాలా అవసరం అని, ఆత్మవిశ్వాసంతో ఆటలు ఆడి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సలహా ఇచ్చారు. ప్రస్తుతం కాలంలో యువత చరవాణి, డ్రగ్స్ చెడు అలవాట్లకు బానిస అవుతున్న సమయంలో క్రీడలు యువతకు ఆరోగ్యపరంగా అవసరమని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ క్రీడా ప్రాంగణాన్ని తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించడం, క్రీడాకారులు అందరూ కలిసిమెలిసి జట్టుగా ఏర్పడి క్రీడా స్థలాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. స్నేహ పూర్వక వాతావరణం లో క్రీడలు ఆడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మీసాల నాగరాజు, పాము రాజశేఖర్, అంబేద్కర్ ప్రీమియం లీగ్ క్రికెట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లకు పాఠశాల తనిఖీ డ్యూటీలు వేయొద్దు



**చేర్యాల, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయులకు పాఠశాలల తనిఖీ పేరుతో బోధనేతర పనుల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆ విధుల నుండి ఉపాధ్యాయులను తప్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు కోరారు. జిల్లా,మండల స్థాయిలో పర్యవేక్షణ కోసం ఇప్పటికే ఒక ఎంఈఓ, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, అదేవిధంగా ఎంఎన్ఓ లు ఉండగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర జిల్లా అధికారులు కూడా ఉన్నారు. అయినను మళ్ళీ పర్యవేక్షణ నిమిత్తమై ఉపాధ్యాయులను ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలో తనిఖీ చేయడానికి ఉపాధ్యాయులతో కూడిన కొన్ని టీములు వేయడం కోసం ఉత్తర్వులు రావడం జరిగింది. ఇది సరైన విధానం కాదని అన్నారు. ప్రైమరీ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీర్చకుండా పైగా డిప్యూటేషన్లు చేయడం జరిగింది, తద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. కావున తప్పనిసరిగా ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఏవి కేటాయించకుండా బోధన సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉంచాలని, ఈ పర్యవేక్షణ టీములను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రసమయి ఇంటిపై దాడిచేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలి



**బెజ్జంకి, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** మండలకేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సత్యఅర్జునా ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్ మాట్లాడుతూ మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలి అని డిమాండ్ చేశారు. రసమయి అన్న ఇంటిపై దాడి చేసి 3 రోజులు కావస్తున్న దుండగులపై చర్యలు తీసుకోవటం లో పోలీసు వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. దాడిలో పాల్గొని దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి వారిపై చర్యలు తీసుకోకపోతే మానకొండూరు నియోజకవర్గం లో ఉన్న ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కదలి వచ్చి కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం అని అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కనగండ్ల తిరుపతి మాట్లాడుతూ పని చేసే ఆడవాళ్ళు ఉన్నాం అని చెప్పిన కూడా చూడకుండా రాళ్ళ దాడి చేయటం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనం అని అన్నారు. అభివృద్ధి చేయటం మరచి దాడులకు దిగడం అవివేకమని అని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విలేకరులను పోస్ట్ మ్యాన్‌లు, కోవర్టులు అనటం తగదు అని అన్నారు. మీ డీసీసీ ఎన్నికల్లో నిన్ను నీ కాంగ్రెస్ నాయకులే విమర్శించారు. అందుకే సానుభూతి కోసం రసమయి అన్న మాటలను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పెట్టారు అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నీ ప్రశ్నిస్తే దాడులు చేయటం సరి కాదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు,భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు సెంటర్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలి
- పాలమాకుల పిఎసిఎస్ చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి



**నంగునూర్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** రైతులు దళారుల నమ్మిమోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లోనే అమ్ముకోవాలని పాలమాకుల పిఎసిఎస్ చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, నర్మెట్ట మరియు మైసంపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన సందర్భంగా అధ్యక్షులు ఎల్లంకి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈసారి మద్దతు ధరను పెంచిన విషయం ప్రస్తావిస్తూ రైతులు తప్పనిసరిగా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లో మాత్రమే ధాన్యాన్ని అమ్ముకోవాలని మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాలుకి రూ. 2389, బి గ్రేడ్ రూ. 2369 పొందాలని రైతులకు సూచించారు. సెంటర్లకు కేటాయించిన మిల్లర్ల యజమాన్యంతో దిగుమతి విషయం మాట్లాడగా వారు ఈ దీపావళి తర్వాత ఒకటి రెండు రోజుల తర్వాత దిగుమతి చేసుకుంటామని తెలిపిన విషయం రైతులకు తెలిపారు. సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ ఈ రెండు రోజులలో కాంటాలు ప్రారంభించాలని లారీల విషయంలో కానీ, దిగుమతి విషయంలో కానీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఏవైనా ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్లు ప్రజాప్రతినిధులు,రైతులు, హమాలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన గురుకులాలను కొమరంభీమ్ పాఠశాలలుగా మార్చాలి



**మల్దకల్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** రజాకార్ల నుండి తెలంగాణ విముక్తి కోసం పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన వీరుడు మన కొమరం భీమ్ పేరుమీద గిరిజన గురుకులాల పేరు మార్చాలని హిందూ వాహిని ఉమ్మడి పాలమూరు విభాగ కన్వీనర్ అభిలాష్ ఔదే కార్ అన్నారు. ఆదివారం పట్టణంలో శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో హిందూవాహిని ఉమ్మడి పాలమూరు విభాగ్ కన్వీనర్ అభిలాష్ హౌదేకార్ మాట్లాడుతూభారతదేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చారిత్రాత్మకమైనవి,ఆదివాసీలపై నిజాం నవాబులు చేసిన దోపిడీ,దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ వీరోచితంగా పోరాడి,ప్రాణాలర్పించి'జల్-జంగిల్-జమీన్' నినాదానికి ప్రతీకగా నిలిచిపోయాడని, తాను 10 ఏళ్ళ వయసులోనే తన తండ్రిని రజాకార్లు కాల్చి చంపారు. తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న ఈ దాడులు చూడలేక గేర్లా యుద్ధానికి రణభేరి మోగించాడని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల పాఠశాలల పేర్లపై కొమరం భీం గురుకుల పాఠశాలగా మార్చి వారి త్యాగ ఫలితాలను పాఠ్యాంశాలలో చేర్చి నేటి భావితరాలకు అందజేయాలని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హిందూ వాహిని జిల్లా శాఖ తరుపున డిమాండ్ చేశారు. ఒకవేళ కొమరం భీమ్ పేరు గనక పెట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున హిందూ వాహిని ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కృష్ణయాదవ్,కో కన్వీనర్ రామకృష్ణ, బజరంగ్దళ్ భాస్కర,అనూష్ రెడ్డి,అఖిల్ తదితర హిందూ వాహిని కార్యకర్తలు పాల్గన్నారు.

## దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

- లక్ష్మీ నారాయణుని అనుగ్రహముతో అన్నింటా శుభం చేకూరాలి
- జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**నంగునూరు, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా ప్రజలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు దీపావళి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియ జేశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారద్రోలే వెలుగుల పండుగా దీపావళికి హిందూ సంస్కృతిలో విశేషమైన ప్రాశస్త్యం ఉన్నదని పేర్కొన్నారు. ఈ దీపావళి పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి అని ఆకాంక్షించారు. ఈ పర్వదినాన్ని వేడుకగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని. చిన్నపిల్లలు కాకరొత్తులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆ లక్ష్మీ నారాయణుని అనుగ్రహముతో అందరికి శుభం చేకూరాలని , సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

## రేజింతల్‌లో జూదమాడుతున్న నలుగురిపై కేసు నమోదు



**న్యాల్‌కల్, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** విశ్వసనీయ సమాచారం మేరకు హద్దునూర్ పోలీసులు ఆదివారం దాడి చేయగా పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన రేజింతల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేజింతల్ గ్రామ శివారులోని అంజిరెడ్డి వ్యవసాయ పొలంలో గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా.. వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రూ:15690 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారిలో స్థానిక పోలీసులు మహేష్, సాయి కుమార్, మోహన్‌లు ఉన్నారు.

## ఎస్సీలకు పంప్‌సెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19 (జనం సాక్షి) :** నారాయణపేట నియోజకవర్గం ధన్వాడ మండలం కిష్టాపూర్ గ్రామంలో రైతులకు ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు అయిన పంప్ సెట్ల ను ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి లబ్ధాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ బలహీన వర్గాల అభివృదిక రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు



**జడ్చర్ల, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని, ఎంచుకున్న లక్ష్యానికి పట్టుదల తోడైతే విజయం సొంతం అవుతుందని పలువురు పేర్కొన్నారు. జడ్చర్ల మండలానికి చెందిన లింగంపేట గ్రామస్తురాలు దాసరి సౌమ్య గ్రూప్ 1 పరీక్షల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆదివారం లింగంపేట్, కోడుగల్ గ్రామ ప్రజలు దాసరి సౌమ్యను ఘనంగా సన్మానించారు. సౌమ్య తల్లిదండ్రులు సులోచన రాణి, గిరి వర్ధన్ దంపతులను అభినందించారు. సౌమ్య పట్టుదలతో గ్రూప్ 1 లో డీఎస్పీగా ఉద్యోగం పొందడం గ్రామ యువతి, యువకులకు స్ఫూర్తిదాయకమని, కృషి పట్టుదలతో ప్రతి ఒక్క విద్యార్థి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తహేర్, రాష్ట్ర కార్యదర్శి శశిధర్, మాజీ సర్పంచ్ హైమావతి, నాయకులు నవీన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇంతియాజ్, అయూబ్, తిరుపతి రెడ్డి, హ్యూమయన్, శ్రీధర్ రెడ్డి, వెంకటస్వామి గౌడ్ బాలు, మహిళలు, యువతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి



**రాజాపూర్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** మండల పరిధిలోని రంగారెడ్డిగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్ద చెరువు కట్ట మైసమ్మ పూజలో ఎమ్మెల్యే అనిరుధ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ముదిరాజ్ లు చేపల చెరువులపై ఆధారపడి, చేపలు పెంచుతూ జీవిస్తున్నాయి. అందుకు మా ప్రభుత్వం ఉచిత చేపపిల్లలు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నదని అన్నారు. మంచి రకాల చేపలను పెంచి లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యాక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డైరెక్టర్ లు శివకుమార్, వెంకటేష్,కృష్ణయ్య, యాదగిరి, రాజు,సంజీవ్, పవన్,నరేష్, సభ్యులు కిరణ్,ప్రవీణ్, ప్రేమ్, లక్ష్మీనారాయణ, రవి,రమేష్, సత్యనారాయణ, రాజేష్, గుణాకర్ తదిరులు పాల్గొన్నారు.

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమని,ప్రతి పేదవారికి సొంతింటి కల నెరవేర్చడమే నా లక్ష్యమని, యువత అన్ని రంగాలలో ఎదిగేందుకు ప్రోత్సాహం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో సునీల్ వాల్మీకి ఆధ్వర్యములో 20వ వార్డుచెందిన 50మంది యువకులు బి.జె.పి,కాంగ్రెస్ పార్టీ ల నుంచి బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలలో బి.ఆర్.ఎస్ పార్టీకి అపూర్వ స్పందన లభిస్తుందని రాబోవు కాలములో బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి రానుందని స్పష్టం చేశారు.నా హయాములో పట్టణాన్ని ప్రగతిపథంలో నడిపించామని దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న రోడ్ల విస్తరణ పూర్తి చేశామని నేడు రోడ్లు ఆక్రమించుకుంటున్న పట్టించుకున్న నాథుడు లేకుండా పోయాడని మౌలిక వసతులు మంచినీటి, డ్రైనేజీ, విద్యుత్తు, అంతర్గత రోడ్లు,పార్కులు, చెరువులు అభివృద్ధి చేశామని వాటిని పరిరక్షించుకోలేని స్థితిలో నేటి పాలకులు ఉన్నారని అన్నారు. రాబోయే మన ప్రభుత్వంలో జాగలేని,ఇల్లు లేని పేదవారు ఉండకుండా కృషి చేస్తామని అన్నారు. 3200 డబుల్ బెడ్ రూమ్స్ నిర్మిస్తే అందులో 1500బెడ్ రూమ్స్ పట్టణములో నిర్మించామని గుర్తు చేశారు. యువతకు స్వయం ఉపాధి,ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఎదిగేందుకు ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచి కె.సి.ఆర్ సామాన్యులను హీరోలు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి విధ్వంస పాలనలో సామాన్యులు జీరోగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వం వస్తుందని మళ్ళీ కె.సి.ఆర్ సంక్షేమ పాలన కొనసాగిస్తామని అన్నారు. పార్టీలో కోమరి రాజశేఖర్నాయుడు, శ్రీనివాసులు, అరుణ్, ఉందేకోటి పరుష, రాము, నాగరాజు, గోపి, తదితరులతో పాటు 50మంది యువకులు చేరారు. ఈ కార్యక్రమములో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్ నందిమల్ల అశోక్, నాగన్న యాదవ్, సూర్యవంశం గిరి, హేమంత్ ముదిరాజ్, జోహెబ్ హుస్సేన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయానికి ప్రతీక 'దీపావళి' పండుగ

**కిటకిట లాడుతున్న టపాకాయల దుకాణాలు**

**పండుగ వేళ బంతిపూలకు భలే గిరాకి**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పండుగ. నేడు సోమవారం జరిగే దీపావళి పండుగను పురస్కరించుకొని టపాకాయల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. బంతిపూలకు గిరాకి బాగానే ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దీపావళి పండుగ వేల సందడి నెలకొంది. టపాకాయలు, ప్రమిదలు, పూజాసామాగ్రి, బంతిపూల కోసం ప్రజలు భారీగా తరలిరావడంతో జిల్లాకేంద్రంలోని ముఖ్యకూడళు జనంతో నిండిపోయి కిటకిటలాడాయి. ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే అతి పెద్ద పండుగలలో దీపావళి ఒకటి. ఇది కేవలం ఒక్క రోజు పండుగ కాదు. ఐదు రోజుల పాటు ప్రత్యేక సంప్రదాయాలు, సాంస్కృతిక ఆచారాలతో కూడిన గొప్ప వేడుక. ఈ ఏడాది దీపావళి ప్రధాన పూజ అక్టోబర్ 20వ తేదీన వచ్చింది. ఈ రోజున సాయంత్రం వేళ లక్ష్మీదేవి, గణేశుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. 20న మధ్యాహ్నం 2:40 గంటలకు అమావాస్య తిథి ప్రారంభమై అక్టోబర్ 21 సాయంత్రం 4:05 గంటలకు ముగుస్తుంది. సూర్యాస్తమయానికి అమావాస్య ఘడియలు అక్టోబర్ 20వ తేదీనే ఉండడం వల్ల ఈ రోజే దీపావళి జరుపుకోవాలి.

**విరజిమ్మనున్న దీపాల కాంతులు**

దీపావళి సందర్భంగా దీపాల కాంతులు విరజిమ్మనున్నాయి. దీపాలు వెలిగించి, ఇళ్లను శుభ్రం చేయడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహిస్తుందని, వచ్చే ఏడాది అంతా సుఖ సంతోషాలు ఉంటాయని ప్రజలు విశ్వసిస్తారు. దీపావళి రోజు తెల్లవారుజామునే నువ్వుల నూనెతో తలంటుకుని స్నానం చేస్తారు. ఇంటి గుమ్మాన్ని మామిడి ఆకులతో, పూలమాలలతో అలంకరించి, సాయంత్రం రంగవల్లికలు (ముగ్గులు) తీర్చిదిద్దుతారు. దీపావళి రోజున వెలిగించే దీపాలకు మట్టి ప్రమిదలు, లక్ష్మీదేవికి ఇష్టమైన నువ్వుల నూనె లేదా ఆవు నెయ్యి వాడటం ఉత్తమంగా భావిస్తారు. ఇక టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు, పిల్లలు జాగ్రత్త వహించాలి. అలాగే, పెద్ద శబ్దాలు చేసే టపాకాయలు కాల్చడం వల్ల పరిసరాల్లోని పసిపిల్లలు, వృద్ధులు, పక్షులు, పెంపుడు జంతువులు భయపడతాయి. మన ఆనందం కోసం మరో ప్రాణిని హింసించకుండా, రంగురంగుల కాంతులతో వెలుగులు విరజిమ్మే శబ్దరహిత, పర్యావరణ హితమైన టపాసులను కాల్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వడం మంచిదని అందరి భావన.

**దీపావళి ఆనందంగా జరుపుకోవాలి: కలెక్టర్**



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దలు పర్యవేక్షణలో ఉండాలని కలెక్టర్ సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ దీపావళి వెలుగులు ప్రతి ఇంటికి సంతోషం, ఆరోగ్యం, ఆనందాన్ని నింపాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు.

## శిల్ప కళా ఖండాలు చూస్తూ.. మంత్ర ముగ్ధులవుతూ!

- జైనత్ ఆలయ విశిష్టతపై ఆరా తీసిన కలెక్టర్
- కుటుంబ సమేతంగా ఆలయంలో పూజలు





**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని వేల సంవత్సరాల కాలం నాటి చరిత్ర కలిగిన జైనత్ మండలంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా కుటుంబ సమేతంగా సందర్శించి ఆలయ విశిష్టతపై ఆరా తీశారు.ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ఉన్న పరిసరాలు, అక్కడే ఉన్న చిన్న చిన్న ఆలయ రాతి శిలలను పరిశీలించారు. ఆలయంకు ఇరువైపుల నుంచి గుడి గోపురం పై వరకు గోడలపై నల్లటి రాతి బండలతో చెక్కిన అందమైన అద్భుత శిల్పాలను చూసి కలెక్టర్ ఎంతగానో మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయ చరిత్రను అక్కడ ఉన్న గ్రామ పెద్దలు, పూజారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయం దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.

## పూజ స్టోర్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి, అక్టోబర్ 19 (జనం సాక్షి):** శ్రీ మంజునాథ పూజ స్టోర్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి భూపాలపల్లి పట్టణంలో బి ఆర్ ఎస్ వి నాయకులు సెగ్గం దినేష్ ను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని పూజ స్టోర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారితో ముచ్చటిస్తూ వ్యాపారం బాగా జరగాలని దీవించి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న పంచలింగాల శివాలయం



**ఆత్మకూర్, అక్టోబర్ 19 (జనం సాక్షి):** భారతదేశంలోనే అతి ప్రాచీనమైన శ్రీ మహాదేవ స్వామి పంచలింగాల శివాలయం పదమ వార్షికోత్సవాన్ని ముస్తాబవుతుంది. వెయ్యి సంవత్సరాలు పూజలు అందుకున్న పంచలింగాల శివాలయం పునరుద్ధరణ జరిగి కార్తీక మాసంలో ప్రారంభోత్సవం జరిగింది. పదమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ శివ పార్వతి కళ్యాణ మహోత్సవం, మహా మృత్యుంజయ హోమాలు, వేద పండితుల చేత రుద్రాభిషేకాలు, నిత్య ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి, బృందం తోట రఘు, భాష బోయిన సాగర్, రేవూరి దేవేందర్ రెడ్డి, కాడ పోయిన రమేష్, పొగాకుల ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎందరో అతిరథ మహారాజులు వస్తున్నారని వారు తెలిపారు. ఈనెల 28 నుండి ఉత్సవాలు ప్రారంభోత్సవం అవుతాయని భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని శివపార్వతి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సేవలందిస్తాం



**తొర్రూరు, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో నిరుపేదలకు సేవలందిస్తామని క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య అన్నారు.అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఉన్న నిరుపేద గుడిసేవాసులకు నెల రోజులకు సరిపడ నిత్యవసర సరుకులు, బియ్యం పంపిణీ,పేద మహిళలకు చీరలు,పేద ప్రజలకు దుప్పట్లు,టీ షర్ట్ లు, టవల్స్, పెద్ద ముప్పారం లో లయన్ దారం కుమారస్వామి ఏర్పాటు చేసిన అమ్మ ఒడి ఆశ్రమంలో వృద్ధులకు పరుపులు, దిండ్లు, వారం సరిపడ్డ కూరగాయలు, నెల రోజులకు సరిపడ్డ నిత్యవసర సరుకులు, 25 కేజీల బియ్యం, స్టీల్ ప్లేట్లు, పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలని ఉద్దేశంతో ప్రతి ఏడాది పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. పేదరికంలో జీవిస్తున్న ప్రజలు వారిని బయటకు తీర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు పోరాటాలు వృధానే అవుతున్నాయని, పేదరికంతో కొంతమంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. సేవలు చేయడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకు సాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఎవల్యూషన్ చైర్మన్ రేగూరి వెంకన్న, జెర్సీ చిదిరాల నవీన్,క్లబ్ సెక్రటరీ లయన్ ముడుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


**మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 19(జనంసాక్షి):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి నగర ప్రజలకు దీపావళి పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగ మేయర్ మాట్లాడుతూ దీపావళి వెలుగుల పండుగని, అంధకారాన్ని తొలగించి వెలుగు ప్రసరించే ఈ పండుగ మనకు ఆనందం, శాంతి, ఐక్యతను తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సురక్షితంగా, పర్యావరణ హితంగా దీపావళిని జరుపుకోవాలని కోరారు. పటాకుల వలన కలిగే కాలుష్యాన్ని తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. స్వచ్ఛమైన వరంగల్ నిర్మాణంలో భాగస్వాములవుదాం" అని తెలిపారు.

## ప్రభుత్వ కొనుగోళ్లు కేంద్రాల్లోనే విక్రయించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**బోథ్, అక్టోబర్ 19(జనంసాక్షి) :** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలనీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.ఆదివారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి మరియు సోయా బిన్ కొనుగోలు కేంద్రాలను కూడా వెంటనే ప్రారంభించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ప్రభుత్వం పునరాలోచించలని కోరారు.అలాగే పంటలకు బోనస్ అందించాలని ,దళారుల చేత మోసపోకుండా ఉండాలన్నరు.కార్యక్రమంలో పిఎసిఎస్ కదం ప్రశాంత్ మార్కెట్ చైర్మన్ గంగయ్య, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్,శ్రీధర్ రెడ్డి,సురేందర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..**



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 19(జనంసాక్షి):** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అన్నారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖశాంతులతో పండుగను ఆనందంగా సురక్షితంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## కుల అహంకార హత్యలు ఇంకెన్నాళ్లు?

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్
- తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



**భీమదేవరపల్లి, అక్టోబర్ 19(జనం సాక్షి) :** కుల అహంకారంతో జరిగే హత్యలు దాడులు దౌర్జన్యాలు దేశంలో ఇప్పటికీ ఆగడం లేదని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు.నిండు గర్భిణి అని చూడకుండా కోడలిని కిరాతకంగా నరికి చంపిన మామపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం వ్యాప్తంగా రోజూ వందల సంఖ్యలో కులాంతర హత్యలు దాడులు కుల బహిష్కరణలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా కులహంకారం ఇంకా సమాజంలో పాతుకుపోయి ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి రోజు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం గొర్రె గ్రామంలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ రాణి (23) అనే మహిళ తన ప్రేమికుడు శేఖర్‌ను వివాహం చేసుకోవడంతో ఆమె తండ్రి,కుటుంబ సభ్యులు అసహనం చెంది పలుమార్లు బెదిరించినట్లు తెలిపారు.నిండు గర్భిణి అయిన రాణి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె మామ గొడ్డలితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడని చెప్పారు. స్థానికులు చేరుకునేలోపు నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ సంఘటనపై చెప్యాల ప్రకాష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంకెన్నాళ్లు ఇలాంటి కుల అహంకార హత్యలు? ప్రభుత్వం మౌనం వీడాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.


## దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు

- 17 తులాల ఆభరణాలు స్వాధీనం
- డిఎస్పి వహీయోద్దిన్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 19 (జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ని బాలాజీ నగర్ లో గత సంవత్సరం దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం కాగజ్ నగర్ డి.ఎస్.పి వాహి యుద్దీన్ పట్టణ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర చెందిన గౌతమ్ విశ్వాస్ పట్టణంలోని బాలాజీ నగర్ కు చెందిన బొల్లు ప్రసాద్ శ్యామల ఇంట్లో గత సంవత్సరం అక్టోబర్ 13న 17 తులాల బంగారు, వెండి ఆధారాలు దొంగలించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఎట్టకేలకు 11 నెల తర్వాత దొంగతనం కేసును చేదించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రేమ్ కుమార్, ఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**బోథ్,అక్టోబర్ 19(జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో రాష్ట్ర అటవీ శాఖ బోథ్ నేచర్ కన్సర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆవు పేడ ప్రమిదలను పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒకరు మొక్కలు నాటి వాటి పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్, అటవీ క్షేత్రఅధికారి ప్రణయ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 19 (జనంసాక్షి) : ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.ఆదివారం దాసాయిగూడెంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ నిబంధన ప్రకారం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్ చింతమల్ల రమేష్, నాయకులు సునీల్ రెడ్డి,టిఎంసి శ్వేత, సిఓ ఉమారాణి, అధ్యక్షురాలు శిరీష, ఆర్పీ సైదమ్మ, కమిటీ సభ్యులు పద్మ, శాంతమ్మ, నిర్మల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 19 (జనంసాక్షి) : ఈనెల 25న హుజూర్ నగర్ పట్టణంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.ఆదివారం దుబ్బ తండాలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం మెగా జాబ్ మేళా పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని అన్నారు.సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సహకారంతో హుజూర్ నగర్ లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో 150 ప్రైవేటు సంస్థలు పాల్గొంటుండగా 2వేల నుండి 5వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ,మాజీ జడ్పిటిసి చింతమల్ల రమేష్, దండు మైసమ్మ దేవాలయం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి,పందిరి మల్లేష్, సునీల్ రెడ్డి, మెప్మా కోఆర్డినేటర్ శ్వేత, ఏరియా కోఆర్డినేటర్ ఉమారాణి, ఆర్పీ ఎల్లోరా, భద్రమ్మ, శాంత, బుజ్జి, నాగు నాయక్, వెంకన్న, వల్యా, రవి, రమేష్, భాను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం పార్టీలోకి భారీగా చేరికలు

- సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసేది సీపీఎం మాత్రమే
- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



ఖమ్మం, అక్టోబర్ 19 (జనం సాక్షి) : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించేది కేవలం సీపీఎం పార్టీ మాత్రమే అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. సరితా క్లీనిక్ సెంటర్ లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ 52 వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సభ నిర్వహించారు. ఆ ప్రాంతం నాయకులు పి సుభాష్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు సీపీఎం పార్టీలోకి చేరారు. నాయకులు నున్నా నాగేశ్వరరావు, వై విక్రమ్, యర్రా శ్రీనువాసురావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరం అభివృద్ధి వైపు పరుగులు తీయడానికి ఒక ప్రధానమైన కారణం ఆనాడు 35 సంవత్సరాలు పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్రవూరి లక్ష్మీనర్సయ్య పరిపాలన ప్రధాన కారణం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనువాసురావు, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, కార్పొరేటర్లు ఎల్లంపల్లి వెంకట్రావు, యర్రా గోపి, వన్ టౌన్ కార్యదర్శి నాగులు మీరా, చిన్న హుస్సేన్, డి వీరబాబు, రవీంద్ర, చిరంజీవి, మల్లికార్జున్ రెడ్డి, రాజ్ కుమార్, రాజ్ బీర్, విశాల్, సుమిత్, పోతురాజు భిక్షం, సంధ్యా, నాగుల్ మిరా, సురేష్, నరేందర్, నల్లగిరి ఉపేందర్, ఎస్ కే సాదిక్, మహేష్, సైదా, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి బీసీ జేఏసీ మండల కార్యవర్గం ఎన్నిక



తలకొండపల్లి అక్టోబర్ 19 (జనంసాక్షి) : తలకొండపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మండలంలోని బీసీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జేఏసీ చైర్మన్ గా గుజ్జారి రాఘవేందర్,గౌరవ చైర్మన్‌గా తిరుమణి నిర్మల,పద్మ నరసింహ,సిఎల్ శ్రీనివాస్ యాదవ్,బక్కి కుమార్, వైస్ చైర్మన్‌గా బోసు వెంకటయ్య,టి.రవిగౌడ్,పుట్ట పాండు, కానుగుల వెంకటయ్య,అడ్వైజర్ గా విష్ణువర్ధన్,ప్రధాన కార్యదర్శులుగా రవీందర్ యాదవ్,అనిల్ ముదిరాజ్,బాల కుమార్ గౌడ్,శ్రీశైలం యాదవ్,నూకం వెంకటయ్య, కోశాధికారులుగా వెంకటాచారి, టి.విష్ణు గౌడ్, ప్రసాద్ జి,కట్టెల శేఖర్ యాదవ్, నీలకంఠం పాండు, కార్యదర్శులుగా మల్లేష్ యాదవ్,లింగం గౌడ్,రామాంజనేయులు ,కెంచ రమేష్, చంద్రయ్య ముదిరాజ్,ఆర్.బాస్కర్,కార్యదర్శిగా జె.రమేష్,శ్రీకాంత్ గౌడ్,పాండు యాదవ్, బాలకృష్ణ, సోషల్ మీడియా ఇంచార్జ్ బోల యాదగిరి,వెంకటేష్,మల్లేష్, స్వామి గౌడ్,వట్టేల శేఖర్,లీగల్ అడ్వైజర్‌గా కృష్ణ గౌడ్,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విదంగా 27 మందిని ఈసీ మెంబర్స్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు జేఏసీ చైర్మన్ గా ఎన్నికైన గుజ్జారి రాఘవేందర్ ను సన్మానించారు.

## కల్లూరులో ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టర్ కార్యాలయం నిర్మాణానికి ప్రతిపాదనలు

కల్లూరు, అక్టోబర్ 19 (జనం సాక్షి) : రాష్ట్రంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టరేట్ కార్యాలయం కల్లూరులో నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచన మేరకు పది ఎకరాల విస్తీర్ణంలో 49 కోట్ల రూపాయలతో నూతన భవనాల నిర్మాణానికి సంబంధించిప్రతిపాదనలు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రతిపాదనలు అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచనతో కల్లూరులో అన్ని హంగులతో కొత్త ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టరేట్ కార్యాలయం రూపుదిద్దుకోనుంది. కల్లూరు సబ్ కలెక్టరేట్ వేదికగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట కొలువుదీరనున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖలలో ప్రజలకు సమగ్ర సేవలు, సమర్థవంతమైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో సబ్ కలెక్టరేట్ ను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టరేట్ గా కల్లూరు సబ్ కలెక్టరేట్ నిలవనుంది. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కల్లూరు సబ్ కలెక్టర్ ను ఇంటిగ్రేటెడ్ సబ్ డివిజనల్ కలెక్టరేట్ గా ప్రతిపాదన తయారు చేయాలని సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మంత్రి తుమ్మలకు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రతిపాదనలు అందించారు. ప్రభుత్వ భూముల రక్షణకు స్పష్టమైన ఆదేశాలు.

ప్రభుత్వ, ఎన్ఎస్పీ భూములను కబ్జాల నుంచి కాపాడాలి. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న భూములకు చట్టపరంగా విముక్తి కల్పించాలి . భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలి” అని మంత్రి తుమ్మల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### రేవంత్‌తో భేటీకి సిద్ధమైన మంత్రి తుమ్మల...

కల్లూరు మోడల్ సబ్ కలెక్టరేట్ నిర్మాణం, చెరువుల అభివృద్ధి ప్రణాళికలు, భూ పరిరక్షణ చర్యలపై మంత్రి తుమ్మల త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, సమగ్ర నివేదిక సమర్పించనున్నారు.



### పరిపాలనా వ్యవస్థలో కొత్త దిశ....

కల్లూరులో ప్రతిపాదిత మోడల్ సబ్ కలెక్టరేట్ నిర్మాణం అమల్లోకి వస్తే, ఇది రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచించే నమూనాగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సమగ్ర సేవలందించే ఈ సముదాయం భవిష్యత్తులో ఇతర జిల్లాలకు ప్రేరణగా మారనుంది.

## సేవ చేయాలంటే పదవులు అవసరం లేదు



మర్రిగూడ, అక్టోబర్ 19 (జనం సాక్షి) : కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మరిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో 1 కోటి 50 లక్షల సొంత నిధులతో నిర్మించిన మెరుగైన మౌలిక సదుపాయాలను( 9 నూతన తరగతి గదులు, 36 బాత్రూంలు, రెండు ఎకరాల ప్లే గ్రౌండ్ మొదలుగునవి ) ప్రారంభించిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. మర్రిగూడ మండలంలోని కస్తూర్బా పాఠశాలలో కోటి యాభై లక్షలతో నిర్మించిన 9అదనపు గదులు మరియు రెండు ఎకరాలలో ప్లేగ్రౌండ్, 36 బాత్రూమ్స్ మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. ప్రారంభానికి విచ్చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భార్య సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మికి పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మర్రిగూడ కస్తూరిబా పాఠశాల ఒక్కటే కాదు మనుగోడు నియోజకవర్గంలో ఉన్న 18 రెసిడెన్షియల్ పాఠశాలలలో ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తాం. ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు బాగా కష్టపడి చదివి మీ తల్లిదండ్రులకు పేరు తెస్తూ ఈ ప్రాంతానికి కూడా పేరు తీసుకురావాలి విద్యార్థులను ప్రోతించడానికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఎప్పుడు ముందుంటుంది అని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,సివిల్ ఇంజనీర్ శివాజీ,ఎంఈఓ బిట్టు శ్రీనివాస్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్నమనేని రవీందర్రావు,మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్,మాజీ జెడ్పిటిసి లు పాశం సురేందర్ రెడ్డి,మేతరి యాదయ్య,మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,కాంగ్రెస్ మండల నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## 108లో మహిళ ప్రసవం

- తల్లి, బిడ్డ క్షేమం
- 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు



మాడ్గులపల్లి, అక్టోబర్ 19 (జనంసాక్షి) : పురిటి నొప్పులతో బాధపడుతున్న మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామానికి చెందిన మహిళను ఆసుపత్రికి తీసుకువెళ్లాలని 108 సిబ్బంది కి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా తక్షణమే గ్రామానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఆసుపత్రికి తీసుకువెళ్లి మార్గంలో అంబులెన్స్ లోనే ప్రసవం చేసి తల్లి బిడ్డను క్షేమంగా కాపాడిన సంఘటన ఆదివారం జరిగింది. మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామానికి చెందిన వైష్ణవి పురిటి నొప్పులతో బాధపడుతూ 108 కి కాల్ చేయగా వెంటనే స్పందించిన ఈఎంటి రమ్య, పైలెట్ శ్రీను సమయానికిగ్రామానికిచేరుకొని అంబులెన్స్ లో నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో మార్గం మధ్య లోనే వైష్ణవి కి ఈఎంటి రమ్య డెలివరీ చేయడంతో పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది .తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు .ఫోన్ చేయగానే వెంటనే స్పందించిన 108 సిబ్బందికి వైష్ణవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐకమత్యానికి చిహ్నాం గ్యార్వీ ఉత్సవం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబర్ 19 (జనం సాక్షి) : ఐకమత్యానికి గ్యార్వీ ఉత్సవం చిహ్నాంగా ఉంటుందన్నారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్ ). ఆదివారం పట్టణంలోని ఉమ్మడి బాపూజీ నగర్ 7వ వార్డులో నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ప్రత్యేక ఆనవాయితీగా భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. ఈ వేడుకల్లో తాజా మాజీ కౌన్సిలర్లు పాతూరి ప్రసాద్, కొమ్మన నాగలక్ష్మి (సీతక్క), కాంగ్రెస్ సోషల్



మీడియా కన్వీనర్ పాతూరి శరత్, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ఈత సకల ఆరోగ్య ప్రదాయిని



ఖమ్మం రూరల్, అక్టోబర్ 19 (జనం సాక్షి) : ఖమ్మం నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఈత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెల్దారుపల్లి నుండి దానవాయిగూడెం వరకు భారీ ఈత ర్యాలీ నిర్వహించడం జరిగింది.12కిలోమీటర్లు దూరం జరిగిన ఈత ర్యాలీ లో 3సంవత్సరాల చిన్నారుల నుండి 70సంవత్సరాల వయసు గల వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రతి రోజు ఈత కొట్టడం వల్ల మంచి శరీర సౌష్టవం తో పాటు అనారోగ్య సమస్య లకు దూరంగా ఉండొచ్చు అని ఈత మిత్రులు తెలిపారు . ముఖ్యంగా యువత ను ఈత వైపు మళ్లించేందుకు ప్రతి సంవత్సరం ఈత ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఆదివారం తెల్దారుపల్లి నుండి ప్రారంభమై గొల్లగూడెం, ముత్తగూడెం, పల్లెగూడెం మీదుగా దానవాయిగూడెం వరకు 12కిలోమీటర్లు ఈత కొడుతూ ర్యాలీ నిర్వహించడం జరిగింది అన్నారు.ఈత సంఘ అధ్యక్షులు చాగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈత నేర్చుకోవాలని అన్నారు . 200మంది ఈ ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ ఈత కార్యక్రమం లో లెఫ్ట్ కానల్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వెంకటేశ్వరావు, సంఘం సభ్యులు గోపాలపురం వెంకటాచారి, బండి వెంకటేశ్వరావు, మండేపూడి వెంకటేశ్వరావు,అనుమోలు రామిరెడ్డి, కొమ్ము విజయ్ చందర్,బోజెడ్ల ప్రభాకర్ రావు,టేకుమట్ల హుస్సేన్, ప్రింట్ ప్రసాద్, సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో కార్మికుల అరెస్ట్

- ముగ్గురు మంత్రులుండి గిరిజన కార్మికుల జీతాలు తగ్గిస్తారా !
- ఆవేదన వ్యక్తం చేసిన కార్మికులు

ఖమ్మం, అక్టోబర్ 19 (జనం సాక్షి) : గిరిజన సంక్షేమ శాఖలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డైలీ వేజ్, ఔట్సోర్సింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారానికి 38వ రోజుకు చేరుకుంది. ఇన్నాళ్లు విసిగి వేసారిన కార్మికులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుండి సుమారు 300 మంది కార్మికులు ఖమ్మంలోని ఎన్ఎస్పి క్యాంపుకు చేరుకున్నారు. అక్కడి నుండి ప్రదర్శనగా బయలుదేరి భట్టి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళుతుండగా ఖమ్మం ఏసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులు పెద్దపెట్టిన నినాదాలు చేస్తూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్మికులను పోలీసులు వాహనాల్లో అక్కడి నుండి తరలించి ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఈ సందర్భంగా హాస్టల్ డైలీ వేజ్, ఔట్సోర్సింగ్



వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ జీతాలు తగ్గించి గిరిజన కార్మికుల నోటి కాడ బువ్వను ప్రభుత్వం గుంజుకుంటుందని విమర్శించారు. 38 రోజులుగా సమ్మె చేస్తుంటే 20 సార్లు పైగా ఆర్థిక మంత్రికి వినతి పత్రాలు ఇచ్చినా మంత్రి స్పందించకపోవడం బాధ్యత రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 300మంది వర్కర్లను అరెస్టు చేసి వివిద పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉపెందర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్, నాయకులు నాగేశ్వరావు, అనంతరాములు, లక్ష్మన్, మెహన్, కౌసల్య,నర్సింహావు, లక్ష్మి, శ్రీను, హీరాలాల్, ముత్తయ్య,మంగమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం

- బంద్‌ను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు
- బీసీ సంఘాల నాయకుల సమావేశంలోసంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ

ఖమ్మం, అక్టోబర్ 19 (జనం సాక్షి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం ఆగదని బిఆర్ ఎస్ ,బీసీ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ స్పష్టం చేశారు. ఈమేరకు ఖమ్మం లో ఆదివారం జరిగిన బీసీ కులాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ల అమలు బిల్లు పై హైకోర్టు స్టే విధించడవల్ల నే నిరసనగా బంద్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.రిజర్వేషన్ల అమలుకోసం కాంగ్రెస్ ,బిజెపి పార్టీలు బంద్ లో పాల్గొనడం వల్ల వారి బాధ్యత మరింత గాపెరిగిందన్నారు.దీనిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ 9వషెడ్యూల్ లో బిల్లు చేర్చడానికి ఉద్యమించాలని,బిజెపి పార్టీ పార్లమెంటు లో ఆబిల్లు ఆమోదం పొందేందుకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.లేనియెడల బిజెపి, కాంగ్రెస్ పార్టీలు భవిష్యత్ లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు.బంద్ విజయవంతానికి కృషి చేసిన రాష్ట్రకార్పొరేషన్ల చైర్మన్ లు నాయుడు సత్యనారాయణ,రాయల నాగేశ్వర రావు,సీపీఐ(ఎం) నాయకులు పోతినేని సుదర్శన్,నున్నా నాగేశ్వర్రావు,సిపిఐ నాయకులు భాగం హేమంత రావు, దండి సురేష్,సిపిఐ(ఎం ఎల్ మాస్ లైన్) సిపిఐ(ఎం ఎల్ ప్రజాపందా), సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) నాయకులు పోటు రంగారావు,ఆవుల అశోక్, గాగినేపల్లి వెంకటేశ్వర్లు,టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కేతినేని హరీష్ చంద్ర,కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ఎం.ఎస్. పి, నాయకులు తూ రుగంటిఅంజయ్య,బి.ఎస్. పి నాయకులు చెరుకుపల్లి నాగేశ్వరరావు,ఎం.ఆర్. పీ ఎస్,ఎస్సి, ఎస్టీ , ఉపాధ్యాయ,విద్యార్థి, ఉద్యోగ సంఘాలకు,కిరాణం అండ్ జాగిరీ,పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు,ఛాంబర్ ఆఫ్ కామర్స్



వారికీ ఆయన కృత్ఙతలు తెలిపారు.భవిష్యత్ లోనూ రిజర్వేషన్ ల సాధనకోసం జరిగే ఆందోళనలకు కూడా ఇదే తరహా మద్దతు అందించాలని కోరారు ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కురాకుల నాగభూషణం,బొమ్మా రాజేశ్వర రావు,కత్తి నెహ్రూ ,మేకల సుగుణా రావు, పెరుగు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.




# ఐసీఐసీఐ బ్యాంక్ లాభం.. 3 నెలల్లో రూ. 12359 కోట్లు

**ముంబై:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ లాభం 3.2 శాతం పెరిగి (కన్సాలిడేటెడ్) రూ. 13,357 కోట్లకు చేరింది. ప్రొవిజనింగ్ తగ్గడమనేది మార్జిన్ క్షీణత ప్రభావాలను అధిగమించేందుకు తోడ్పడింది. స్టాండెలోన్ ప్రాతిపదికన లాభం రూ. 11,746 కోట్ల నుంచి 5 శాతం వృద్ధితో రూ. 12,359 కోట్లకు చేరింది. మరోవైపు, 10.6 శాతం రుణాల వృద్ధి దన్నుతో కీలకమైన నికర వడ్డీ ఆదాయం 7.4 శాతం పెరిగి రూ. 21,529 కోట్లకు చేరింది. అయితే, నికర వడ్డీ మార్జిన్ మాత్రం 4.36 శాతం నుంచి 4.30 శాతానికి పరిమితమైంది. రాబోయే రోజుల్లో నికర వడ్డీ మార్జిన్లు స్థిర శ్రేణిలో తిరుగాడవచ్చని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ గానీ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గిస్తే ఇది మెరుగు పడొచ్చని, పోటీ తీవ్రత వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపొచ్చని పేర్కొన్నారు. చిన్న వ్యాపార సంస్థల రుణాల నాణ్యత దిగజారే అవకాశాలపై స్పందిస్తూ.. బిజినెస్ బ్యాంకింగ్ సెగ్మెంట్లో రుణాల పరిస్థితి మెరుగ్గానే ఉందని బాత్రా చెప్పారు. అందుకే ఆ విభాగానికి రుణాలను పెంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రిటైల్ రుణాలు సహా క్రెడిట్ వృద్ధి పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశీ కార్పొరేట్ల వద్ద పుష్కలంగా నిధులున్నాయని, రుణాలను సమకూర్చుకునేందుకు ఇతరత్రా మార్గాలు కూడా ఉన్నాయని బాత్రా చెప్పారు.క్యూ2లో వార్షిక ప్రాతిపదికన రూ. 1,233 కోట్ల నుంచి, త్రైమాసికాలవారీగా రూ. 1,815 కోట్ల నుంచి ప్రొవిజనింగ్ రూ. 914 కోట్లకు తగ్గింది. స్థూల మొండిబాకీలు (జీఎన్‌పీఏ) రూ. 5,073 కోట్ల నుంచి స్వల్పంగా రూ. 5,034 కోట్లకు తగ్గాయి. జీఎన్‌పీఏ నిష్పత్తి 1.97 శాతం నుంచి 1.67 శాతానికి తగ్గింది. డిపాజిట్ వృద్ధి 9.1 శాతంగా ఉంది.రిటైల్ రుణాలు 6.6 శాతం పెరిగాయి. మొత్తం లోన్ బుక్‌లో వీటి వాటా 52.1 శాతంగా ఉంది. బిజినెస్ బ్యాంకింగ్ పోర్ట్‌ఫోలియో 24.8 శాతం వృద్ధి చెందింది. కార్పొరేట్ రుణాలు 3.5 శాతం పెరిగాయి.

**క్యాపిటల్ అడెక్వసీ 17.31 శాతంగా ఉంది.**

ట్రెజరీ లావాదేవీలు మినహా వడ్డీయేతర ఆదాయం 13.2 శాతం పెరిగి రూ. 7,356 కోట్లుగా నమోదైంది. ట్రెజరీ ఆదాయం మాత్రం రూ. 680 కోట్ల నుంచి ఏకంగా రూ. 220 కోట్లకు పడిపోయింది.



# 'కొత్త' సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. కోట్లలో జీతాలు



**న్యూఢిల్లీ:**టెక్ రంగంలో నూతన ఉద్యోగాల కోసం పోటీ తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా తాజాగా గ్రాడ్యుయేట్లను లక్ష్యంగా చేసుకుని ఎంట్రీ లెవల్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది.అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ, అర్హత ఉన్న అభ్యర్థులకు మెటా మంచి జీతాలు, స్టాక్ ఆప్షన్లు, ఆరోగ్య ప్రయోజనాలువంటి ఆకర్షణీయమైన ప్యాకేజ్‌లను అందిస్తోంది. మెటా ప్రస్తుతం ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రోడక్ట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లాంటి ఉద్యోగాల కోసం అభ్యర్థులను నియమిస్తోంది. ఈ ఉద్యోగాలకు.. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్ లేదా అప్లైడ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ తప్పనిసరి.అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ సమయంలో లేదా తరువాత ఈ కిందివాటిలో కనీసం ఒకదాన్నైనా కలిగి ఉండాలి. సంబంధిత యూనివర్సిటీ కోర్సు, ఇంటర్న్‌షిప్, థీసిస్

**జీతం ఎంతంటే..:**ఫార్చ్యూన్ నివేదిక ప్రకారం, ఈ ఎంట్రీ లెవల్ పాత్రలకు వార్షిక జీతం 176,000 డాలర్ల నుంచి 290,000 డాలర్ల వరకు ఉంటుంది. భారతీయ కరెన్సీలో చెప్పాలంటే సుమారు రూ.1.46 కోట్ల నుంచి రూ.2.41 కోట్లు అన్న మాట. జీతంతో పాటు వార్షిక బోనస్‌లు, స్టాక్ ఈక్విటీలు, ఆరోగ్య భద్రతా ప్రయోజనాలు, లి ఇతర కార్మిక సంక్షేమ పథకాలు ఉంటాయి.అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఉద్యోగాలు ఆన్-సైట్ మాత్రమే. అంటే వాషింగ్టన్ లేదా కాలిఫోర్నియాలోని మెటా కార్యాలయాల్లో పని చేయాల్సి ఉంటుంది. రిమోట్ వర్క్ ఆప్షన్ ఉండదు.

**ఈ అవకాశాల ప్రాముఖ్యత**

ప్రస్తుతం చాలా కంపెనీలు నూతన గ్రాడ్యుయేట్లను నియమించుకోవడంలో జాప్యం చేస్తుండగా, మెటా మాత్రం యువ ప్రతిభను గుర్తించి, వారిని ఉద్యోగాలలో చేర్చుకోవడంలో చురుకుగా వ్యవహరిస్తోంది. ఆటోమేషన్ పెరుగుతున్న ప్రస్తుత ఉద్యోగ విపణిలో, ఇది ఒక దిగ్గజ కంపెనీ నుంచి వచ్చిన సువర్ణావకాశంగా నిలిచింది.

**మార్క్ జుకర్‌బర్గ్ అభ్యర్థుల్లో చూసేదిదే..**

మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ సాంప్రదాయ విద్యా ప్రమాణాల కంటే ప్రయోజనకర నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ఆయన మాటల్లోనే.."ఒకరు ఏదైనా పనిని లోతుగా నేర్చుకొని అద్భుతంగా చేయగలరని చూపగలిగితే, వారు ఆ నైపుణ్యాన్ని ఇతర రంగాల్లో కూడా వర్తింపజేయగలరు"

కాబట్టి, అభ్యర్థులు తమ అభ్యాస నైపుణ్యాలను, సమస్యలపై అవగాహనను స్పష్టంగా చూపగలగాలి. మెటా లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలను అందుకోవాలంటే జ్ఞానం కలిగి ఉండటం ఒక్కటే సరిపోదు.. దాన్ని ప్రయోగించగలగడం ముఖ్యమైంది.

# మొన్న జెడ్900.. ఇప్పుడు వెర్సిస్ 1100

- **కవాసకి కొత్త బైక్**

**న్యూఢిల్లీ:**జపనీస్ వాహన తయారీదారు.. కవాసకి ఇండియన్ మార్కెట్లో జెడ్900 బైక్ లాంచ్ చేసిన తరువాత, 2026 వెర్షన్ వెర్సిస్ 1100 లాంచ్ చేసింది. దీని ధర రూ. 13.79 లక్షలు (ఎక్స్ షోరూమ్).ఈ అడ్వెంచర్ టూరర్ ఫిబ్రవరి 2025లో భారతదేశంలో తొలిసారిగా వెర్సిస్ 1000 స్థానంలో లాంచ్ అయింది.2026 వెర్షన్ వెర్సిస్ 1100 డిజైన్, ఫీచర్లలో ఎలాంటి మార్పులు కనిపించనప్పటికీ.. పనితీరు పెరిగిందని తెలుస్తోంది. ఇందులోని 1099 సీసీ లిక్విడ్-కూల్డ్, ఇన్-లైన్ ఫోర్ ఇంజన్.. 133 హెచ్‌పి పవర్, 112 ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. పవర్, టార్క్ రెండూ కూడా స్టాండర్డ్ మోడల్ కంటే కొంత ఎక్కువే. కాబట్టి పనితీరు మెరుగ్గా ఉంటుంది.2026 కవాసకి వెర్సిస్ 1100 బైకులో కవాసకి ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, కవాసకి కార్నరింగ్ మేనేజ్‌మెంట్ ఫంక్షన్ కవాసకి ఇంటెలిజెంట్ యాంటీ లాక్ బ్రేక్ సిస్టమ్ వంటి చాలా ఫీచర్స్ ఉన్నాయి. ఈ బైక్ ఫ్యూయెల్ ట్యాంక్ కెపాసిటీ 21 లీటర్లు. కాబట్టి ఇది రోజువారీ వినియోగానికి.. లాంగ్ రైడ్ చేయడానికి చాలా ఉపయోగపడుతుంది.



# జియో ఫైనాన్షియల్ లాభం అంతంతే..!



**ముంబై:**జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (ముకేశ్ అంబానీకి చెందిన) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి (2025-26లో క్యూ2) రూ. 695 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది.క్రితం ఆర్థిక సంవత్స రం ఇదే త్రైమాసికంలో లాభం రూ. 689 కోట్లతో పోల్చితే 0.9% పెరిగింది. క్యూ2లో మొత్తం ఆదాయం రూ.981 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆదాయం రూ. 694 కోట్లు గా ఉంది. అంటే ఆదా యం 40% వృద్ధి చెందింది. వడ్డీ ఆదా యం దాదాపు రెట్టింపు రూ.392 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వడ్డీ ఆదాయం రూ.205 కోట్లుగానే ఉంది.ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో (2025-26 క్యూ2) రూ.561 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.571 కోట్లతో పోల్చి చూస్తే 2 శాతం తగ్గింది. ఆదాయం ఇదే కాలంలో 9 శాతం వృద్ధితో రూ.2,857 కోట్లుగా నమోదైంది. ప్రధానంగా వ్యయాలు 11 శాతం ఎగసి రూ.1,647 కోట్లకు చేరడం లాభాలపై ప్రభావం చూపించింది.వసూలు కాని మొండి రుణాలకు (ఎన్‌పీఏలు) చేసిన కేటాయింపులు 29 శాతం పెరిగి రూ.481 కోట్లుగా ఉన్నాయి. క్యూ2లో డిపాజిట్లు 21 శాతం పరిగి రూ.1.32 లక్షల కోట్లకు చేరాయి. సంజయ్ అగర్వాల్‌ను ఎండీ, సీఈవోగా మరో మూడేళ్ల కాలానికి కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. వాటాదారులు, ఆర్‌బీఐ ఆమోదం తెలిపితే 2026 ఏప్రిల్ 19 నుంచి 2029 ఏప్రిల్ 18 వరకు ఎండీ, సీఈవోగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.

# ఎంత బంగారానికి డిక్లేర్ అవసరం..



**న్యూఢిల్లీ:**భారతీయులకు బంగారం అంటే చాలా ఇష్టం. ఈ కారణంగానే ఎప్పటికప్పుడు, ఎక్కడికి వెళ్లినా గోల్డ్ కొనేస్తూ ఉంటారు. ఇంకొందరైతే గోల్డ్ కొనుగోలు చేయడానికి ప్రత్యేకించి..అరబ్ దేశాలకు వెళ్తున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నిబంధనల ప్రకారం.. భారతీయ ప్రయాణికుల వద్ద ఎంత విలువైన బంగారం ఉంటే డిక్లేర్ చేయాలి అనే విషయాన్ని తెలుసు కుందాం.భారతీయులు యూఏఈకి ప్రయాణించే సమయంలో తమ వద్ద ఉన్న బంగా రం విలువ రూ.13.5 లక్షలకు మించి ఉంటే, దానికి డిక్లేర్ చేయాల్సి ఉంటుంది. అంటే, మీరు వెంట తీసుకెళ్లే బంగారం విలువ.. ఈ పరిమితికి మించి ఉంటే, సంబం ధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. పరిమితికి మించి బంగారం తీసుకెళ్లడానికి లీగల్‌గా ఎలాంటి అనుమతి ఉండదు. కాబట్టి దీనికి ట్యాక్స్, డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. వివాహాలు, పండుగలు లేదా గిఫ్ట్ రూపంలో.. సాంప్రదాయకంగా బంగారు ఆభరణాలను తీసుకెళ్లే భారతీయ పర్యాటకులు, వ్యాపార ప్రయాణికులు ఆ విషయాన్ని తప్పకుండా గమనించాలి.బంగారం అక్రమ రవాణాను తగ్గించేందుకు, ట్యాక్స్ ఎగవేతను అడ్డుకునేందుకు ఈ నిబంధనను అమలు చేస్తున్నారు. డిక్లేర్ చేయకుండా ఎక్కువ బంగారం తీసుకెళితే, దానిని సీజ్ చేయవచ్చు. లేదా మీకు భారీ జరిమానా పడవచ్చు లేదా జైలుశిక్షను కూడా అనుభవించాల్సి ఉంటుంది.

## పెరిగిన యస్ బ్యాంక్ లాభం: రూ. 654 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ నికర లాభం రూ. 654 కోట్లకు చేరింది. గత క్యూ2లో నమోదైన రూ. 553 కోట్లతో పోలిస్తే 18 శాతం పెరిగింది.ఇక లోన్‌బుక్ 6.4 శాతం వృద్ధి చెందడంతో కీలకమైన నికర వడ్డీ ఆదాయం 0.10 శాతం మెరుగుపడి 4.6 శాతానికి చేరింది. ఇతర ఆదాయం 16.9 శాతం పెరిగి రూ. 1,644 కోట్లుగా నమోదైంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.30 | ₹ 5.32 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,19,950 (22 క్యారెట్లు) | ₹ 1,30,860 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,90,000

# గాజాలోని పౌరులపై దాడులు చేస్తే తీవ్రపరిణామాలు

## హమాస్‌కు అమెరికా హెచ్చరికలు



**వాషింగ్టన్:** గాజాలోని పౌరులపై దాడులు చేసేందుకు హమాస్ ప్రణాళికలు రచిస్తోందని కలకలం రేపింది. హమాస్ దాడుల ప్రణాళిక గురించి తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందని అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించింది.దీంతో, రంగంలోకి దిగిన అమెరికా.. హమాస్‌కు హెచ్చరికలు జారీ చేసింది. ఇలాంటి చర్యలకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య సుదీర్ఘ యద్ధం జరిగిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్- హమాస్ ల మధ్య ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా ఇజ్రాయెల్ బందీలను సైతం హమాస్ విడుదల చేసింది. అయితే, గాజాలోని పౌరులపై దాడులు చేసేందుకు హమాస్ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం బయటకు రావడం తీవ్ర కలకలం రేపింది. ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ శాఖ అలర్ట్ అయ్యింది. పాలస్తీనా పౌరులపై హమాస్ దాడి ప్రణాళిక.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని అమెరికా పేర్కొంది. తమ మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో సాధించిన గణనీయమైన పురోగతిని ఇది దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. హమాస్ ఈ దాడులకు పాల్పడితే.. గాజా ప్రజలను రక్షించడానికి, కాల్పుల విరమణ సమగ్రతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తమకు అందిన ఈ సమాచారాన్ని ఈజిప్టు, ఖతార్, తుర్కియేతో సహా శాంతి ఒప్పందానికి హామీగా ఉన్న దేశాలకు తెలియజేసినట్లు యూఎస్ తెలిపింది. దీంతో, మరోసారి గాజాలో ఉద్రిక్త పరిస్థితులు ఉంటాయా అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

# ఎన్డీయేకు బిగ్‌షాక్

## బీహార్ ఎన్నికల్లో మధుర ఎల్‌జేపీ అభ్యర్థి సీమా సింగ్ నామినేషన్ రద్దు



**పట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమికి ఊహించని షాక్ తగిలింది. మధుర అసెంబ్లీ స్థానం నుంచి కూటమి తరపున ఎల్‌జేపీ అభ్యర్థిగా నిలిచిన సీమా సింగ్ నామినేషన్ రద్దైంది.దీంతో, మధుర అసెంబ్లీ స్థానంలో ఎన్డీయే అభ్యర్థి పోటీలో లేకుండా ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాన పోటీ ఆర్‌జేడీ, జన్‌సురాజ్ పార్టీల మధ్య ఉండనుంది.వివరాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా చాప్రా జిల్లాలోని మధుర అసెంబ్లీ స్థానం నుంచి ఎన్‌డీఏ కూటమి తరపున ఎల్‌జేపీ అభ్యర్థిగా సీమా సింగ్ నామినేషన్ వేశారు. మొదటి విడత నామినేషన్ వేయడానికి అక్టోబర్ 17 చివరి తేదీ కావడంతో ఆమె.. శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను అధికారులు శనివారం పరిశీలించగా సీమా సింగ్ నామినేషన్‌లో లోపం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమె నామినేషన్ రద్దు చేసినట్లు డిప్యూటీ ప్రొవిన్షియల్ ఎలక్షన్ ఆఫీసర్ (డీపీఆర్వో) ఓ ప్రకటనలో వెల్లడించారు. అలాగే, ఈ నియోజకవర్గంలో నామినేషన్‌లో లోపం కారణంగా సీమా సింగ్‌తో పాటు మొత్తం నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు ఎన్నికల అధికారి తెలిపారు.సీమా సింగ్ పలు భోజ్‌పురి సినిమాల్లో నటించారు. తన మార్క్ నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, సినిమా రంగం నుంచి ఆమె రాజకీయాల్లోకి వచ్చి అందరనీ ఆశ్చర్యపర్చారు. కాగా, చిరాగ్ పాశ్వాన్ తనకు మధుర స్థానాన్ని కేటాయించిన తర్వాత ఆమె చాలా నియోజకవర్గంపై ఫోకస్ పెట్టి రాజకీయంగా యాక్టివ్‌గా ప్రచారం చేసుకుకున్నారు. మరోవైపు.. ఆమె తన అఫిడవిట్‌లో తొమ్మిదో తరగతి చదివినట్లు పేర్కొన్నారు. దీంతో, ఆమెపై ప్రజల్లో మరింత ఫోకస్ పెరిగింది. ఇదిలా ఉండగా.. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు సీమా సింగ్‌పై కేసు నమోదైంది. ప్రభుత్వ అనుమతి లేకుండా షేక్‌పురాలో ఆమె హెూలీ నిర్వహించిన కారణంగా పోలీసులు కేసు నమోదు చేశారు.



# నేటి నుంచి తెరుచుకోనున్న రఫా క్రాసింగ్

**కైరో:** గాజాకు తిరిగి వచ్చే పాలస్తీనియన్ల కోసం సోమవారం నుంచి రఫా క్రాసింగ్ పాయింట్‌ను తెరిచి ఉంచుతామని పాలస్తీనా దౌత్య కార్యాలయం తెలిపింది. గాజాకు తిరిగి వెళ్లేందుకు తమ వద్ద పేర్లు నమోదు చేయించుకున్న పాలస్తీనియన్ల సంఖ్య భారీగా ఉందని పేర్కొంది. అయితే, ఎందరనే విషయం స్పష్టం చేయలేదు. ఈ ప్రకటనపై ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పందించలేదు.యుద్ధానికి ముందు ఇజ్రాయెల్ నియంత్రణలో లేని బయటి ప్రపంచానికి గాజాకు ఉన్న ఏకైక మార్గం ఈ క్రాసింగ్. గాజాను నియంత్రణ తీసుకున్న తర్వాత 2024 మే నుంచి ఇజ్రాయెల్ దీనిని మూసివేసింది. ఇలా ఉండగా, ఇజ్రాయెల్- హమాస్ మధ్య జరిగిన యుద్ధంలో మృతుల సంఖ్య 68 వేలు దాటిపోయిందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. వారం క్రితం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత మరణాల సంఖ్య పెరిగిందని పేర్కొంది. శిథిలాల తొలగింపు సందర్భంగా మృతదేహాలు బయటపడుతున్నట్లు వెల్లడించింది.

# బిహార్ ఎన్నికల్లోకి జేఎంఎం ఎంట్రీ

## స్వతంత్రంగా ఆరు సీట్లలో పోటీ చేయనున్నట్లు ప్రకటన

**రాంచీ(జనంసాక్షి):** బిహార్ ఎన్నికల వేళ ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)బాంబు పేల్చింది. పక్క రాష్ట్రం బిహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రంగా ఆరు సీట్లలో పోటీ చేయనున్నట్లు జేఎంఎం శనివారం ప్రకటించింది.అదేవిధంగా, ప్రస్తుతం జార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలతో కొనసాగుతున్న పొత్తుపై బిహార్ ఎన్నికల అనంతరం సమీక్షిస్తామని కూడా స్పష్టం చేసింది. జేఎంఎం జనరల్ సెక్రటరీ సుప్రియో భట్టాచార్య మీడియా సమావేశంలో ఈ విషయాలను ప్రకటించారు. బిహార్‌లో తమకు 12 సీట్లు కేటాయించాలని ఇండియా కూటమిని జేఎంఎం కోరింది. స్పందన లేకపోవడంతో స్వయంగా పోటీకి దిగాలని నిర్ణయించుకున్నామన్నారు.

# ఏఐఎంఐఎం తొలి జాబితా

## బీహార్ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులను పేర్లు ప్రకటన

**పట్నా(జనంసాక్షి):**బీహార్‌లో నవంబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం తొలిదశ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా ముస్లిం నేత అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ..బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోయే 25 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ఆదివారం విడుదల చేసింది.బీహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న లెక్కింపు ఉంటుంది. ఏఐఎంఐఎం పార్టీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో.. ఎన్నికల్లో పోటీచేయబోయే అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. బీహార్‌లో అత్యంత అణగారిన ప్రజల గొంతుకగా పార్టీ నిలుస్తుందని దానిలో పేర్కొంది. పార్టీ జాతీయ నాయకత్వం అభ్యర్థులను ఎంపికచేసింది. అమౌర్ నుండి అఖ్తరుల్ ఇమాన్(పార్టీ సీనియర్ నేత), గోపాల్‌గంజ్ నుండి అనస్ సలాం, కిషన్‌గంజ్ నుండి న్యాయవాది షమ్స్ ఆగాజ్, నర్కటియా నుండి షమీముల్ హక్, బహదూర్‌గంజ్ నుండి తౌసీఫ్ ఆలం, నవాడా నసీమా ఖాటూన్ తదితరుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.243 స్థానాలు కలిగిన బీహార్ అసెంబ్లీకి రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ భారీ



స్థాయిలో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. బీజేపీ,జేడీయూలతో కూడిన అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) ఇందు?కు ముమ్మర కసరత్తు చేసింది. అక్టోబర్ 24 నుండి ప్రధాని నరేంద్ర మోదీ బీహార్ అంతటా 12 ర్యాలీలు నిర్వహించనున్నారు. అలాగే ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితరులు కీలక నియోజకవర్గాలలో ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఎన్‌డీఏలో సమన్వయం కనిపిస్తుండగా, 'మహాఘట్‌బంధన్' (గ్రాండ్ అలయన్స్)లో సీట్ల పంపకాల వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. కాంగ్రెస్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ), వామపక్ష పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించినప్పటికీ, సంకీర్ణ వ్యూహం ఇంకా అస్పష్టంగానే ఉంది. తాజాగా జార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఆరు నియోజకవర్గాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తామని ప్రకటించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అక్టోబర్ 18న తన రెండవ జాబితాను విడుదల చేసింది. దానిలో శాశ్వత్ పాండే (నర్కటియాగంజ్), జితేందర్ యాదవ్(పూర్నియా), మహమ్మద్ కమ్రుల్ హెూడా(కిషన్‌గంజ్), మహమ్మద్ ఇర్ఫాన్ ఆలం (కస్బా), మోహన్ శ్రీవాస్తవ (గయా టౌన్) తదితరులు ఉన్నారు.

# జేఈఈ మెయిన్ షెడ్యూల్ విడుదల

ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సంబంధించి ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జనవరి 21 నుంచి 30 మధ్య తేదీల్లో జేఈఈ మెయిన్ ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీల మధ్య సెషన్ -2 పరీక్షలు నిర్వహిం చనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. అ యితే, ఈ పరీక్షలు జరిగే కచ్చితమైన తేదీలను తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపా రు. జేఈఈ మెయిన్ సెషన్ -1 పరీక్షకు ఈ నెల నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ఎన్‌టీఏ పేర్కొంది. సెషన్-2 పరీక్షకు జనవరి ఆఖరి వారం నుంచి దరఖాస్తులు స్వీక రిం చనున్నారు. పరీక్షకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజర య్యేలా ఎగ్జామ్ సిటీల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తున్నామని.. దివ్యాంగ అభ్యర్థుల అవసరాలను తీర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొంది. అర్హత కలిగిన అభ్యర్థులంతా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకొనే ముందే అవసరమైన డాక్యుమెంట్‌లను అప్‌డేట్ చేసుకోవాలని ఎన్‌టీఏ ఇటీవల కోరిన విషయం తెలిసిందే.

# సీనియర్ వేధింపులు.. రాలిన విద్యా కుసుమం



**బెంగళూరు:** భార్యను చంపిన భర్త, యువతిని చంపిన దుండగుడు.. ఇంతలోనే బెంగళూరులో మరో దుర్ఘటన జరిగింది. సీనియర్ వేధింపులను తాళలేక బాగలూరులో ఓ పీజీ హాస్టల్లో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.మృతురాలిని సనా పర్వీన్ (19)గా గుర్తించారు. సనా మరణానికి కాలేజీలో సీనియర్ రిఫాన్ వేధింపులే కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. సనా చదివే కాలేజీలోనే రిఫాన్ చదువు పూర్తి చేసుకుని కాలేజీ వదిలి వెళ్లిపోయాడు.అయినప్పటికీ సనాకు వేధింపులు ఆపలేదు. కేరళకు చెందిన రిఫాన్ గత పది నెలల నుంచి తరచుగా కాలేజీకి వచ్చి వెళ్లేవాడు. పీజీ వద్దకు కూడా వచ్చి సనాను ప్రేమ పేరుతో ఒత్తిడి చేసేవాడు. పలుమార్లు కాలేజీలో గొడవలు కూడా జరిగినట్లు ఆమె స్నేహితులు తెలిపారు. ఇది తట్టుకోలేక ఆమె పీజీలోని గదిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పై బాగలూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.మరోవైపు మహిళలకు, యువతులకు భద్రత కల్పించాలని, దౌర్జన్యాలను అరికట్టాలని ఏఐడీఎస్ఓ సహా పలు స్త్రీవాద, వామపక్ష సంఘాల కార్యకర్తలు బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో ధర్నా చేశారు. మహిళలు సమాజంలో స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారని, దాడులు అధికమైనట్లు వాపోయారు. ప్రభుత్వం దుండగులకు ముకుతాడు వేయాలని నినాదాలు చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
20 అక్టోబర్ 2025

# ప్రాణాల మీదకు తెచ్చిన సేల్ డీడ్

- మాజీ ఉపసర్పంచ్ భర్త జనార్ధన్ ఆత్మహత్యాయత్నం
- జనార్దన్ పరామర్శించిన కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 19,(జనంసాక్షి):** అవసరాన్ని కోసం అప్పు తీసుకుంటే ఇదే అదనుగా భావించిన అప్పు ఇచ్చిన మహానుభావుడు తనకున్న భూమిని సేల్ డీడీ చేసుకుని అధిక వడ్డీని వసూలు చేయడంతో పాటు మరో 25 లక్షలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసుకు న్న ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఎలేటి సుజాత భర్త ఎలేటి జనార్దన్ గత నాలుగు సంవత్సరాల క్రితం మెట్ పల్లి కి చెందిన వడ్డి వ్యాపారి గట్ల గణేష్, గట్ల లవణ్య ల వద్ద రుపాయలు మెదట 5 లక్షలు తిసుకున్నారు. సంవత్సరం గడిచిన తర్వాత వడ్డీకి వడ్డీ వేసి తన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించడంతో యామాపూర్ గ్రామ శివారులోని 82 గుంటల భుమి సుమారు రుపాయలు 60 లక్షల విలువగల భూమిని సెల్ డిడి చేశారు. అప్పుడు 11 లక్షల అప్పు ఇచ్చినట్లు లెక్క చెప్పాడు. జనార్ధన్ ఎప్పటికప్పుడు నెలనెలా వడ్డీ ఇచ్చే క్రమంలో ఎనాడు ఆగలేదు. తన భూమి తనకు రిజిస్ట్రేషన్ చేస్తే డబ్బులు ఇచ్చేస్తానని చెప్పిన సదరు వ్యక్తి పది రూపాయల వడ్డీ చొప్పున లెక్క చేసి రూపాయలు 25 లక్షలు డిమాండ్ చేయటం ప్రారంభించాడు. వెంటనే 25 లక్షలు ఇస్తే భూమి ఇస్తానని లేనిపక్షం లో గ్రామానికి వచ్చి గొడవ చేస్తానని బెదిరించడంతో చేసేదేమీ లేక శనివారం రాత్రి జనార్ధన్ నిద్ర మాత్రలు మింగి ఆత్మహ త్యయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గమనించిన బంధువులు మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. అదివారం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్సను అందిస్తున్నారు.

**జనార్ధన్ ను పరామర్శించిన జువ్వాడి నర్సింగరావు**

యామాపుర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎలేటి సుజాత భర్త కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలేటి జనార్దన్ నిద్ర మాత్రలు మింగి ఆత్మహ త్యయత్నం చేసుకున్న విషయం తెలుసుకొని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు జనార్దన్ పరావ ర్శించారు. అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండి పోరాటం చేయాలని జనార్దన్ కు దైర్యం చెప్పారు.వడ్డీ వ్యాపారుల ఉచ్చులోపడ్డ జనార్ధన్ తో పాటు ఇంకా ఎవరైన బాధితులు ఉంటే రక్షించాలని మెట్ పల్లి సిఐ అనిల్ ను నర్సింగరావు కోరారు.వారి వెంట డాక్టర్ గడ్డం రమేష్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అకుల లింగరెడ్డి, మాజీ ఎంపిపి నెరెళ్ళ దేవేంధర్ ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గుడ శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలకు విశేష స్పందన
- జిల్లా ఖో ఖో సంఘ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** ఖో ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల ఖో ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి జిల్లా క్రీడ పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలా డించారని ముమ్ముందు మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. నిత్య శిక్షణతోనే క్రీడల్లో రాణిం చేందుకు అవకాశాలు ఉంటా యని అన్నారు. జిల్లా యువ జన క్రీడా శాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచేం దుకు కృషి చేయాలన్నారు. ఖో ఖో క్రీడలో కరీంనగర్ కు మంచి పేరు ఉందని గుర్తు చేశారు. ఈ పోటీల్లో కరీంన గర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి 225 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఖో ఖో క్రీడను నిర్వహించి రాష్ట్రస్థాయిలో పాల్గొ నే శిక్షణ శిబిరానికి 20 మంది మహిళలను, 20 మంది పురుషుల ను ఎంపిక చేశారు. పోటీల ముగిం పు సమావేశానికి పెద్దపల్లి జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి ఏ సురేష్ ,సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఏ లక్ష్మణ్, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశా ల లెక్చరర్ టి రమేష్ లు హాజరై ఎంపికైన క్రీడాకా రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భాషా బోయిన వేణుగోపాల్, జిల్లా ఖో ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్ రావు, సంఘ ఉపాధ్యక్షులు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కుమార స్వామి, కోశాధికారి చిట్టి తిరుపతిరెడ్డి, జగిత్యాల జిల్లా సంఘ ప్రతినిధి డాక్టర్ ఎ. రవీందర్, సిరిసిల్ల జిల్లా సంఘ ప్రతినిధి ఎస్కే మోహినిద్దీన్, కరీంనగర్ జిల్లా సంఘ సభ్యులు వి. సూర్యప్రకాష్, కట్ట సంతోష్, వి శ్రీలత, రేణుక, యోగేష్, కరుణాకర్, అశోక్, రాజబా బు, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారులు పండుగ ఆనంద్, వెంకటేష్, కోచ్ ఈ నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవం కంటే మాకు ఏది ముఖ్యం కాదు

- దళితజాతి ఆత్మ గౌరవానికి ఆటంకం కలిగితే ఎంతటి పోరాటానికైనా సిద్ధం
- సీజేఐ గవాయిపై జరిగిన దాడి ముమ్మాటికీ కులాహంకారదాడే..

: మందకృష్ణ మాదిగ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ నెల 27న హైదరాబాదులో జరగబోవు "దళితుల ఆత్మ గౌరవ మహా ర్యాలీ" ప్రదర్శన విజయ వం తంకై ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫె సర్ జి రామ్ రెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెమి నార్ హాల్లో ఈనెల 18న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఎంఎస్ఎఫ్ తెలం గాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి బిఆర్ గవాయిపై దాడి దేశంలోని దళిత ప్రజలందరిపై జరి గిన దాడిగా చూస్తు న్నా మని ఇది దేశ ప్రజ ాస్వామిక విలువలపై, రాజ్యాంగ స్ఫూర్తిపై దాడి జరిగినట్లే అని అన్నారు. దళిత జాతికి ఆత్మగౌ రవం ఎక్కడ ఆటంకం జరిగినా ఈ దేశంలో పోరాడిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌ది అని అన్నారు. సీజేఐ గవా యిపై దాడి చేసిన రాకేష్ కిషోర్ పై కేసు నమోదు చేసి, దాడి కుట్ర వెనుక ఉన్న ఎంత టి వారినైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "దళిత జాతి ఆత్మ గౌరవ పోరా టాలు ఏ విధంగా ఉంటా యో ప్రపంచానికి చాటి చెబుదాం. మాదిగ విద్యార్థులారా సిద్ధ పడండి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా, మండల కేంద్రం లో ఉన్న హాస్టల్స్, కళాశాలల నుండి మాదిగ విద్యార్థులు దళి తుల ఆత్మగౌరవ మహార్యాలీకి వేలాదిగా కద లిరావాలని పిలు పునిచ్చారు. అందుకోసం ఎంఎస్ఎఫ్ నాయకులు పని విభజనతో ప్రత్యేక కార్యాచరణ రూపొంది ంచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశం లో విశిష్ట అతి థిలుగా ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డా .సోమశేఖర్ మాదిగ, తెలంగా ణ రాష్ట్ర అధి కార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి డా.పల్లెర్ల సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముకేశ్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్య క్షులు జనపాల మహేష్ మాదిగ, ఓయూ రాష్ట్ర నాయకులు బుక్కపురం మహేష్ మాది గ, వివిధ జిల్లాల అధ్యక్షులు, అన్ని యూనివ ర్సిటీల ఎంఎస్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటింగ్ శాతం పెంచేలా స్వీప్ కార్యక్రమాలు

**హైదరాబాద్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (ఎస్వీఈఈపీ) కార్యక్రమం భాగంగా ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం పెంచేలా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం అంతటా ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్ఎంసీ కమి షనర్ ఆర్.వి. కర్ణన్ మార్గదర్శనం మేరకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగం పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. రంగవల్లి పోటీలు, ట్రాఫిక్ కూడళ్లలో పోలింగ్ తేదీల ప్రదర్శన, ఎల్ఈడీ ప్రదర్శనల ద్వారా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత ను తెలియజేస్తున్నారు. మహిళలను చైతన్య పరుస్తూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

ఉప ఎన్నికలో అధిక ఓటింగ్ శాతం సాధించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను స్వీప్ నోడల్ అధికారి, సీవీఓ డాక్టర్ అబ్దుల్ వకీల్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

# మున్నూరుకాపుల అభ్యున్నతికి కృషి చేస్తా



**రాజేంద్రనగర్,అక్టోబర్19(జనంసాక్షి):** మున్నూరు కాపుల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తానని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన అధ్యక్షుడు మీరంపల్లి ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్నూరు కాపులు ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు.మున్నూరు కాపు ల అభ్యున్నతికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని అన్నారు. పేద మున్నూరు కాపుల విద్యార్థులు ఉన్నత విద్యను కొనసా గించేందుకు విద్యా సహాయ నిధి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మున్నూరు కాపుల యువతలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్లు, కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు ఏర్పాటు చేయాలనే సంకల్పం వ్యక్తం చేశారు.అలాగే సమాజ ంలోని మహిళల స్వయం ఉపాధి కోసం డ్వాక్రా గ్రూపులకు ప్రోత్సాహం, చిన్న వ్యాపార రుణాల సౌక ర్యం, చేతిపనుల శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. "మున్నూరు కాపుల యువత చదు వులో, ఉద్యోగంలో ముందుకు రావాలంటే మనం సమిష్టిగా పనిచేసి, ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు.

# యువత క్రీడలలోనూ ప్రతిభ చూపాలి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు



**మంథని (జనంసాక్షి) :** యువతే దేశ భవిష్య త్తు అని, చదువుతో పాటు యువత క్రీడల లోనూ ప్రతిభ చూపాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు అన్నారు. ఆదివారం మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో నిర్వ హించిన డీపీఎల్-10 క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన విన్నర్, జీసీఏ టీంకు, రన్నర్ అప్ హరీష్-11 టీం జట్లకు శ్రీను బాబు బహుమతులు అందజేశారు. అనం తరం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, పట్టుదల, జట్టు స్ఫూర్తి వంటి విలువలను పెంపొం దిస్తాయని తెలిపారు. యువత దేశ భవిష్యత్తు అని, వారు చదువుతో పాటు క్రీడలలోనూ ప్రతిభ చూపి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు, క్రీడా మైదానంలో చూపించే కృషి, క్రమశిక్షణ జీవితంలో కూడా విజయా నికి దారి తీస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా యువత సామాజిక సేవ, ప్రజాసేవ రంగాల్లో ముందుకు రావాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ యువతకు ప్రోత్సాహంగా నిలు స్తుందని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలుగుల్లాంటివి

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి తార్నా కలోని తన నివాసంలో పారిశుద్ధ్య కార్మికు లకు దీపావళి సందర్భంగా మిఠాయిలను అం దజేశారు. ఈ సందర్భంగా కార్మికులకు దీపా వళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శుభ్రతలో ముందుండే పారిశుద్ధ్య సిబ్బంది కృషి అభినం దనీయమని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. "నగరాన్ని పరిశుభ్రంగా ఉం చడంలో పారిశుద్ధ్య కార్మికులు చూపుతున్న నిబద్ధతకు మన అందరి నుంచి గౌరవం రావాలి. వారి సేవలు దీపావళి దీపాల్లా వెలు గులు నింపుతున్నాయి" అని అన్నారు.

## హాఫిజ్ పీర్ షబ్బీర్

# మృతి పట్ల జవ్వాద్ సంతాపం



**ఖమ్మం (జనంసాక్షి):** జమియత్ ఉలేమా ఏ హింద్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు, మా జీ ఎమ్మెల్సీ హాఫిజ్ పీర్ షబ్బీర్ మృతి పట్ల హాఫిజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ తీవ్ర సంతా పాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ముస్లింల మత, సామాజిక సమస్యల సాధనకు జీవి తా ంతం కృషి సలిపిన హాఫిజ్ పీర్ షబ్బీర్ ఆదివారం ఉద యం మృతి చెందారని, ఆయ న మృతి ముస్లిం వర్గాలకు మాత్రమే కాకుం డా మానవత వాదం కలిగిన ప్రతి ఒక్కరికి తీరని లోటని పేర్కొన్నారు. పేద ముస్లిం వర్గాలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నాలుగు శాతం రిజర్వేషన్ల కల్పనకు జమియత్ ఉలే మా ఏ హింద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షు డిగా ఆయన ప్రధాన పాత్ర వహించడం ఫలితంగా నాలుగుశాతం రిజర్వేషన్లు ప్రకటి ంచడం జరిగిందన్నారు. జమియత్ ఉలేమా ఏ హింద్ సంస్థతోపాటు ముస్లిం సముదాయానికి ఆయన లేని లోటు పూడ్చ లేనిదని అన్నారు. ఆయన స్ఫూర్తితో మనం ముస్లిం ల సమస్యల సాధనకు, ఇతర సామా జిక సేవ కార్యక్రమాలకు పాటుపడాలని సూచించారు.

## దీపావళి పండుగకి

# జాగ్రత్తలు వహించాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** దీపావళి పండుగను పుర స్కరిం చుకొని పౌరులందరూ టపాసులు కాల్చేట ప్పుడు జాగ్రత్తగా ఉండాలని, పలు జాగ్రత్త చర్యలు పాటించాలని గ్రీన్ హెల్త్ సర్వీ స్ 108 సీఈవో సుధాకర్ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా మేనేజర్ సామ్రాట్ ముందస్తు చర్యలలో భాగంగా ప్రజలకు కొన్ని ముందు జాగ్రత్త చర్యలను సూచించారు. టపాసులు కాల్చు తున్నప్పుడు ఇంటికి బయట దూరంగా పే ల్చాలి, ధ్వని అధికంగా వచ్చే టపాసులు కల్చకపోవడం మంచిది టపాసులు వెలుస్తున్నప్పుడు శరీరానికి వదులుగా నూలు దుస్తులను ధరించాలి, కాళ్లకు చెప్పులు ధరించాలి, కంటి అద్దాలు మాస్కును, ధరించాలి, చేతులలో టపాసులు పేలకుండా జాగ్రత్త వహి ంచాలి. ఈ దీపా వళికి అత్యవసర పరిస్థితులు ఐదు 5% శాతం నుం డి 10 శాతం వరకు కు పెరుగుతాయని అంచనా, మద్యం తాగి వాహ నాలు నడవ కూడదు అని సూచించారు. కేవలం అగ్ని ప్రమాదాలే కాక రోడ్డు యాక్సిడెంట్లు, విద్యుత్ షాక్ మరియు గర్భిణీ స్త్రీలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో మా 108 అత్యవసర స్పందన బృందం రాష్ట్ర వ్యాప్తంగా హాట్స్ స్పాట్ ప్రాంతాల్లో అంబులెన్సు లు సిద్ధంగా ఉంచి ఘటనా స్థలానికి వీలైనంత త్వరగా చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నా మని అత్య వసర పరిస్థితులలో 108 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి సహాయం కోరాలని సూచించారు. తెలంగాణ 108 స్టేట్ హెడ్ :బి సుధాకర్

# శృంగేరి పీఠాధిపతికి ఘన స్వాగతం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19 (జనంసాక్షి):** ధర్మ విజ య యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం వేములవాడలో నేడు శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతి స్వామివారికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ ఎం హరిత, ఎస్పీ మహేష్ బి గితే, ఆర్డీవో రాధబాయి, ఆలయ ఈఓ రమా దేవి సాదర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, మహిళలు కోలాటాలు ఆడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. తెలంగాణ చౌకులో ప్రారంభమైన స్వామివారి ఊరేగింపు రాజన్న ఆలయం వరకు కొనసాగింది. ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూళి పూజ , అనుగ్రహ భాష ణం, చంద్రమౌళీశ్వర పూజలో పీఠాధిపతి పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో భాజపా, కాంగ్రెస్, విశ్వహిందూ పరిషత్, అన్ని కుల సంఘాల నాయకులు, మహిళలు, పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలకు 'ప్రాణవాయివు'

- ఫలిస్తున్న వర్షపు నీటి ఒడిసి పట్టి నేలలో ఇంకించే వ్యూహం
- గతేడాదితో పోల్చితే 3 నుంచి 9 మీటర్లు పైకి భూగర్భజలాలు.
- నిత్యావసరాల నీటి కోసం ట్యాంకర్లకు తాకిడి తగ్గుముఖం..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహా హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారి వాన చినుకు నేలలో ఇంకలేక అడుగం టుతున్న భూగర్భజలాలకు ఇంటింటా ఇంకుడు గుంతలు ప్రాణవాయువుగా మారి జీవం పోస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి సుదూర ప్రాంతాల జలాశయాల నుంచి నీటి తరలించి శుద్ధి చేసి నగర వాసులకు తాగు నీరు సరఫరా చేస్తున్న జలమండలి... నిత్యావసరాలకు అవసర మయ్యే నీటిని కూడా నివాసాల్లోనే అందుబాటులో ఉండే విధంగా వర్షపు నీటి ఒడిసి పట్టి నేలలోకి ఇంకించే దుకు చేపట్టిన 'ఇంకుడు గుంతల యజ్ఞం' సత్ఫలితాలు ఇస్తోంది. బోరు బావుల్లో పాతా ళంలోకి వెళ్లిన భూగర్భజ లాలు పైకి వస్తుండటంతో నిత్యావసరాల నీటి కోసం ట్యాంకర్లకు తాకిడి తగ్గు ముఖం పడుతోంది. హైదరాబాద్‌లో ప్రతి ఏటా సగటున 85 నుంచి 89 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం నమోదవు తున్నా.. అందులో కేవలం 0. 75 నుంచి 0.95 శాతం మాత్రమే నేలలోకి ఇంకడం మిగితాది వరద రూపం లో మురుగు కాల్వలో కలిసి వృధాగా పోవడం సర్వసాధా రణమైంది. నిత్యావసర నీటి సమస్యను అధిగమించేందుకు ప్రతివేసవిలో బోరుబావుల్లో నీటిమట్టం అడుగంటి తాగు నీటి కంటే నిత్యావసరాలకు వినియోగించే నీటికి డిమాండ్ పెరగడంతో జలాశయాల్లో నగర అవసరాలకు కేటాయించిన నీరు సర్దుబాటు చేయడం జలమండలికి భారంగా తయారైంది. సరిగ్గా గత ఏడాది జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి కే. అశోక్ రెడ్డి తొలి మూడు మాసాల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా డిమాండ్‌కు గల వాస్తవ పరిస్థితిపై ఆరా తీశారు. గృహ సముదాయాల్లో ఎండిపోతున్న బోర్లుగా ప్రధాన సమస్యగా గుర్తించారు. పాతాళంలోకి పడిపోతున్న భూగర్భజలాల పెంపుపై కోసం వినూత్నంగా ఆలోచించి ప్రత్యేక కార్యాచరణకు దిగారు. తాగు నీటి సరఫరాతో పాటు .. నిత్యావసరాల వినియోగించే నీరు అందుబాటులో ఉండే విధంగా వర్షపునీటి సంరక్షణకు నడుం భిగించారు. సరిగ్గా ఏడాది క్రితం అక్టోబర్ 2న సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులు మీదుగా ' ప్రతి ఇంటా ఇంకుడు గుంత-90 డేస్ స్పెషల్ డ్రైవ్' పేరిట కార్యాక్రమానికి ప్రారంభింప జేసి నిరంత యజ్ఞంగా కొనసా ంగిస్తూ వస్తున్నారు.

**భూగర్భ జలాలు పెరుగుదల**

జలమండలి పరిధిలో కొనసాగుతున్న 'ఇంకుడు గుంతల యజ్ఞం' తో ,అధిక వర్షపాతం వలన గత వేసవిలో సగటున 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోయిన భూగర్భజల నీటిమట్టం ఇంకుడు గుంతల ప్రభావంతో రెండు నుంచి 11 మీటర్లకు వరకు పైకి చేరుకున్నాయి. గతేడాదితో పోల్చితే సగటున మూడు నుంచి 9 మీటర్ల వరకు భూగర్భజలాలు పెరిగినట్లు భూగర్భజల శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వర్షకాలంలో సాధారణ వర్షపాతం కంటే 42 శాతం అధనంగా నమోదైంది. ఒక వైపు సమవద్ధిగా కురిసన వర్షాలు, మరోవైపు ఇంకుడు గుంతల ఏర్పాటుతో నేలలో పెరిగిన ఇంకిన వర్షపు నీరు శాతం భూగర్భజలాల నీటి మట్టం పెంపుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.




**12 నుంచి 50 శాతం తగ్గిన ట్యాంకర్ల డిమాండ్**

బోరు బావుల్లో భూగర్భజలాలు పెరగడంతో నిత్యావసరాల వినియోగం కోసం వాటర్ ట్యాంకర్‌కు డిమాండ్ భాగా తగ్గుముఖం పట్టింది. మొత్తం మీద 80శాతం వరకు ట్యాం కర్లకు డిమాండ్ కూకట్‌పల్లి, నిజాంపేట, ప్రగతినగర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, మణికొండ, ఎస్ఆర్ నగర్ తదితర డివిజన్ల నుంచి ఉంటుంది. అయితే ఇంకుడు గుంతల ప్రభావంతో భూగర్భజలాలు పెరగడంతో ట్యాంకర్ల బుకింగ్ తగ్గినట్లయింది. గతేడాదితో పోల్చితే ఈ నెల పక్షం రోజుల్లోనే సగటున 12 శాతం తగ్గినట్లు కనిపిస్తోంది.

# సమర్థతకు పట్టం

## తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కూరపాటి





**ఖమ్మం (జనం సాక్షి):** సేవాస్ఫూర్తికి సమాధి లేదు... క్రీడాస్ఫూర్తికి అవధులు లేవు... ఆ రెండు గుణాల సమ్మేళనమై వెలుగుతున్న సేవా రత్నం డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్.. ది తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష పదవిని ఆయనకు అలంకరించడమే క్రీడారంగంలో ఖమ్మం ప్రతిష్ఠకు కొత్త వెలుగుని తెచ్చింది.

### క్రీడానురాగి, క్రీడాసేవకుడు

వైద్య వృత్తిలో బిజీగా ఉన్నప్పటికీ క్రీడల పట్ల ఉన్న అతని మక్కువ ఏనాడూ తగ్గలేదు. దశాబ్దకాలంగా "ఖమ్మం క్రికెట్" అనే పదం "కూరపాటి ప్రదీప్" అనే పేరుతో విడదీయరాని బంధంగా మారింది. డే అండ్ నైట్ మ్యాచ్‌లను ప్రారంభించి కొత్త సంస్కృతికి నాంది పలికిన ఆయన, మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించి ఎందరో ప్రతిభావంతులను వెలుగులోకి తెచ్చారు.

### వైద్యసేవలో మానవత్వం..

ఒక చేతిలో స్టెతస్కోప్, మరో చేతిలో క్రికెట్ బ్యాట్, రెండింటిలోనూ విజేతగా నిలిచిన వ్యక్తి ఆయనే! తలసేమియా చిన్నారులకూ ఉచిత వైద్యం, రక్తదానం, యువత చెడు అలవాట్లనుంచి దూరం కావాలని యువం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు. ఇవి ఆయన జీవితంలో రోజువారీ కృత్యాలే.

### కెప్టెన్‌గానే కాక నాయకుడిగా..

క్రికెట్ జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్‌గా ఖమ్మం క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఆయన, ఇప్పుడు అధ్యక్షుడిగా జట్టును కొత్త ఎత్తులకు చేర్చే సంకల్పంతో ఉన్నారు. ప్రతి క్రీడాకారుడు "నా వెనుక కూరపాటి ఉన్నారు" అనే నమ్మకంతో మైదానంలో అడుగుపెడితే ఆ నమ్మకమే ఖమ్మం విజయానికి మూలధనమవుతుంది. ఖమ్మం క్రీడాకారులు దేశస్థాయిలో ఆడాలి అని నిశ్చయంగా చెప్పిన డాక్టర్ కూరపాటి మాటల వెనుక మూడుదశాబ్దాల అనుభవం, క్రీడాపై ప్రేమ, ఖమ్మం పట్ల మమకారం దాగి ఉంది. క్రీడా ప్రతిభను వెలికి తీసి, దేశం దాకా చాటి చెప్పే దిశగా ఆయన చేస్తున్న కృషి ఖచ్చితంగా ఫలిస్తుందనే విశ్వాసం ప్రతి క్రీడాకారుడిలో ఉంది.

# అలవోకగా ఆస్ట్రేలియా విజయం

- భారత్‌పై 7 వికెట్ల తేడాతో ఆసీస్ విజయం
- తొలి వన్డేలో భారత్ పరాభవం
- నిరాశపరిచిన రోహిత్, కోహ్లి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలైంది. 7 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించింది. మ్యాచ్‌కు వర్షం పలుమార్లు ఆటంకం కలిగించడంతో ఆటను 26 ఓవర్లకు కుదించారు. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులకే పరిమితమైంది. అనంతరం డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆస్ట్రేలియాకు 131 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, 21.1 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (46ని) కీలక ఇన్నింగ్స్ ఆడగా, ఫిలిప్పే (37) ఆకట్టుకున్నాడు. రెన్‌షా (21ని) పరుగులు చేయగా, ట్రావిస్ హెడ్ (8), మాథ్యూ షార్ట్ (8)పరుగులకే ఔట్ అయ్యారు. ఇక భారత్ బౌలర్లలో అర్షదీప్, అక్షర్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ తీశారు. ఇక రెండో వన్డే గురువారం జరగనుంది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు టీమ్ఇండియా 26 ఓవర్లకు 136/9 స్కోరు చేసింది. బ్యాటర్లు విఫలం కావడంతో భారత్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. కేఎల్ రాహుల్ (38), అక్షర్ (31), చివర్లో నితీశ్ (19) రాణించడంతో ఆ మాత్రం స్కోర్ చేయగలిగింది. మిగిలిన బ్యాటర్లలో శ్రేయస్ (11), సుందర్ (10), గిల్ (10), రోహిత్ (8), హర్షిత్ రాణా (1) సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా, కోహ్లీ (0) డకౌట్ అయ్యారు. ఇక ఆసీస్ బౌలర్లలో హేజిల్‌వుడ్ 2, ఓవెన్ 2, కునెమన్ 2 స్టార్క్, ఎల్లిస్ చెరో వికెట్ తీశారు.

### నిరాశపరిచిన రోహిత్, కోహ్లి

ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన రో-కో ద్వయం తీవ్రంగా నిరాశపరించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ (8) పేలవ ప్రదర్శనతో వెనుదిరిగాడు. తన శైలికి భిన్నంగా షాట్లు ఆడి ఇబ్బందులు పడ్డాడు. స్టార్క్ వేసిన తొలి ఓవర్‌లో ఒకటే పరుగు తీసిన రోహిత్, ఆ తర్వాత మూడో ఓవర్‌లో ఒక ఫోర్ మాత్రమే బాదాడు. అనంతరం హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో బంతి ఎడ్జ్ తీసుకుని రెన్‌షా చేతుల్లోకి వెళ్లడంతో 14 బంతులు ఆడిన రోహిత్ వెనుదిరిగాడు. అయితే, కెప్టెన్సీ భారం లేని ప్రస్తుత సమయంలో దూకుడుగా ఆడి టీమ్ఇండియాకు అదిరే ఆరంభాన్ని ఇస్తాడని అందరూ ఆశించినా నిరాశపరిచాడు. ఇక ఆ తర్వాత వచ్చిన మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆట మరి దారుణంగా మారింది. చాలా కాలం తర్వాత మైదానంలో అడుగుపెట్టిన కోహ్లీ, 8 బంతులు ఎదుర్కొని డకౌట్‌గా వెనుదిరిగాడు. మరోసారి తన బలహీనతను చాటుకొని మిచెల్ స్టార్క్ బౌలింగ్ ఆఫ్‌సైడ్ బంతిని ఆడబోయి ఔట్ అయ్యాడు.

మరోవైపు వన్డే జట్టుకు నూతన సారథిగా వచ్చిన శుభ్‌మన్ గిల్ తొలి మ్యాచ్‌లోనే ఇబ్బంది పడ్డాడు. ఒత్తిడికి గురై అనవసరంగా లెఫ్ట్ సైడ్ వెళ్లిన బంతిని ఆడి కేవలం 10 పరుగులకే వెనుదిరిగాడు. వన్డేల్లో ఈ టాప్-3 బ్యాటర్లు తక్కువ పరుగులు చేయడం ఇదే తొలిసారి. ఈ మ్యాచ్‌లో ముగ్గురు కలిపి 18 పరుగులే చేశారు. అంతకుముందు పాక్‌పై 25

# ప్లే-ఆఫ్స్‌కు తెలుగు టైటాన్స్

### ప్రొ కబడ్డీ సీజన్-12



**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ ప్లే-ఆఫ్స్‌కు తెలుగు టైటాన్స్ చాలాకాలం తర్వాత బెర్త్ సంపాదించింది. శనివారం జరిగిన హోరాహోరీ పోరులో తెలుగు టైటాన్స్ 40-31పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్స్‌ను చిత్తుచేసింది. తెలుగు టైటాన్స్ జట్టు 21పాయింట్లను రైడ్‌ల ద్వారా, 14పాయింట్లను ట్యాకిల్స్ ద్వారా సంపాదించడంతోపాటు 4సార్లు ప్రత్యర్థి జట్టును ఆలౌట్ కూడా చేసింది. ఇక పుణేరి పల్టన్స్ రైడ్‌ల ద్వారా 17, ట్యాకిల్స్ ద్వారా 11 పాయింట్లను మాత్రమే సంపాదించగలిగింది. టైటాన్స్ రైడర్ భరత్(11పాయింట్లు), కెప్టెన్ విజరు మాలిక్(10) సత్తా చాటగా.. ట్యాకిల్స్‌లో శుభమ్(5), అంకిత్(4) రాణించారు. ఇక పుణేరి జట్టులో సచిన్(10) మినహా మిగతా ఏ ఒక్కరూ రాణించలేదు. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 33-23పాయింట్ల తేడాతో దబాంగ్ ఢిల్లీని చిత్తుచేసింది.

# రోహిత్ 11 కిలోలు తగ్గాడు!

### రోజూ 3 గంటలు శ్రమించిన స్లిమ్‌గా..



**ముంబయి (జనంసాక్షి) :** టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత రోహిత్ ఫ్యామిలీ ట్రిప్ వెళ్లాడు. తిరిగొచ్చాక అతడు తన ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. మళ్లీ వన్డే స్క్వాడ్‌లో చోటు దక్కాలంటే ఫిట్‌గా మారడం అనివార్యం కావడం.. ఎలాగైనా సన్నబడాలనుకున్నాడు. అందుకు మాజీ కోచ్ అభిషేక్ నాయర్ సాయం తీసుకున్నాడు. ముంబైలో నాయర్ సూచలను పాటిస్తూ కఠినమైన దినచర్య పాటించాడు రోహిత్. తనకెంతో ఇష్టమైన ఆహారానికి సైతం దూరంగా ఉంటూ శ్రమించాడని మాజీ సారథి ఫిట్‌నెస్ వివరాలు పంచుకున్నాడు నాయర్.

'బరువు తగ్గడానికి రోహిత్ చాలా కష్టపడ్డాడు. రోజుకు మూడు గంటలు జిమ్‌లో చెమటోడ్చాడు. ఎక్కువగా కార్డియో వ్యాయామాలు చేసేవాడు. మొదటి ఐదు వారాలు అయితే.. బాడీ బిల్డింగ్ కోసం అన్నట్టుగా శ్రమించాడు. పూర్తిగా సన్నబడాలనుకున్న అతడు ఒకే వ్యాయామాన్ని 700 నుంచి 800 సార్లు చేసేవాడు. అందుకు రోజు గంట, గంటన్నర సెషన్ పట్టేది. ట్రై సెప్స్ కూడా ఎక్కువ చేసేవాడు. క్రాస్ ఫిట్ కోసం 15-20 నిమిషాలు కేటాయించేవాళ్లం. అంతేకాదు ఆహారం విషయంలోనూ క్రమశిక్షణ పాటించాడు. తనకెంతో ఇష్టమైన వడాపావ్.. వంటి చిరుతిళ్లకు దూరమయ్యాడు.

ఇలా వారంలో ఆరు రోజులు.. రోజుకు మూడు గంటలు.. ఇలా మూడు నెలలు బ్రేక్ లేకుండా కష్టించాడు కాబట్టే.. రోహిత్ 11 కిలోలు తగ్గి స్లిమ్‌గా తయారయ్యాడు' అని రోహిత్ ఫిట్‌నెస్ రహస్యం వెల్లడించాడు అభిషేక్ నాయర్. వన్డే స్క్వాడ్‌లో చోటు కోసం తీవ్రంగా శ్రమించి సన్నబడిన రోహిత్.. ఆస్ట్రేలియపై తొలి వన్డేలో ఉసూరుమనిపించాడు. 8 పరుగులకే హేజిల్‌వుడ్ ఓవర్లో ఔటయ్యి అభిమానులను నిరాశపరిచాడు.

# బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యునిగా చాముండేశ్వరనాథ్



**ముంబయి (జనంసాక్షి) :** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) అపెక్స్ కౌన్సిల్ సభ్యునిగా ఆంధ్ర మాజీ క్రికెటర్ వి.చాముండేశ్వర నాథ్ ఎన్నికయ్యారు. ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసిఎ) పురుషుల క్రికెటర్ల ప్రతినిధిగా ఆయన కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. రెండ్రోజులపాటు ఐసిఎ అపెక్స్ కౌన్సిల్ పదవి కోసం ఎన్నిక జరిగింది. ఇందులో చాముండి 755-83 ఓట్ల తేడాతో రాజేశ్ జడేజాపై గెలుపొందారు. ఇప్పటి వరకు చాముండి ఐసిఎ ప్రతినిధిగా ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఉన్నారు. దిలీప్ వెంగ్‌సర్కార్ స్థానంలో ఎపెక్స్ కౌన్సిల్‌లోకి వచ్చిన ఆయన మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.

# కేబినెట్‌పై అవహేళన చేయడం తగదు

- హరీష్ రావు వ్యాఖ్యల పై ఘాటుగా స్పందించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి
- క్యాబినెట్‌లో జరిగిన ప్రతీ అంశాన్ని సిద్దిపేట వెంకటేశ్వర స్వామి సాక్షిగా చెబుతా
- వచ్చే శనివారం నేను గుడికి వస్తా? లేదా మీరే డేట్ టైమ్ చెప్పండి
- మాజీ మంత్రి హరీష్ రావుకు సవాలు విసిరిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** రాష్ట్ర ఎస్సీ , ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యల పై కరీంనగర్ లో ఆదివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేఖర్ల సమావేశంలో ఘాటుగా స్పందించారు. సిద్ధిపేట వెంకటేశ్వర స్వామి ఆలయానికి రానున్న శనివారం వస్తానని, నా తల్లిదండ్రుల పై ప్రమాణం చేసి, క్యాబినెట్‌లో జరిగిన ప్రతి అంశాన్ని స్వామి సాక్షిగా చెబుతా అని మంత్రి అడ్లూరి, మాజీ మంత్రి హరీష్ రావు కు సవాలు విసిరారు. డేట్, టైమ్ నేనే చెబుతున్నా - సిద్ధమా హరీష్ రావు? లేక నువ్వే చెబితే నేనే వస్తా అంటూ సూటిగా ప్రశ్నించారు.

'క్యాబినెట్ పై అవహేళన చేయడం తగదు'

రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రజా సంక్షేమం, విద్య , బీసీ రిజర్వేషన్లు, దళిత సంక్షేమం వంటి అంశాలపై లోతుగా చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. "దళిత, బీసీ, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చే క్యాబినెట్ ఇది. అలాంటి క్యాబినెట్ పై 'దండుపాళ్యం' అని అవహేళన చేయడం అన్యాయం," అన్నారు. "నీతి, ధర్మం, న్యాయం ఉంటే నా సవాల్ స్వీకరించు. తెలంగాణ ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదారి పట్టించడం ఎక్కడివి?" అని అడ్లూరి ప్రశ్నించారు. నీ కుటుంబ సభ్యురాలు కవిత అక్క చేసిన వ్యాఖ్యల పై ముందు సమాధానం చెప్పాలని, గత 10 ఏళ్ల పాలనలో జరిగిన పాపాలు, మోసాల గురించి చెప్పిందని నేరెళ్ల ఘటన పై కవిత చేసిన ఆరోపణలకు జవాబు చెప్పు అని అడ్లూరి నిలదీశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ ఎలా కూలింది? కోట్ల రూపాయల అవినీతికి బాధ్యులు ఎవరు? ముందు దానికి సమాధానం చెప్పండి. మీ హయాంలో రాష్ట్ర ఖజానా దోచుకోవడం, దాచుకోవడమే జరిగిందని మంత్రి మండిపడ్డారు. 2004 ముందు నీ ఆస్తులు ఎంత ఉండేవి? 2023 నాటికి ఎలాగో తెలియని రీతిలో ఆస్తులు కోట్లకు మించి అమాంతంగా పెరిగాయి. రబ్బరు చెప్పులు వేసుకున్న హరీష్ రావు కోట్ల ఆస్తులు సంపాదించారని పత్రికలే రాశాయని వ్యాఖ్యానించారు. దళితులు, బీసీలు క్యాబినెట్‌లో ఉండటం హరీష్ రావు తట్టుకోవడం లేదని, గతంలో ఉప ముఖ్యమంత్రి రాజయ్య, మంత్రి కొప్పుల ఈశ్వర్‌లను కూడా మీరు అవమానించారని అడ్లూరి వ్యాఖ్యానించారు. బీజేపీతో కుమ్మక్కాయింది మీరు, మేము కాదని మేము కాంగ్రెస్ పార్టీ సభ్యులం, ఇది సెక్యులర్ పార్టీ. మత రాజకీయాలతో మాకు సంబంధం లేదు. కానీ బీజేపీతో కుమ్మక్కైనవారు మీరే అని మంత్రి స్పష్టం చేశారు. మా కరీంనగర్ జిల్లాకు చెందిన నీటిని సిద్ధిపేటకు మళ్లించడం ఏ న్యాయం? ఇది సరికాదని హరీష్ రావు మీ నోరు అదుపులో పెట్టుకోండి. ప్రజా ప్రతినిధిగా మాట్లాడే బాధ్యత గుర్తుంచుకోండి అని అడ్లూరి హెచ్చరించారు. ప్రజా హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని ప్రభుత్వానికి ఇంకా మూడేళ్లు సమయం ఉంది. ఆ సమయానికల్లా ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని, ఇప్పటికే నిరుద్యోగులకు గ్రూప్-1, గ్రూప్-2 నియామకాలు పూర్తి చేసి నియామక పత్రాలు ఇచ్చామన్నారు. పేద ప్రజల ఇల్లు సహకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ళను కట్టిస్తున్నామని, అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును, అలాగే మహాలక్ష్మి లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను నెరవేరుస్తున్నామన్నారు. మీ హయంలో పది ఏళ్ల పాటు ఈ పరీక్షలు ఎందుకు జరగలేదు? అని అడ్లూరి ప్రశ్నించారు. మీ హయంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయించలేకపోయారు. కనీస మద్దతు ధర ఇవ్వలేదని మా ప్రభుత్వం మాత్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్సి సెల్ ప్రెసిడెంట్ కొరివి అరుణ్ కుమార్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ తాజుద్దీన్, దండి రవీందర్, చెర్ల పద్మ, సమద్ నవాబ్, కొట్టే ప్రభాకర్, లైక్, నాగరాజు, శిల్ప పాల్గొన్నారు.

# సమాచారం లేకుండా కూల్చివేతలు..

### అధికారుల తీరుపై బాధితుల ఆగ్రహం



**మద్దూర్ (జనంసాక్షి) :** అభివృద్ధి పనుల్లో భాగంగా దుకాణాలను తొలగించిన అధికారుల తీరుపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మద్దూరు పట్టణ కేంద్రంలో ప్రధాన రహదారులను రెండు లైన్లుగా మార్చే క్రమంలో రెండు గంటల చౌరస్తా నుంచి కన్యక పరమేశ్వరి దేవాలయం వరకు ఇరువైపు 35 ఫీట్ల చొప్పున మొత్తం 70 ఫీట్ల రహదారిని విస్తరించే పనులను శనివారం అర్ధరాత్రి ముందస్తు సమాచారం లేకుండా ప్రారంభించారు. రేణుమట్ల చౌరస్తా నుంచి ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ వైపు 35 ఫీట్లు దాటి అవతలి వైపు మిగిలిన ఉన్న దుకాణాలను రాత్రికి రాత్రి ఎలాంటి సమాచారం లేకుండా జేసీబీలతో కూల్చివేయడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 35 ఫీట్లు తొలగించిన కూడా మిగతా భాగాన్ని ఎవరికి చెప్పకుండా తొలగించడం ఏంటని ప్రశ్నించారు. సమాచారం ఇచ్చి దుకాణంలోని, మిషనరీ, షెడ్డు సంబంధిత సామాగ్రిని తీసుకునే వారమని వాపోయారు. పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ లో షాపులు కోల్పోయిన బాధితులు నష్టపరిహారం చెల్లించాలని రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు.

# షాపింగ్‌మాల్‌కు పనికి వెళ్లి యువతి అదృశ్యం



**నర్సాపూర్, అక్టోబర్ 19 (జనంసాక్షి) :** షాపింగ్ మాల్‌కు కూలీకని వెళ్లి యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బొమ్మల తులసి (19) నర్సాపూర్ పట్టణంలో గల వీ మార్ట్ లో కూలీ పని చేస్తుంది. రోజు మాదిరిగానే శనివారం నాడు కూలీ పనికి వెళ్లి రాత్రి 8 గంటలు అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వీ మార్ట్‌కు వెళ్లి ఆరా తీయగా ఆ రోజు తులసి వీ మార్ట్‌కు రాలేదని అక్కడి వారు తెలిపారు. వెంటనే తులసికి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ రావడం జరిగింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఎంత వెతికినా తులసి ఆచూకీ లభించలేదు. నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బలిజ రాజు (ఆటోడ్రైవర్)పై అనుమానం ఉందని తులసి తల్లి బొమ్మల లక్ష్మీ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కూతురు ఇంట్లో నుండి వెళ్లేటప్పుడు గోధుమ రంగు టాప్, తెలుపు రంగు లెగ్గిన్స్ , చున్ని ధరించి ఉందని ఎత్తు 5.5, చామన ఛాయ రంగు కలిగి ఉంటుందని వారు తెలిపారు. చట్టరీత్య తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్ కుమార్ వెల్లడించారు.

# ఇందిరా మహిళా డైయిరీనా చిరకాల వాంఛ

- పాల ఉత్పత్తులతో మధిర నియోజకవర్గం మహిళలు దేశానికి ఆదర్శంగా నిలవాలి
- రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు
- పథకం అమలుతో పదేళ్ల నా కల నెరవేరింది
- పాల ఉత్పత్తులతో సంవత్సరానికి 1000 కోట్లు మధిర నియోజకవర్గం మహిళలు సంపాదించేలా చర్యలు
- త్వరలో బోనకల్లు మండలంలో ఇందిరా మహిళ డైయిరీ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం




**బోనకల్ / ఖమ్మం, అక్టోబర్ 19 (జనంసాక్షి):** పాల ఉత్పత్తుల ద్వారా మధిర నియోజకవర్గం మహిళా సంఘాల సభ్యులు భారత దేశానికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గ ఇందిరా మహిళ డైయిరీ లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని బోనకల్ లోని శ్రీ షిరిడీ సాయి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఇందిరా మహిళా డైయిరీ తన చిరకాల వాంఛ అని, ఉమ్మడి రాష్ట్రంలో 2013 సంవత్సరంలో మధిర నియోజకవర్గంలోని 52,000 మహిళా సంఘాల సభ్యులకు రెండు గేదలు కొని వ్వాలని ఆరోజు భావించానన్నారు. అయితే అదే సమయంలో రాష్ట్ర విభజన జరగడం ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పదేళ్లపాటు ఈ పథకాన్ని పట్టించుకోకపోవడంతో అమలు చేయలేకపోయామన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే మధిర నియోజకవర్గంలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పాటు వారు సమాజంలో పోటీపడి బతకాలని ఈ పథకాన్ని అమలులోకి తీసుకురావడంతో తన చిరకాల వాంఛ నెరవేరింది అన్నారు. ప్రతి మహిళకు రెండు గేదెలను ఇవ్వడంతో పాటు వాటిని కాపాడడానికి వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, గేదెలు ఉండటం కోసం కొట్టాలు మంజూరు చేయడంతో పాటు, సోలార్ ను కూడా మంజూరు చేస్తామన్నారు. భూమి ఉన్న నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేలా వారి పొలాలలో గడ్డిని పెంచిపించి గడ్డిని కూడా సరఫరా చేస్తామన్నారు. ప్రతి నెల గేదెలను వాటి ఆరోగ్యాన్ని పరీక్షించడం కోసం డాక్టర్లు వస్తారని అంబులెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. డాక్టర్లు గేదెల ఆరోగ్యాన్ని పరీక్షించడంతోపాటు గేద ఆరోగ్యం ఎలా ఉంది అనే రిపోర్టు కూడా రూపొందిస్తారని ఎన్ని లీటర్ల పాలు ఇస్తున్నాయని గుర్తిస్తారన్నారు. అదేవిధంగా ప్రతి గేదెకు సంబంధించి హెల్త్ కార్డును అందజేస్తామన్నారు. ప్రతి లబ్ధిదారుడు పాల ఉత్పత్తులు పెంచేలా చూడాలని కనీసం 10 లీటర్లకు పైగా రోజు విక్రయించుకునేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బోనకల్లు మండలంలోని ఇందిరా మహిళా శక్తి పాల పరిశ్రమను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ పరిశ్రమను అమూల్, విజయ డైరీ, హెరిటేజ్ పరిశ్రమల మాదిరిగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఇక్కడి పాల ఉత్పత్తులు దేశవ్యాప్తంగా అమ్మేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. పాల ఉత్పత్తులను పెంచడం ద్వారా మదిర నియోజకవర్గ మహిళలు 1000 కోట్లు సంపాదించేలా చర్యలు తీసుకుంటామని ఈ విధంగా 5 ఏళ్లలో 5000 కోట్లు సంపాదించాలని ఆకాంక్షించారు. ఇందుకు రాష్ట్రంలోనే మధిర నియోజకవర్గం లో ప్రాథమిక పునాది పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసాచారి, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ చందర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

















































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370